VISALAANDHRA VIJAYAWADA PHONE No 47

201324

విశాలాంధ్ర పత్రిక
చందా వివరాలు

	ఏజంటుద్వారా	పోస్టుద్వారా
సంవత్సరం ...	28 00 ...	30 00
ఆరు మాసాలు ...	14 00 ...	15 00
మూడు మాసాలు ...	7 00 ...	7 75
ఒక మాసం ...	2 40 ...	2 60

విశాలాంధ్ర

6 పేజీలు 7 నయాపైసలు రిజిష్టర్డు నెం. 203A

సంపుటి 12 | విజయవాడ • 25 జనవరి 1963 • శుక్రవారం [సంచిక 288

నేడే మ్యాట్నీతో ప్రారంభం
శ్రీ సరస్వతి — విజయవాడ
కనకమహల్ — నెల్లూరు
రోజూ 3 ఆటలు — 26, 27 తేదీలలో 4 ఆటలు
దిల్ తేరా దివానా
షమ్మీకపూర్ * మాలాసిన్హా * మహమూద్
సంగీతం: శంకర్ జైకిషన్ —అంజనాజ రిలీజ్

విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీకి స్వస్తి చెప్పే ప్రయత్నాన్ని వమ్ము చేయాలి

ఆంధ్ర ప్రజానీకానికి శ్రీ మగ్దూం మొహియుద్దీన్, శ్రీ వై. వి. కృష్ణారావు ప్రభృతుల విజ్ఞప్తి

రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ప్రకటన

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, జనవరి 24

రామచంద్రపురం భారీ విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీ పనిని నిలుపుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వును వెంటనే రద్దుచేయాలనీ, ఫ్యాక్టరీ నిర్మాణం యథాతథంగా కొనసాగించడానికి తగు చర్యలను తీసుకోనేటట్లు ఆంధ్ర ప్రజలంతా ఐక్యంగా ఆందోళన చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంపై తగు ఒత్తిడి తేవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ మగ్దుం మొహియుద్దీన్, రాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి శ్రీ వై వి. కృష్ణారావు, శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, మొదలగు శాసనసభ్యులు నేడు ప్రకటనలు చేశారు.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ వై వి కృష్ణారావుగారు ఈ క్రింది ప్రకటన చేస్తున్నారు:

"రామచంద్రపురంలో నిర్మించనున్న భారీ విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీని వదిలివేయాలని భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాల ఆందోళన కలిగించుచున్నది ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధిపట్ల కేంద్రప్రభుత్వం అవలంబించుచున్న సవతితల్లి ప్రేమకు ఇది మరొక నిదర్శనము మొదట్లో ఈ భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీని రెండుగా చీల్చి, ఒకటి మాత్రమే ఆంధ్రకు యిచ్చి రెండవదానిని మద్రాసు రాష్ట్రానికి యిచ్చారు.

"తిరుచిలో నిర్మించుకున్న రెండవ భాగం త్వరత్వరగా పూర్తి అవుతున్నది. రామచంద్రపురంలో నిర్మించుతున్న భాగంలో అభివృద్ధి మందకొడిగా సాగించుతున్నారు ఇప్పుడు దానిని పూర్తిగా ఎత్తివేసి, ఇక్కడున్న అన్ని పరికరాలను తిరుచికి తరలించమని ఉత్తరువులు ఇచ్చారు దీనితోనే సరిపుచ్చుకోలేదు. అత్యవసర పరిస్థితి పేరచెప్పి, రాజేంద్రనగర్ లో నెలకొల్పనున్న వ్యవసాయక విశ్వవిద్యాలయాన్ని కూడా వదలివేసినట్లు చెప్పుకున్నారు. ఇటుపైన ఇంక ఏవి పోతాయో ఎవరికీ తెలియదు.

"రెండవ పంచవర్ష ప్రణాళికలో కూడా ఆంధ్ర పరిశ్రమలకే దెబ్బతీశారు. ఇప్పుడుగూడా మరొకరకంగా అదే తిరిగి జరుగుతున్నది.

"దీనితో ఎంతగానో చెప్పుకున్న ఆంధ్ర పరిశ్రమాభివృద్ధికి తీవ్ర విఘాతం ఘటిల్లుతుంది నదీ జల వివాదాన్నొక దానిని చూపించి, మన నీటి పారుదల పథకాలకు, విద్యుచ్ఛక్తి పథకాలకు ఎంతటి దారుణం తలపెట్టారో నేను వేరుగా చెప్పనవసరం లేదు శ్రీశైలం, పోచంపాడు ప్రాజెక్టులకు కేంద్ర అనుమతి యింతవరకు లభించలేదు

"ఈవిధంగా మొత్తం రాష్ట్రాభివృద్ధి

(మిగతా 2వ పేజీలో)

బాయిలర్ల ఫ్యాక్టరీ పని చురుకుగా సాగుతున్నది

మద్రాసు ముఖ్యమంత్రి కామరాజ్ ప్రకటన

మద్రాసు, జనవరి 23

తిరుచినాపల్లిలోని బాయిలర్ల ఫ్యాక్టరీ పని ఆగిపోదని మద్రాసు ముఖ్యమంత్రి కామరాజ్ ఇక్కడ పత్రికా విలేకరులతో అన్నారు.

"పని మందగించే సమస్యే లేదు నిజానికి పనులు త్వరత్వరగా జరుగుతున్నాయి" అని కామరాజ్ అన్నారు.

హైదరాబాద్ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీవలెనే తిరుచినాపల్లి బాయిలర్ల ఫ్యాక్టరీ కూడా జకోస్లోవేకియా సాయంతో నిర్మించబడుతున్నది మొదట్లో ఈ రెండింటినీ హైదరాబాద్ లోనే స్థాపించాలని ఉద్దేశించబడ్డది.

హైదరాబాద్ భారీవిద్యుత్ పరికరాల ఫ్యాక్టరీ పని ఇంతలోనే నిలిపివేసిన విషయం పాఠకులకు విదితమే. అక్కడి సామానును తిరుచినాపల్లి తరలిస్తున్నారనే వార్తలు కూడా వెలువడ్డాయి.

సిహనౌక్ భారతదేశ ఆగమనం

డమ్ డమ్ విమానాశ్రయంలో ఘన స్వాగతం

కలకత్తా, జనవరి 24

కాంబోడియా అధిపతి సిహనౌక్ ఢిల్లీ వెళుతూ నేడు కలకత్తా అందించారు

సిహనౌక్, ఆయన భార్య, ఇద్దరు కుమారులు, ఇంకా ఇతర అధికారులతో కాంబోడియా విమానం డమ్ డమ్ విమానాశ్రయంలో ఈ వేళ ఉదయం 11-30 గంటలకు దిగింది

విమానాశ్రయంలో ఆయనకు పశ్చిమ బెంగాల్ గవర్నరు శ్రీమతి పద్మజ నాయుడు, భారత దేశ ప్రొటోకోల్ డివిజన్ ఉన్నతాధికారి బెనర్జీ, లెఫ్టినెంట్ జనరల్ హరినారాయణసింగ్, భారత దేశంలోని కాంబోడియా రాయబారి బెంగాల్ పి డబ్ల్యు డి. మంత్రి మొదలయినవారు స్వాగతం ఇచ్చారు.

భారత - కాంబోడియా దేశాలమధ్య గల స్నేహసంబంధాలను దృఢతరం చేయటమే తన పర్యటన ఉద్దేశ్యం అని సిహనౌక్ పత్రికావిలేకరులతో అన్నారు.

ఆయన ఇంకా యిలా అన్నారు.

భారతదేశం ఎదుర్కొంటున్న క్లిష్టపరిస్థితులు ఏమిటో మాకు తెలుసు అందుకు మేము విచారిస్తున్నాం ఈ పరిస్థితులు తొలగిపోవాలి అని మా కాంక్ష. నా భారతీయ మిత్రులకు ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. మీ నిజమైన మిత్రుడుగా మా సహాయం ఎల్లప్పుడూ మీకు లభ్యమవుతుంది.

చైనా - కాంబోడియాల మధ్య గల స్నేహ సంబంధాలు, ఆసియాలోకెల్లా పెద్దవైన ఈ రెండు దేశాలమధ్య గల పరిస్థితిని చక్కబరచటానికి ఉపయోగపడగలవన్నారు.

చిన్న దేశం కావటంవల్ల మేము సరిహద్దు సమస్య పరిష్కారానికి ముందుకు రాలేదు అన్నారు సింహళ ప్రధాని సిరిమావో, కొలంబో మహాసభలో పాల్గొన్న ఇతర దేశాల ప్రతిపాదనలకు తాము బలపరుస్తున్నామన్నారు.

భారతదేశాన్ని సందర్శించవలసిందని ఆహ్వానించినందుకు రాష్ట్రపతి రాధాకృష్ణన్ కు నెహ్రూకు తన అభినందనలు తెలియజేశారు.

తన భారతదేశ పర్యటన చాలా ఉపయోగకరమైనదిగా ఉంటుందని, భారత దేశం తన జాతీయ అభ్యుదయంలో సాధిస్తున్న విజయాలకు తాము అభినందిస్తున్నామని అవి కాంబోడియాకు మార్గదర్శకం కాగలవని అన్నారు. భారతదేశానికి ఉజ్వల భవిష్యత్ కలదన్నారు.

సుభాస్ జ్ఞాపకార్థం తపాలా బిళ్ళలు విడుదల

ప్రధాని వివరణ

న్యూఢిల్లీ, జనవరి 23

నేతాజీ సుభాస్ చంద్రబోస్ జ్ఞాపకార్థం తపాలాబిళ్ళలను విడుదల చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని నేడు ప్రధాని నెహ్రూ అన్నారు. కాని అందుకు కొంత వ్యవధి పడుతుందని, నేతాజీ జన్మదినమైన జనవరి 23వ తేదీ నాటికి విడుదల సాధ్యం కాదని అన్నారు.

14 గురికి ఉరి, 21 మందికి యావజ్జీవ ఖైదుశిక్ష

హరిజనులకు, సవర్ణులకు జరిగిన కొట్లాట కేసులో రాజఘర్ సెషన్సుజడ్జి తీర్పు

ఇండోర్, జనవరి 23

గత సంవత్సరం సెప్టెంబరులో రాజఘర్ జిల్లాకు చెందిన కచ్చోటియా గ్రామంలో హరిజనులకు, సవర్ణులకు జరిగిన కొట్లాట సంబంధించిన కేసులో, రాజఘర్ సెషన్సు జడ్జి 14 మందికి ఉరిశిక్షనూ, 21 మందికి యావజ్జీవితఖైదునూ విధిస్తూ నేడు తీర్పు చెప్పారు.

ఈ కొట్లాట 1962 సెప్టెంబరు 4 న జరిగింది ఆ కొట్లాటలో 6 గురు హరిజనులూ, స్త్రీలూ, పిల్లలతో సహా 18 మంది తీవ్రంగా గాయపడ్డారు.

గ్రామ దేవాలయంలో హరిజనులు ప్రవేశించడానికి ప్రయత్నించిన సందర్భంలో సవర్ణహిందువులకూ, హరిజనులకూ ఈ కొట్లాట జరిగింది.

విద్యుచ్ఛక్తిని మితంగా వాడండి
అది పరిశ్రమలకు అధికంగా కావాలి

బస్సుకు అగ్నిప్రమాదం

పూనా, జనవరి 23

పూనాలోని తిలక్ రోడ్డుపైన ఒక ప్రైవేటుబస్సు నిప్పంటుకొని పూర్తిగా ధ్వంసమైంది.

గుల్హాతి నివేదికపై ఇంకా నిర్ణయం లేదు

న్యూఢిల్లీ, జనవరి 24

కృష్ణా గోదావరి జలాల పంపిణీపై గుల్హాతీ కమిషన్ ఇచ్చిన నివేదిక ఇంకా కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో వున్నదని నేడు లోక్ సభలో కేంద్ర నీటి పారుదల-విద్యుచ్ఛక్తి సహాయమంత్రి శ్రీ ఓ వి అలగేశన్ ప్రశ్నోత్తరాల సమయంలో శ్రీ మోహన్ సింగ్ కు తెలియచేశారు.

"వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి ఒక నిర్ణయానికి రావాలనే మేము ప్రయత్నించుచున్నాము" అని ఆయన అన్నారు.

గుల్హాతీ నివేదికపై కేంద్రప్రభుత్వ నిర్ణయం కోసమని కాచుకొని కూర్చోకుండా నాగార్జున సాగర్ రెండవదశను, శ్రీశైలం, పోచంపాడు ప్రాజెక్టుల నిర్మాణాలను కొనసాగించాలని ఆంధ్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వానికి తెలియదని ఆయన అన్నారు.

శ్రీ యం. లక్ష్మీనారాయణరెడ్డి అకాలమరణం

పత్తికొండ నియోజకవర్గంనుండి ఎన్నికైన మాజీశాసనసభ్యుడు

విజయవాడ, జనవరి 23

మాజీ శాసనసభ్యుడు, కమ్యూనిస్టుపార్టీ సానుభూతి పరుడు శ్రీ మలగవలి లక్ష్మీనారాయణరెడ్డి నిన్న కర్నూలుజిల్లా హొనూరులో చనిపోయారని తెలియ జేయుటకు విచారిస్తున్నాము

శ్రీ లక్ష్మీనారాయణరెడ్డి 1958 లో పత్తికొండ నియోజకవర్గం ఉప ఎన్నికలో స్వతంత్రులుగా పోటీచేసి కమ్యూనిస్టుపార్టీ తోడ్పాటుతో గెల్చారు.

శ్రీ రాజశేఖరరెడ్డి సానుభూతి సంతాపం

విజయవాడ, జనవరి 24

శ్రీ మలగపల్లి లక్ష్మీనారాయణరెడ్డి మరణానికి సంతాపం తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి ప్రధాన కార్యదర్శి శ్రీ నీలం రాజశేఖరరెడ్డిగారిలా ప్రకటిస్తున్నారు.

"శ్రీ లక్ష్మీనారాయణరెడ్డి గారి మరణవార్త చాలా విషాదకరమైనది. విద్యార్థి దశనుండి కూడా ఆయన కమ్యూనిస్టుపార్టీకి అండగా వుంటూ, ప్రజా ఉద్యమాలలో పాల్గొనేవారు పత్తికొండ నియోజకవర్గంలో 1958 ఉప ఎన్నికలలో స్వతంత్రులుగా పోటీ చేసి గెలిచారు

శాసనసభలో కమ్యూనిస్టు బ్లాకు సభ్యుడుగా ఉంటూ అన్ని విషయాలలోనూ పార్టీ పాలసీని బలపర్చేవారు. లక్ష్మీనారాయణరెడ్డి నిరాడంబరజీవి త్యాగశీలుడు. పార్టీకి అవసరం వచ్చినప్పుడల్లా ఎంతో ఆర్థికసహాయం చేసేవారు 40 సంవత్సరములయినా నిండకముందే ఆయన మరణించడం పార్టీకి, ప్రజా ఉద్యమానికి తీరని నష్టం. వారి కుటుంబానికి కమ్యూనిస్టుపార్టీ తరఫున నా సానుభూతి తెలియచేస్తున్నాను

గమనిక
రిపబ్లిక్ దినోత్సవ ప్రత్యేక సంచిక
26-1-63 న 12 పేజీలతో వెలువడుతుంది
వెల : 0-13 న పై మాత్రమే
ఏజంట్లు, పాఠకులు తమ కాపీలు రిజర్వు చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము.
మేనేజరు.

క్రీడారంగంపై కొత్త సోవియట్ మాస పత్రిక

మార్చినుండి ప్రారంభం

మాస్కో, జనవరి 24

"సోవియట్ యూనియన్"కు అనుబంధంగా, సోవియట్ యూనియన్ లో క్రీడారంగం గురించి సమాచారమిచ్చే ఒక కొత్త మాసపత్రిక వచ్చే మార్చినుండి వెలువడుతుంది.

ప్రపంచ వాణిజ్యసంస్థ ఏర్పడాలని సోవియట్ సూచన

ఐరాస, జనవరి 23

అన్ని దేశాలకు సమాన హోదాతో ప్రాతినిధ్యమిస్తూ, ఎటువంటి వివక్ష లేకుండా "ప్రపంచ వాణిజ్య సంస్థ"ను ఏర్పరచవలసిందిగా సోవియట్ యూనియన్ నేడు పిలుపు నిచ్చింది

వచ్చే సంవత్సరం ప్రపంచ వాణిజ్య మహాసభ జరుపుటకు ఏర్పడిన 30 దేశాల కమిటీకి సమర్పించిన నివేదికలో ఈ సూచన చేయబడింది మహాసభ ఆశయాలలో ఈ సంస్థను ఏర్పరచటం ఒకటిగా ఉండాలనికూడ ఆ నివేదికలో సూచించారు.

14 వన్నెలకు మించిన బంగారం ఆభరణాలకు వాడనీయం

ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయానికి తిరుగులేదని లోక్ సభలో మొరార్జీ ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 24

ఆభరణాలకు 14 వన్నెలకుమించిన బంగారం వినియోగించడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలనే కోర్కెను కేంద్ర ఆర్థిక మంత్రి తిరస్కరించారు ఈ విషయంలో కేంద్రం చేసిన నిర్ణయం సరియైనదని, వాస్తవంలో ఈ నిర్ణయం ఏనాడో తీసుకొనవుండవలసిందని అన్నారు

బంగారు కంట్రోలు నిబంధనలపై ప్రభుత్వానికి వచ్చిన విజ్ఞప్తులపై శ్రీ మొరార్జీ నేడు లోక్ సభలో ఒక ప్రకటన చేశారు. ఆయన ఇంకా ఇలా అన్నారు

అనేక దేశాలలో ఆభరణాలకు తొమ్మిది నుండి 14 వన్నెలవరకుగల బంగారాన్నే వాడుతారు. ఇది అనేక శతాబ్దాలుగా ఆ దేశాల్లోవున్న పద్ధతి.

14 వన్నెలున్నా తక్కువ వన్నెగల బంగారంతో ఆభరణాలు చేయడంలో చాలా ఇబ్బందులున్నాయని చెప్పడం అతిశయోక్తి. వెండి, రాగి మొదలగు ఇతర లోహాలతో బంగారును మిశ్రమం చేసి ఆభరణాలకు ఉపయోగించవచ్చు. తొమ్మిది వన్నెల బంగారంతో ఆభరణాలు చేయడం మనదేశంలోకూడ జరుగుతూ వుంది.

ఆరీ తయారు చేయడంలో ఎంత వన్నెగల బంగారు వినియోగించడానికి అనుమతించవచ్చునో బంగారు బోర్డు పరిశీలిస్తున్నది.

ఈ మధ్య ప్రభుత్వం అమలు జరుపుతున్న బంగారు కంట్రోలు నిబంధనలవల్ల చాలామంది నిరుద్యోగులుగా మారుతున్నారని ప్రతిపక్ష సభ్యులు నేడు పార్లమెంటులో మొరార్జీ దృష్టికి తీసుకువచ్చారు.

అంతకుముందు మొరార్జీ దేశాయి మాట్లాడుతూ, ఒక విప్లవాత్మక చర్య తీసికొన్నప్పుడు కొన్ని ఇబ్బందులు తప్పవని, అవి ఎల్లకాలం ఉండవని అన్నారు.

నగలు చేయడానికి స్వర్ణకారులకు వీలున్నదని, నగలు చేయడానికి ఉత్త బంగారమే వాడరు అని ఆయన అన్నారు.

14 క్యారెట్ల నగలను మిషనుతోనే చేయగలరుగాని, చేతితో చేయలేరనటం

(మిగతా 3వ పేజీలో)

ఏలూరులో వెయ్యిమంది స్వర్ణకారుల నిరుద్యోగం

ముఖ్యమంత్రివద్దకు రాయబారం: కలెక్టర్ వద్దకు 500 మంది ఊరేగింపు

ఏలూరు, జనవరి 23

కేంద్ర ప్రభుత్వం జారీచేసిన బంగారు కంట్రోలు ఆర్డర్ వలన ఏలూరు పట్టణంలోని దాదాపు వెయ్యిమంది స్వర్ణకారులకు పని లేకుండా పోయింది దిక్కుతోచని స్థితిలో స్వర్ణకారుల కుటుంబాలనేకం పస్తులతో బాధల పాలైనాయి

ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారు నిన్నటిదినం ఏలూరువచ్చి ఇటీవల మరణించిన, జిల్లాలోని ప్రముఖ కాంగ్రెస్ నాయకులు శ్రీ మూల్పూరి రంగయ్యగారి కుటుంబాన్ని పరామర్శించి, తాడేపల్లిగూడెం వెళుతున్న సందర్భంలో, ఏలూరు రహదారి బంగళావద్ద స్వర్ణకారుల సంఘం ప్రతినిధులు తమ బాధలను వివరించుచూ విన్నపత్రం అందజేశారు.

ఆ తరువాత సాయంత్రం దాదాపు 500 మంది స్వర్ణకారులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఊరేగింపుగా వెళ్ళి కలెక్టర్ అంతరంగిక కార్యదర్శికి ఒక విజ్ఞప్తిని అందజేశారు వీరివెంట శాసన సభ్యులు శ్రీ అత్తులూరి సర్వేశ్వరరావు గారు కూడా వున్నారు.

వెంటనే ప్రత్యామ్నాయంగా తమకు ప్రభుత్వం జీవనోపాధి కల్పించాలని అందులో వారు కోరారు. కనీసం కొంతకాలం వరకైనా 18 క్యారెట్ల బంగారంతో ఆభరణాలు చేయుటకు అనుమతి నివ్వాలని, నిరుద్యోగులైన పనివారలకు ఇతర పరిశ్రమల్లో పనులు చూపించాలని, తక్షణ సహాయం అందజేసి తమ కుటుంబాలను కాపాడాలని కోరారు. (వి వి)

సాహిత్య వారోత్సవం
ఇప్పటికి రు. 5,000 లకు
పైగా ఆర్డర్లు!
నల్గొండజిల్లా ముందంజ!!
గుంటూరు, నెల్లూరు, అనంతపురం, కర్నూలు, వరంగల్ జిల్లాలలో
భారీఎత్తున సన్నాహాలు జరుగునట్లున్నట్టు వార్తలు!!!

నల్గొండ	రు 3000 00
వినుకొండ	1000 00
విజయనగరం	300.00
మహబూబాబాద్	300-00
కంభంపాడు గ్రామకమిటీ	50-00

కేటలాగుల కొరకు వెంటనే వ్రాయండి!
మీ కోటాలను తెలియపర్చండి!!
వారోత్సవం జయప్రదం చేయండి!
విశాలాంధ్ర ప్రచురణాలయం
మాచవరం (P.o) *** విజయవాడ - 4

సోవియట్ పత్రికలకు
చందాదారులుగా చేరండి!
గగారిన్, టిటోవ్, నికోలయేవ్, పోపోవిచ్ మొదలగు
రోదసీయాత్రికుల పన్నెండు పంచరంగుల బొమ్మలుగల
కేలండరు బహుమతిగా పొందండి!!
ఆఖరు తేదీ 28 ఫిబ్రవరి 1963

	1 సం॥చందా	2 సం॥చందా
సోవియట్ యూనియన్ .మాస పత్రిక (ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషలలో)	6.75	10.00
సోవియట్ వుమన్ మాస పత్రిక (ఇంగ్లీషు, హిందీ)	4.25	6.00
సోవియట్ ఫిలిం మాస పత్రిక (ఇంగ్లీషు)	6.75	10.00
ఇంటర్నేషనల్ ఎఫైర్స్ మాస పత్రిక (ఇంగ్లీషు)	6.75	10.00
కల్చర్ అండ్ లైఫ్ మాస పత్రిక (ఇంగ్లీషు)	6.00	9.00
సోవియట్ లిటరేచర్ ... మాస పత్రిక (ఇంగ్లీషు)	6.00	9.00
న్యూటైమ్సు .. వార పత్రిక (ఇంగ్లీషు)	6.00	9.00
మాస్కో న్యూస్ .. వార పత్రిక (ఇంగ్లీషు)	5.00	7.50

క్యాలెండరు పొందే పద్ధతి!
1 మా ఆఫీసుకు వచ్చి చందా చెల్లించినవారు వెంటనే కేలండరు పొందవచ్చును
2 పోస్టుద్వారా చందా చెల్లించినవారికి చందా మొత్తం అందిన వెంటనే కేలండరు పంపగలం
3 ఏజెంటు ద్వారా చందా చెల్లించినవారు ఏజెంటు ద్వారానే పొందాలి మీ చందా ఏజెంటువద్ద నుండి మాకు వచ్చిన తరువాతనే ఏజెంటుకు సప్లయి చేస్తాం
4 అడ్వాన్సుగా కేలండర్లు సప్లయి చేయజాలము. ఏజెంట్లు శాంపిలు కాపీ కొరకు వ్రాయవద్దని విజ్ఞప్తి
నేడే యీ అడ్రసుకు వ్రాయండి!
విశాలాంధ్ర ప్రచురణాలయం,
మాచవరం పోస్టు : విజయవాడ-4

విశాలాంధ్ర

పిడుగుపాట్లు

ఆంధ్రప్రదేశ్‌పై ఒకేసారి నాలుగు పిడుగులు పడ్డాయి.

20 కోట్ల ఖర్చుతో తలపెట్టిన హైదరాబాద్ భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీ పనిని ఆపివేయాలని కేంద్రం చేసిన ఉత్తర్వు ఒకటి

వ్యవసాయ విశ్వ విద్యాలయ స్థాపనా ప్రయత్నాలను మానుకోవలసిందిగా ఇచ్చిన ఆదేశం మరొకటి

సిమెంటు సప్లయిలో నాలుగో వంతు, ఉక్కు కోటాలో మూడో వంతు కోతకోస్తూ జారీచేసిన ఉత్తర్వులు మరి రెండు.

ఈ నాలుగూ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిపై కేంద్రంవేసిన నాలుగు పిడుగులంటే ఆశ్చర్యం లేదు.

ఖమ్మంజిల్లాలో లక్ష టన్నుల దుక్క ఇనుము ఫ్యాక్టరీ స్థాపనకు కేంద్రం లైసెన్సు ఇచ్చిందనేవార్త కాని, కొత్తగూడెంలో మరో నాలుగు నెలలకల్లా బేరియం కెమికల్స్ ఫ్యాక్టరీ ఏర్పడవచ్చునని ప్రకటన కాని, ఇవి ఏవీ ఆంధ్రప్రజలకు కలిగినతీవ్రఆశాభంగాన్ని కొంచెంకూడా తగ్గించలేవు

నిర్మాణం ప్రారంభమై పని జరుగుతున్న విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీని, సిద్ధాన్నాన్ని బోరగిల కోసినట్లు, హఠాత్తుగా ఆపుచేసి, భవిష్యత్తులో ఇంకేవో వస్తాయని కేంద్రం ప్రకటనలుచేస్తే ప్రజలు ఎలా నమ్మగలరు ?

విద్యుత్ ఫ్యాక్టరీ పథకాన్ని కేంద్రం విసర్జించలేదని 100 మెగా టన్నుల టర్బైన్ల ఫ్యాక్టరీని జెకొస్లోవేకియా నిర్మించగలదో లేదో కనుక్కొవటానికి ఒక ప్రతినిధివర్గం విదేశాలకు వెళ్ళగలదని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ అదనపు కార్యదర్శి చేసిన తాజా ప్రకటన కన్నీటి తుడుపుగా ఉన్నదే గాని మరొకటి కాదు. అదే నిజమైతే హైదరాబాద్‌లో జరుగుతున్న నిర్మాణాలను ఆపివేసి, యంత్రాలను మరొకచోటికి తరలించవలసిందిగా ప్రభుత్వం ఎందుకు ఉత్తర్వులివ్వవలసి వచ్చింది ?

రాకరాక ఆంధ్రప్రదేశ్‌కు ఒక్క భారీ పరిశ్రమ, సగభాగమే అయినప్పటికీ వచ్చిందిగదా అని, ఆంధ్రప్రజ సర్దుకుపోయే ధోరణిలో వుండగా, ఆ సగభాగం కూడా కదుతూ కదుతూ ఉన్నప్పుడు మధ్యలో అదృశ్యం కావటంకంటె విషాదకరవార్త మరొకటి ఉండబోదు

భారీ విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీకై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రు 3 కోట్లుఖర్చుచేసింది. ఎంతోకష్టపడి 2 వేల ఎకరాల స్థలం సేకరించింది కోటి రూపాయల ఖర్చుతో భూమి చదును చేసింది రు 75 లక్షలఖర్చుతో ప్రాజెక్టు నివేదిక తయారైంది 400 మంది సాంకేతిక నిపుణులకు వసతి గృహాలేర్పడ్డాయి.

ఒక్క కలంపోటుతో ఇదంతా బూడిదలో పోసిన పన్నీరైపోయింది వందలాది సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లు నిరుద్యోగానికి గురి అయ్యేస్థితి ఏర్పడింది

వ్యవసాయ విశ్వ విద్యాలయం విషయంలోనూ ఇదేజరుగుతున్నది దక్షిణాదికి కేటాయించిన ఒకే ఒక వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆంధ్రకు కేటాయించబడ్డది దీని ఏర్పాటుకై రాష్ట్ర ప్రభుత్వం సకల సన్నాహాలూ చేస్తున్నది ఇందుకు సంబంధించిన బిలు ప్రస్తుతం ఉభయ శాసనసభల సెలెక్టుకమిటీ పరిశీలనలో ఉంది. ఈ విశ్వవిద్యాలయస్థాపనకవసరమైనసహాయాన్ని పరికరాలను, అమెరికాకు చెందిన రాక్‌ఫెల్లర్ సంస్థ, కాన్సాస్ విశ్వవిద్యాలయం అధికారులు వాగ్దానం చేశారు ఇప్పుడీ పథకానికి కేంద్రం స్వస్తి చెప్పింది

సిమెంటు, ఉక్కు సప్లైలలో కేంద్రం విధించిన కోతకూడా చిన్న విషయమేమీకాదు

ప్రతిఏటా ఆంధ్రకు 2 లక్షల టన్నుల సిమెంటు అవసరం. అందుకుగాను కేంద్రం కేటాయించింది, 69,900 టన్నులు తాజాగా విధించిన 25 శాతం కోత ఫలితంగా, మనకు ఏటా లభించేది ఇక 52,000 టన్నులు మాత్రమే అనగా అవసరాలలో నాలుగోవంతు మాత్రమే అందుతుందన్న మాట

ఉక్కు సప్లైలో కూడా మూడో వంతు కోత విధించబడ్డది.

సిమెంటు, ఉక్కు కొరతవలన ఆంధ్రలో ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ కార్యక్రమాలు కూడా మందగించిపోతాయి.

"ఏమిచేయాలనో మాకు తోచడం లేదు నిర్మాణ కార్యక్రమాలను ఆపివేయవలసి ఉంటుంది ప్రాజెక్టు కార్యక్రమాలు కూడా మందగిస్తాయి "

ఈ మాటలు పరిశ్రమల మంత్రి శ్రీ లక్ష్మనరసయ్యగారు చెప్పినవి

సహజంగానే ఆంధ్రలోని అన్ని పక్షాలవారూ ఈ పరిస్థితిపట్ల తీవ్ర ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ముఖ్యంగా భారీ విద్యుత్‌పరికరాల ఫ్యాక్టరీపని ఆపివేయడం అత్యంత బాధాకరమైన విషయం

రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై కేంద్రానికి నిరసన తెలియజేసిందని వింటున్నాం. కేవలం అదిచాలదు ఏది ఏమైనా విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీని నిలబెట్టుకునేందుకు ప్రభుత్వమూ, ప్రతిపక్షాలవారూ ఐక్యంగా తీవ్రకృషి చేయాలి

మొదట్లో ఈ ఫ్యాక్టరీని మొత్తంగా ఆంధ్రలో స్థాపించాలని ఉద్దేశించారు. ఆ పిమ్మట దీనిని రెండుగా విభజించి, సగభాగం ఆంధ్రకూ, బాయిలర్ల నిర్మాణానికి సంబంధించిన సగభాగాన్ని తిరుచినాపల్లికి కేటాయించారు ప్రస్తుతం తిరుచినాపల్లి ఫ్యాక్టరీపని కొనసాగుతూనే ఉంది అంతేకాదు చురుకుగాకూడా సాగుతున్నదని మద్రాసు ముఖ్యమంత్రి అంటున్నారు హైదరాబాద్ విభాగం పనికే 'అభ్యంతరం' వచ్చింది.

పారిశ్రామికంగా మనకంటె ముందున్న మద్రాసువంటి రాష్ట్రాలకు కేటాయించబడిన పరిశ్రమల నిర్మాణం సవ్యంగా జరుగుతుండగా, అభ్యంతరాలు, కోతలు, ఆఖరుక్షణంలో తొలగింపులు ఆంధ్రప్రదేశ్‌కు తటస్థించటమే నిజంగా ఆశ్చర్యకరం

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధిపట్లప్రత్యేకమైనచిన్నచూపును, వివక్షను కేంద్రం ప్రదర్శిస్తున్నదనటానికి ఇదొక తాజా ఉదంతం

వాగ్దానంచేయబడిన పరిశ్రమలు మధ్యలోనే హరించుకుపోవటం ఆంధ్రకు కొత్తకాదు ఆంధ్రకు వస్తాయని ఆశించిన మీటర్‌గేజ్ కోచ్ ఫ్యాక్టరీ, ఎరువుల ఫ్యాక్టరీ విశాఖపట్టణం డ్రైడాక్, నౌకా డీసెల్ ఇంజన్ల ఫ్యాక్టరీ వాగ్దానాలదశలోనే హరించుకుపోయాయి. ఇప్పుడీ విద్యుత్‌పరికరాల ఫ్యాక్టరీ నిర్మాణానికవసరమైన ప్రాథమిక కృషి జరిగిన తర్వాత,మధ్యలో ఆగిపోతున్నది

ప్రాంతీయ విభేదాలను విస్మరించి అందరూ ఐక్యంగాదేశ రక్షణ కృషిలో పాల్గొనవలసిన ఈ సమయంలో,ప్రాంతీయ వైమనస్యాలను రేకెత్తించే ఇలాంటి చర్యలకు కేంద్రం తలపడటం పూర్తిగా అనుచితం.

ఈ ప్రమాదకరమైన యత్నాన్ని కేంద్రం విరమించుకునేటట్లు ఆంధ్ర ప్రజలందరూ ఐక్యంగా కృషి చేయవలసి ఉంది.

భారత విదేశాంగ విధానం కాలపరీక్షను నిల్చింది

గ్రోమికో ప్రసంగం

మాస్కో, జనవరి 28

సోవియట్ యూనియన్‌తో గల సంబంధాలలో భారతవిదేశాంగ విధానం కాల పరీక్షకు నిలబడగల్గిందని సోవియట్ విదేశాంగమంత్రి ఆంద్రీగ్రోమికో నేడిక్కడ అన్నారు.

భారత విదేశాంగ వ్యవహారాలమంత్రిత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆర్. కె. నెహ్రూకు విందు చేసిన సందర్భంలో ప్రధాని నెహ్రూకు టోస్టు చెపుతూ, భారత విదేశాంగవిధానాన్ని,శాంతియుత సహజీవనం, తటస్థ విధానం, స్నేహపూర్వకమైన అవగాహనగా గ్రోమికో వర్ణించారని భారత దౌత్య కార్యాలయ ప్రతినిధి చెప్పారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితిలో ఇది చాల ముఖ్యమైన విషయమనికూడ ఆయన అన్నారు.

పరస్పర అవగాహనకు, ప్రపంచ శాంతి పరిరక్షణకు ప్రధాని నెహ్రూ-క్రుశ్చేవ్‌లమధ్య వ్యక్తిగత సంబంధాలు కూడ చాల ముఖ్యమని గ్రోమికో అన్నారు ఈ ప్రకటనను బట్టి నాయకులిద్దరు కలుసుకునే ఆలోచనలు ఉన్నాయా అన్న ప్రశ్నకు అటువంటి ఉద్దేశమేమీలేదని ఆ ప్రకటన సాధారణమైనదని ఆ ప్రతినిధి అన్నారు

గ్రోమికో గౌరవార్థం విందు చేసిన సందర్భంలో భారతరాయబారి శ్రీ కౌల్ క్రుశ్చేవ్‌కు టోస్టు చెపుతూ, క్రుశ్చేవ్ శాంతి విధానాన్ని, భారత-సోవియట్ యూనియన్‌లమధ్య ఆర్థిక అభివృద్ధిలోను సంస్కృతి శాస్త్రం విద్యల లోను ఉన్న స్నేహ సహకారాన్ని పేర్కొన్నట్లు దౌత్య ప్రతినిధి తెలియచేశారు

విందుకు సోవియట్ రక్షణమంత్రి మార్షల్ మాలినోవస్కీ ప్రభృతులు కూడా హాజరయ్యారు.

భారత-సోవియట్ వాణిజ్యాభివృద్ధిపై [illegible] శ్రీ ఆర్. కె. నెహ్రూ నేడు చర్చించారు. మరింత అభివృద్ధి అయ్యే అవకాశాలున్నట్లు సూత్ర ప్రాయంగా ఉభయదేశాల ప్రతినిధులు ఒప్పుకొన్నట్లు ఆ ప్రతినిధి తెలియచేశారు.

ఈ వేసవిలో మాస్కోలో భారత పారిశ్రామిక ప్రదర్శనకు శాశ్వత ఏర్పాటులను చేయుటకు సోవియట్ యూనియన్ వాగ్దానం చేసింది

ఉభయ దేశాల మధ్య వాణిజ్యం 1962 లో 80 కోట్ల రూపాయలనుండి 100 కోట్ల రూపాయలవరకు ఈ సంవత్సరం పెరిగే అవకాశం ఉన్నట్లు ఆ ప్రతినిధి తెలియచేశారు.

వమ్ము చేయాలి

(1వ పేజీ తరువాయి)

అనేక తరకల పాలయ్యింది ఇది ఆందోళన కలిగించే సమస్య మాత్రమే గాదు. మనకు నిజంగా తలవంపులు తెచ్చే సమస్య.

"కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయపు ఫలితాలు ఎలా వుంటాయో జాగ్రత్తగా ఆలోచించమని కోరుతున్నాను. రామచంద్రపురం ఫ్యాక్టరీని గురించి మరొకసారి ఆలోచించండి

"ఈ విషయంలో జోక్యం కలిగించుకొని మన రాష్ట్రానికి న్యాయంచేయమని ప్రధాన మంత్రికి ఉత్తరాలు, టెలిగ్రాములు, తీర్మానాలు పంపించవలసిందిగా నేను అన్నివర్గాలప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను"

శ్రీ వావిలాల నిరసన

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు భారీ పరికరాల ఫ్యాక్టరీ సమస్యపై ఈ క్రింది విధముగా ప్రకటించుతున్నారు

"నాలుగుకోట్లు ఖర్చు చేసి, దాదాపు వెయ్యిమందికి పనిచూపిస్తూ 6 వేల ఎకరాలలో భవనాలు నిర్మించి ఉత్పత్తి సాగుతుందని ఆశ కలిగిన సమయములో భారీ విద్యుచ్ఛక్తి పరికరాల ప్రాజెక్టును ఎత్తివేయటం, పెద్ద టర్బైన్లను తయారుచేయాలనే కోరికతో ఉన్న దాన్ని ఎత్తివేయటం, ఆంధ్రులకు తీరని అన్యాయం చెకొస్లోవేకియా నిపుణులు ఇక్కడే ప్రాజెక్టు కట్టాలని అందుకుగాను సమగ్రమయిన నివేదిక ఇస్తూ వుండగా హైదరాబాదుకు వచ్చినసామగ్రిని తిరుచినాపల్లికి పంపటం ఆంధ్రులకు ఘోరాపచారము చేయడానికి చేస్తున్న కుట్ర అనిపిస్తున్నది

"ఇదివరలోకూడా మెరైన్ డీసిల్ ఇంజన్ ఫ్యాక్టరీ, డ్రైడాక్, న్యూస్ ప్రింటు ఫ్యాక్టరీ విషయములోకూడా ఇదే జరిగింది. అలాగే రక్షణ దృష్ట్యా హింటర్‌లాండ్‌లో పెట్టవలసిన ఆటమిక్ పవర్ ప్లాంటును హింటర్‌లాండుగావున్న శ్రీశైలంలో పెట్టమని కోరితే, ఎక్కడో ఉన్నతఅధికారంలో వున్నవారి "స్థానిక దేశభక్తి"కి బలి అయిపోయి, ఆంధ్రులకు దక్కకుండాపోయింది

ఆంధ్రులు ఎప్పుడూ ఆందోళన చేస్తారనే అపనింద వేసి లాభము లేదు బ్రతుకో, చావో ఆంధ్రులు తేల్చుకోవాలి

"సరే, శాసనసభ సమావేశములో దానివిషయమై ప్రభుత్వమే ఒకతీర్మానం తీసుకొనిననే అంతా బలపరుస్తారు. దీనిని సాధించడానికి ప్రభుత్వం తీసుకొనే ప్రతిచర్యను ఆంధ్రులు బలపరుస్తారు."

శాసనసభ నేషనల్ డెమోక్రాట్ల ఖండన

రాష్ట్రశాసనసభలోని నేషనల్ డెమోక్రాట్లు శ్రీ యుతులు టి. కె. ఆర్ శర్మ, పి. వెంకటస్వామిరెడ్డి, డి వి సుబ్బశాస్త్రి, వి పి రాఘవాచారి, అతుర్ రహమాన్ గార్లు సంయుక్తంగా ఈక్రింది పత్రికా ప్రకటన చేస్తున్నారు:

"హైదరాబాదుకు 13 మైళ్ళదూరాన వున్న రామచంద్రపురం భారీవిద్యుత్ పరికరాల ఫ్యాక్టరీని ఎత్తివేస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న ఈ కొత్త నిర్ణయం ఆంధ్రులకు ఆందోళనను, కోపాన్ని కలిగించుతున్నది. అప్పుడే ఇక్కడ మూడు కోట్లు ఖర్చుపెట్టి భూమి, ఇండ్లు, వగైరాలు పూర్తిచేశారు ఆంధ్రుల ఆర్థిక సౌష్టవానికి ఇది సరికొత్త విఘాతం ఇది రాష్ట్రాన్ని నీచపరచడానికి చేసిన పని అన్ని ప్రాంతాలను సమంగా అభివృద్ధి చేస్తామని ప్రణాళికా సంఘం చెబుతున్న దానిని ఆంధ్రకు సంబంధించినంతవరకు పదే పదే ఎగగొడుతున్నారు.

"ఆంధ్రలోవ్యవసాయ అభివృద్ధినికుంటుపరిచేవిధంగా, ఏదో ఒక వంకపెట్టి నాగార్జునసాగర్, శ్రీశైలం, పోచంపాడు ప్రాజెక్టులలో జాప్యం చేస్తున్నారు సూచన అణుశక్తి కేంద్రాన్ని, మెరిన్ డీజల్ ఇంజన్ నిర్మాణాన్ని ఆంధ్రుల న్యాయమైన కోర్కెలను నిరాకరించి మద్రాసు రాష్ట్రానికి కేటాయించారు ఈవిధంగా ఒకదానితర్వాత మరొకటి చొప్పున ప్రభుత్వ రంగంలో ప్రధాన పరిశ్రమలన్నీ ఈ రాష్ట్రానికి లేకుండాపోతే, ఈ రాష్ట్రం, ఇతరత్రా పోల్చిచూసుకొంటే పారిశ్రామికంగా కనీసం అర్థశతాబ్దం వెనకబడివుంటున్నది

"నష్టానికితోడు అవమానాన్ని కూడా కలగచేస్తూ, రాజేంద్రనగర్‌లో ఏర్పరచుతామని అన్న వ్యవసాయ విశ్వ విద్యాలయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం వదిలివేస్తున్నది.

"ఈ పరిస్థితులన్నీ ఆలోచించిచూస్తే రాష్ట్ర పాలకపక్ష పార్టీ రాష్ట్రాన్ని పారిశ్రామికంగాను, వ్యవసాయకంగాను అభివృద్ధిపరచడంలో విఫలమవుతున్నదని అభిప్రాయపడుతున్నాము. రాష్ట్రాభివృద్ధికున్న అవరోధాన్ని ప్రభుత్వంచేత తొలగింపచేయడానికి ప్రజలు చొరవతీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

"ఇప్పటికైనా పరిస్థితిని గమనించి రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రతిపక్షాల సహకారం తీసుకుంటూ మన రాష్ట్ర ప్రయోజనాలకు కృషిచేస్తారని ఆశిస్తున్నాము

"త్వరలోనే కేంద్ర ప్రభుత్వందగ్గరకు శాసనసభలోని ప్రతిపక్షాల తరఫున శ్రీ తెన్నేటి విశ్వనాధం గారి నాయకత్వాన ఒక ప్రతినిధివర్గాన్ని పంపించి, ఈ పరిస్థితులను వివరించాలనుకుంటున్నాము."

మగ్దూం ప్రకటన

హైదరాబాదు, జనవరి 24

సుమారు పదివేలమంది కార్మికులకు, పనిచూపించడమే కాక, రాష్ట్రపారిశ్రామికాభివృద్ధికి దోహదంచేయగల రామచంద్రపురం భారీవిద్యుత్ పరికరాలఫ్యాక్టరీ పని ఆపుదలచేస్తూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వు చేసిందనే వార్త ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మహాగ్రహం కలిగిస్తున్నదని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ మగ్దూం నేడుప్రకటించారు

శ్రీ మగ్దూం తన ప్రకటనలో ఇంకా ఇలా అన్నారు:

మూడుకోట్ల రూపాయలు ఖర్చుచేసిన తరువాత ఈ ప్రాజెక్టు పని ఆపివేశారనే వార్త విని ఆంధ్రదేశమంతా దిగ్భ్రాంతి చెందింది.

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా వెనుకబడిన రాష్ట్రం దీన్ని కేంద్రం చాలా ఉపేక్ష వహిస్తూ వచ్చింది. నీటి వనరుల విద్యుచ్ఛక్తి ప్రాజెక్టుల విషయంలో కూడ ఈ రాష్ట్రానికి చాలా అన్యాయం జరుగుతున్నది పోచంపాడు శ్రీశైలంవంటి ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం ఆటంకం కలిగించింది ఇందువల్ల రాష్ట్ర వ్యవసాయ పారిశ్రామికాభివృద్ధి కుంటుపడుతోంది. ఇదికాక, మెరైన్ డీజెల్ ఇంజన్ ఫ్యాక్టరీ, డ్రైడాక్ నిర్మాణ పథకం, బోధన్‌లో న్యూస్‌ప్రింట్ ఫ్యాక్టరీ ఆంధ్రకు కేటాయిస్తామని కేంద్రం వాగ్దానం చేసి తరువాత వెనుకంజ వేసి మాటమార్చింది.

కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకొని ఆంధ్రలో నెలకొల్పనున్న భారీవిద్యుత్ పరికరాల ఫ్యాక్టరీ పనిని యథాతథంగా కొనసాగించేలా ఒత్తిడి చేయడానికి ఆంధ్రలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఆందోళన చేయాలి

ఈ ఫ్యాక్టరీని ఇక్కడనుండి తరలించడం రక్షణ అవసరాలకు గాని, జాతీయ సమైక్యతకు గాని తోడ్పడదు

ఈ సమస్యపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృఢవైఖరి అవలంబించి కేంద్రంపై ఒత్తిడి చేయాలని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ తరఫున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

తాము ఏ కేంద్ర కార్మికసంస్థకు చెందినప్పటికీ, రాష్ట్రంలోని కార్మికులంతా ఈ విషయమై ఐక్యంగా ఆందోళన చేయాలని కోరుతున్నాను. బహిరంగసభలద్వారా, ప్రధానికి లేఖలు, విజ్ఞప్తులు పంపడంద్వారా ఈ సమస్యపై తమ వైఖరిని స్పష్టంచేయాలని కోరుతున్నాను.

శ్రీ సర్వేశ్వరరావు ప్రకటన

ఏలూరు, జనవరి 22

శాసనసభ్యులు శ్రీ ఎ. సర్వేశ్వరరావుగారు ఇల్లా ప్రకటిస్తున్నారు.

"భారీవిద్యుత్పరికరాల నిర్మాణం కోసం మూడుకోట్లు పైగా ఖర్చుపెట్టిన తరువాత ఈ ఫ్యాక్టరీకి కేంద్రప్రభుత్వం ఎగనామం పెట్టడం కన్న ఆంధ్ర ప్రదేశ్‌కు తీరని ద్రోహం, అవమానం, నష్టం వేరేమీ వుండదు అసలు ఈ భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీని ఆంధ్రకు దక్కకుండా చేరసగంచేసి బాయిలర్ నిర్మాణాన్ని తమిళనాడుకు, టర్బైన్ల నిర్మాణాన్ని ఆంధ్రకు కేటాయించడంలోనే మనకు అన్యాయం జరిగింది ఇప్పుడు ఆ సగంకూడా లేకుండా పూర్తిగా కుదిచి పెట్టివేశారు. ఈద్రోహాన్ని ,అపచారాన్ని దిగమింగి ఆంధ్రప్రజలు ఊరుకోవడానికి వీల్లేదు. ఆంధ్రజాతికి అడుగడుగునా ఇటువంటి అన్యాయాలు జరుగుతూనే యున్నవి. సిమెంటు, ఇనుము కోటాలు కోతపెట్టారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఎగగొట్టారు. నదీజలాల వివాదంలో కునితగవు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇవన్నీ చూస్తే ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రంలో ఏమాత్రం ఖాతరు చేయడంలేదని, కొన్ని పలుకుబడి కలిగిన వర్గాలు తమ యిష్టం వచ్చిన విధంగా నిర్ణయాలు మార్పించుకోగలుగుతున్నారని తేటతెల్లమవుతూంది.

"అందుచేత కేంద్ర బడ్జెటు తయారయ్యేలోగానే యావదాంధ్రజాతి రాజకీయ విభేదాలులేకుండా ఒక్కతాటిపై నిలబడి ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును అంధకారం చేసే ఈ ప్రయత్నాలను కొనసాగంటా ఎదిరించి పోరాడాలి.

"కనుక వెంటనే ప్రదేశ్ శాసన సభ ప్రత్యేక సమావేశాన్ని జరిపి అందుకు తగు కార్యక్రమాన్ని తీసికోవాలి. ఈ ప్రత్యేక సమావేశాన్ని జరిపించుకొనుటకై అన్ని రాజకీయ పక్షాలు గట్టిగా పూనుకోవాలి".

కొత్తగూడెం విద్యుత్ ఉత్పాదక కేంద్ర నిర్మాణం

అనుకున్న ప్రకారం జరుగుతున్నదని ప్రభుత్వ ప్రతినిధి వివరణ

హైదరాబాద్, జనవరి 24

కొత్తగూడెం విద్యుచ్ఛక్తి కేంద్రం ప్రాథమిక నిర్మాణం యథాతథంగానే కొనసాగుతుందని ప్రభుత్వాధికారులు నేడు తెలియజేశారు

ఈప్రాజెక్టుకుఆర్థికసహాయం అందించే అమెరికా సంతకాలకు ముందు పూర్తి వివరాలను కోరిందని, వర్కుషాప్ బిల్డింగుల ప్లాను తయారయ్యిందని, అందువల్ల సివిల్ పని ప్రారంభం అయ్యిందని తెలియజేశారు

ఈ పవర్ హౌస్ పనికి రోజుకు 4 మిలియన్ల గాలన్ల నీరు అవసరం అని, అందుకవసరమయిన చిన్న రసాని ప్రాజెక్టు నిర్మాణం త్వరితంగా పూర్తవుతున్నదని అన్నారు

పెద్దాపురం అఖిల భారత బాడ్మింటన్ పోటీలు సమాప్తి

పెద్దాపురం, జనవరి 21

పెద్దాపురంలో మొన్న 17వ తేదీ నుంచి శిల్కా వర్తకుల యాజమాన్యమున జరుగుచున్న శ్రీ ముప్పన సోమరాజు, వీర్రాజు స్మారక తృతీయ వార్షిక అఖిలభారత బాడ్మింటన్, చెడుగుడు, కేరమ్సు అంతిమ పోటీలు 20వ తేదీన సమాప్తమైనాయి.

ఫలితాలు : బాడ్మింటన్ ఫైనల్సులో సోషల్ క్లబ్ (విజయవాడ) వారు గెలిచి ఛాంపియన్‌షిప్ కప్పును పొందగలిగారు. రన్నర్సుగా మల్లయ్య (ఫైవ్‌సు, పెనుగొండ) వారు, తృతీయ స్థానమును జయశ్రీ క్లబ్, (కాకినాడ) వారు చతుర్థ స్థానమునకు వి. వి ఆర్ మెమోరియల్ టీమ్ (అన్నవరం) వారు వచ్చారు. ఈ పోటీలు సెమిఫైనల్సునుండి లీగ్ పద్ధతిని జరిగాయి. చెడుగుడు ఫైనల్సులో కర్రి వెంకట సుబ్బయ్య మెమోరియల్ టీమ్ (గుడివాడ) వారు గెలిచారు. రన్నర్సుగా వివేకానంద మెమోరియల్ టీము (రాజమండ్రి) వారు వచ్చారు. సింగిల్సు పోటీలలో రామమోహనరావు (రాజమండ్రి) గెలిచారు. రన్నర్సుగా కె. సత్యనారాయణ (భీమేశ్వరా టీమ్, కాకినాడ) వచ్చారు. డబుల్సుపోటీలలో వి యల్ రాజు, కె సత్యనారాయణ గార్లు (భీమేశ్వరా టీమ్) గెలిచారు రన్నర్సుగా రామమోహనరావు పేర్రాజు గార్లు వచ్చారు.

డా॥ వేలిన వెంకట్రాజుగారి అధ్యక్షతన బహుమతీ ప్రదానోత్సవ సభ జరిగింది. శ్రీ వీర్రాజు హైస్కూలు విద్యార్థినుల ప్రార్థన గీతముతో సభ ప్రారంభమైంది డా॥ ఎ యస్. బాపిరాజుగారు స్వాగతవచనములు నుడివిన తరువాత ఎనిమిదవ జాతీయబాల్ బాడ్మింటన్ పోటీల్లో అఖండవిజయంసాధించిన ఆంధ్రాస్టేటు క్రీడాకారులకు పోటీల కమిటీవారు ఘనముగా సన్మానము చేశారు పోటీల సహాయ కార్యదర్శి శ్రీ కోటి రామలింగస్వామి వార్షిక నివేదిక సమర్పణానంతరం విజేతలకు ఆంధ్రా బాల్ బాడ్మింటన్ సంఘాధ్యక్షులు శ్రీ ముప్పన రామారావుగారు బహుమతులను పంచిపెట్టారు. ఇంకా పలువురు పెద్దలు ప్రసంగించిన తరువాత వందన సమర్పణతో సభ ముగిసింది.

క్రీడాకారులకు,విచ్చేసిన పెద్దలకుకమిటీవారు విందు ఏర్పాటుచేశారు. ఈ పోటీలను తిలకించుటకు జిల్లాలోగల గ్రామములనుంచి సుమారు రెండువేల ప్రేక్షకులు ప్రతిదినము వచ్చారు.

అక్రమాలన్నింటికీ బాధ్యత దాల్మియాదే

దాల్మియా కంపెనీల దర్యాప్తులో వివియన్ బోసు కమిషన్ నిర్ణయం

పదేండ్లలో దాల్మియా అక్రమ సంపాదన రు. 2 కోట్ల 60 లక్షల 22 వేల 788 లు

న్యూఢిల్లీ, జనవరి 28

"మేము విచారించిన ప్రతి అక్రమ పనికి దాల్మియా బాధ్యుడు ఎందువల్లనంటే, మా ముందున్న ఏ స్టేటుమెంటులోనూ దాల్మియా ఆ అక్రమపనులను నిరాకరించలేదు" అని వివియన్‌బోసు కమిషను తన నివేదికలో తెలియచేసింది,

పది "దాల్మియా-జైను" కంపెనీల వ్యవహారాలను దర్యాప్తు చేసేటందుకు ఈవివియన్ బోసు కమిషను నియమింపబడింది.

ఆ నివేదికలో యింకా ఈ విధంగా వుంది.

"శ్రీ శాంతి ప్రసాద్ జైయిన్, జె దాల్మియా న్యాయవాదులుకూడా, అక్రమాలన్నిటినీ ఆర్. దాల్మియాపై పెట్టేశారు. వాదనలు అంతమయ్యే సరికి, ముఖ్యమైన విషయాలను నిరాకరించడానికి ఆర్ దాల్మియాకు ఏ మాత్రం అవకాశం లేక పోయింది"

వివియన్‌బోసు కమిషన్ సాగించిన దర్యాప్తు నివేదిక 8 వందల పేజీలుంది. అది ముద్రింపబడింది. ఆ నివేదిక నేడు పార్లమెంటు ముందుంచబడింది

ఈకమిషన్ ఛైర్మన్, హైకోర్టున్యాయమూర్తి ఎస్ ఆర్ టెండోల్కర్ ఆయన ఈ దర్యాప్తు సంఘానికి ఛైర్మన్‌గా 1956 లో ఆర్థికమంత్రిత్వశాఖ నియమించింది. మొదట్లో ఈ కమిషన్ (సంఘం) దర్యాప్తు చేయవలసివుంది 9 కంపెనీలు. ఆ తరువాత మరో కంపెనీ ఈ దర్యాప్తులో చేర్చబడింది ఆ తరువాత టెండోల్కర్ చనిపోయారు అప్పుడు న్యాయమూర్తి వివియన్ బోసును యీ దర్యాప్తు సంఘానికి ఛైర్మనుగా 1958 ఆగస్టులో ప్రభుత్వం నియమించింది. ఈ సంఘంలో తదితర సభ్యులు న్యాయమూర్తి శ్రీయుతులు వి ఆర్ సేన్, యస్ ఆర్ మోడీ (చార్టర్డు అకౌంటెంట్) యస్ సి. ఛాధురి (ఇన్‌కంటాక్సు కమిషనరు)

ఆ నివేదికలో ఇంకా ఈ విధంగా వుంది. పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలూ, బ్యాంకులూ, ఇన్సూరెన్సు కంపెనీల సొమ్మును ఇతర కంపెనీల వాటాలను కొనడానికి అక్రమంగా వుపయోగించారని తేలింది ఈసొమ్ము ఆర్. దాల్మియా లాభంకోసం, లేదా, ఆర్ దాల్మియాకు ప్రయోజనాలున్న కంపెనీల లాభాలకోసం వినియోగించబడింది ఈ విధంగా అధికార దుర్వినియోగం జరిగింది.

డి జె గ్రూపు లేదా ఆర్. దాల్మియా ప్రయోజనాలు కల్గివున్న కంపెనీలకు, ప్రజలసొమ్ముగల పబ్లిక్ కంపెనీల ధనాన్ని జామీనులేకుండానూ, తక్కువ వడ్డీలకు రుణాలివ్వడం జరిగింది. కొన్ని సందర్భాల్లో ఆర్. దాల్మియాకు పెద్ద మొత్తాలు అడ్వాన్సులుగా ఇవ్వబడ్డాయి

డి. జె గ్రూపుకు, లేదా ఆర్. దాల్మియాకు లాభకరంగా వుండేందుకుగాను, ఒక కంపెనీ ఆస్తులను మరొక కంపెనీకి బదలాయించుచేయడంద్వారా, ఈకంపెనీల్లో పెట్టుబడిపెట్టిన ప్రజలకు నష్టం వాటిల్లింది.

అవలంబింపబడిన మరో అక్రమపద్ధతి ఇదీ: కంపెనీని స్వచ్ఛందంగా దివాలా తీయించడం, దానికి ఏమీ తెలియని ఒక అమాయకుణ్ణి లిక్విడేటరుగా నియమించడం, ఆ లిక్విడేటరు కోర్టులు మంజూరు చేసిన ఏర్పాటులో ఏకీభవించ, దివాలా ఎత్తిన కంపెనీ రికార్డులనూ, ఆస్తులనూ, పుస్తకాలనూ ఆర్ దాల్మియా కంపెనీకి వప్పగించడం, ఆ కంపెనీ డైరెక్టర్లు ఆర్. దాల్మియాకు కీలుబొమ్మలు కావడంవలన, ఆస్తులను స్వాధీనం చేసుకున్న కంపెనీ, ఆ రికార్డులను, పుస్తకాలను ధ్వంసం చేయడం, ఆ విధంగా మోసాలనూ, కుతంత్రాలనూ బయటపెట్టే చిహ్నాలన్నింటినీ నాశనం చేయటం.

రిజిస్ట్రార్ పాత్ర

రిజిస్ట్రారుల పాత్రనుగురించి ఈ నివేదిక ఈ విధంగా తెల్పింది.

రిజిస్ట్రారులకు గట్టి అధికారాలివ్వక పోతే, వారు సామర్థ్యంగా పనిచేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయకపోతే, వారి ఉనికే వుండకపోవచ్చు డి జె విమానాల కంపెనీ దివాలా సందర్భంలో రిజిస్ట్రారు ఎంత అలక్ష్యంగా వున్నాడో పేర్కొనబడింది.

"తమ చిత్తంవచ్చినట్లు మోసపనులను కొనసాగించే అవినీతిపరులకు ఈ బలహీనతలు తెలుసు వారు వాటిని తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంటారు. కంపెనీలకు రక్షణగా పెట్టిన నిబంధనలని చెప్పబడే వాటన్నింటినీ ఆర్ దాల్మియా సులువుగా దాటగల్గాడు ఒకో సందర్భంలో ఆయన వాటిపట్ల ఈసడింపును ప్రకటించాడు

ఈసంబంధకోణంవలన, ఆర్. దాల్మియా స్వంతంగా గాని పూర్తిగానో, చాల భాగంవరకూ ఆయనకు చెందిన కంపెనీలద్వారానో గాని ఆయన పొందిన సొంత లాభాల మొత్తం రు. 2 కోట్ల 60 లక్షల, 22 వేల 788.

ఆయన 1946-56 సంవత్సరాల మధ్య ఈ అక్రమలాభాన్ని ఆర్జించాడు

ఈ సొంత లాభాలు కాక, డి జె గ్రూపు కంపెనీలుగాని, లేదా ఆ గ్రూపు సభ్యుల్లో ఒకరికన్నా ఎక్కువమంది గాని, ప్రత్యేకంగా ఆర్ దాల్మియా, గాని పన్నులను తప్పించుకోవడంవలన పొందిన లాభాలు రు 1 కోటి 46 లక్షల 19 వేల 790.

ఈ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన వారికి కల్గిన నష్టం రు 2 కోట్ల, 60లక్షల 50 వేల 480

డి జె గ్రూపును రద్దు చేయడంపై ఈ నివేదిక యీ విధంగా పేర్కొన్నది

1948 మే 31 న డి. జె గ్రూపు కంపెనీలు రద్దు చేయబడినవన్న దానిని దర్యాప్తు సంఘం నమ్మడం లేదు. దర్యాప్తులోవున్న పది కంపెనీలు ఆర్ దాల్మియా అజమాయిషీలో వున్నాయని సాక్ష్యంవుంది ఆసాక్ష్యాన్ని ఈ సంఘం ఆమోదిస్తున్నది కనుక, ఈ కంపెనీల్లో ఏ సభ్యుడైనా ఈ పది కంపెనీల వ్యవహారాల్లో ఏ ఒక్క దానితో సంబంధం కలిగివున్నప్పటికీ, ఆ సభ్యుడు ఈ గ్రూపు కంపెనీల లాభంకోసం లేదా, ఆర్ దాల్మియా లాభంకోసం పని చేసినట్లుగా ఈసంఘం భావిస్తున్నది.

వ్యవసాయ విశ్వ విద్యాలయ స్వస్తికి నిరసన

హైదరాబాద్ జనవరి 26

వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఎగనామం పెట్టటంపట్ల ఆంధ్రప్రదేశ్ విద్యార్థి నాయకులు నేడు తమ ఆక్రోశాన్ని వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కొల్లి నాగేశ్వరరావు, హైదరాబాద్ స్టూడెంట్సు యూనియన్ అధ్యక్షుడు శ్రీ పి. రవికుమార్ ఒక ప్రకటనచేస్తూ ఈ చర్య ప్రభుత్వం ప్రకటించిన విధానాలకే విరుద్ధంగా ఉన్నదన్నారు.

ఒకప్రక్క దేశంలో అత్యవసరపరిస్థితి ఉన్నదనీ, ఉత్పత్తిని అధికంచేయటం కోసం సాంకేతిక విద్యను అధికంచేయాలని చెబుతూ రెండవ ప్రక్క ఇలా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఎగనామం ఎందుకు పెట్టాలో అర్థం కావటంలేదు.

ఉత్పత్తి పెంచాల్సిన అవసరం వుండగా ఈ పని తగదన్నారు.

వెంటనే ఎటువంటి ఆలస్యంలేకుండా విశ్వవిద్యాలయం పని ప్రారంభించాలని ఆందోళన చేయవలసిందిగా రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రిపబ్లికన్‌పార్టీ విజ్ఞప్తి

విద్యుచ్ఛక్తి పరికరాలను భారీపరిశ్రమ మన రాష్ట్రం నుండి పరాయి ప్రాంతాలకు పోకుండా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలని విజ్ఞప్తి చేస్తూ గత రాత్రి ఆంధ్రప్రదేశ్ రిపబ్లికన్ పార్టీ ఒక తీర్మానం చేసింది.

మధ్యప్రదేశ్‌లో [illegible] ఉత్పత్తిదారుల సహకార రంగంలో ప్రాసెసింగు కర్మాగారం స్థాపించదలచుకున్నారు.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత

అత్యంత పవిత్రమైనదని 'ప్రావ్దా' సంపాదకీయం

మాస్కో, జనవరి 28

సోవియట్ యూనియన్‌కు చైనాతో గల సిద్ధాంత విభేదాలలో ప్రావ్దా నేడు దృఢంగా సోవియట్ విధానాన్ని పునరుద్ఘాటించింది. కాని, చైనాను పేరుపెట్టి విమర్శించలేదు.

తూర్పుజర్మనీ కమ్యూనిస్టుపార్టీ మహాసభలో వివాదానికి సంబంధించిన పరస్పర దూషణలకు స్వస్తి చెప్పాలని క్రుశ్చేవ్ యిచ్చిన పిలుపుకు ఈ సంపాదకీయం అనుగుణంగా ఉందని పరిశీలకులు అంటున్నారు.

క్రుశ్చేవ్ యిచ్చిన పిలుపు చాల మంది బలపరచటం, హర్షించటం జరిగిందని ఆ సంపాదకీయంలో ఉంది.

సంపాదకీయంలో ఇంకా ఇలా ఉంది:

'ప్రపంచకమ్యూనిస్టు ఉద్యమ సాధారణ మార్గదర్శినిని సోవియట్ కమ్యూనిస్టులు పూర్తిగా బలపరచారని క్రుశ్చేవ్ జర్మనీ మహాసభలో ప్రకటించారు. శాంతి, సోషలిజం కొరకుజరిగే పోరాట విధానంలో మార్పులేదు."

"ప్రపంచకమ్యూనిస్టుఉద్యమ సాధారణ మార్గదర్శినిని వ్యతిరేకించే ఆల్బేనియా లేబరుపార్టీ నాయకుల తిరోగమన విధానాన్ని,మహాసభ ప్రతినిధులు సోదరప్రతినిధులు తిరస్కరించారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత, ప్రపంచ కమ్యూనిస్టులకు అత్యంత పవిత్రమైనది. ఈ ఐక్యతను విచ్ఛిన్నం చేసే శక్తి ఏదీలేదు."

భారత దేశానికి కరామీ ప్రశంస

బొంబాయి, జనవరి 28

భారతదేశంలో వివిధజాతుల మధ్య ప్రదర్శిత మధుర ఐక్యత, సౌభ్రాతృత్వము తనను ఎంతో ముగ్ధుణ్ణి చేసిందని లెబనాన్ ప్రధాని రషీద్ కరామీ నేడిక్కడ ఆయన గౌరవార్థం ఏర్పాటు చేయబడిన సన్మానసభలో మాట్లాడుతూ అన్నారు.

ఆయన గౌరవార్థం బొంబాయిలో సుమారు 21 వివిధ సంస్థలు ఏర్పాటుచేసిన సన్మానసభలో మాట్లాడుతూ "భారత దేశంలో తాను చాలా తక్కువ రోజులు పర్యటించానన్నారు. ఆ స్వల్ప కాలం ఇంత పెద్దదేశాన్ని గురించి తెలుసుకోవటానికి చాలదని అయినప్పటికీ ఈ వ్యవధిలో ఈ దేశంలో వివిధ జాతులమధ్యగల ఐక్యతని, సౌభ్రాతృత్వాన్ని తాను అర్థం చేసుకోగలిగానని ఆయన అన్నారు.

సరిహద్దు సమస్యపై సిహనౌక్ ప్రకటన

రంగూన్, జనవరి 28

చైనా-భారత సరిహద్దు వివాదంలో, కాంబోడియా ఆ యా దేశాల తగాదాలను తేల్చలేదనీ, తాము చేయగలిగిందల్లా కొలంబో ప్రతిపాదనలను బలపర్చడమే నని కాంబోడియా అధిపతి సిహనౌక్ నేడిక్కడ అన్నారు.

చైనా-భారత పర్యటనకై బయలుదేరి ఆయన ఇక్కడ ఆగారు చైనా పర్యటనలో తన కార్యక్రమాన్ని గురించి మాట్లాడుతూ చైనా-భారత సరిహద్దు వివాదాన్ని గురించి అక్కడ చర్చించకుండా వుండటం జరగదన్నారు కాని కాంబోడియా ఈ విషయంలో జోక్యం కలిగించుకోతగినది కాదని అలాగే బహిరంగంగా తన అభిప్రాయం వ్యక్తం చేయటం గాని తగదన్నారు

భారతదేశం తనను రిపబ్లిక్ దినోత్సవంలో పాల్గొనటానికి ఆహ్వానించిందని, అలాగే చైనా నాయకులు ఆసియా సమస్యలమీద, తమ ఉభయదేశాలకు అవసరమైన కొన్ని సమస్యలమీదసంభాషణలకు ఆహ్వానించారని తెలియజేశారు.

లోక్ సభకు ప్రధాని నెహ్రూ శ్వేతపత్రం సమర్పణ

చైనా-భారత ఉత్తర ప్రత్యుత్తరాలపై

న్యూఢిల్లీ, జనవరి 28

1962 అక్టోబరు 24 నుండి జనవరి 11 వరకు చైనాతో జరిపిన లేఖలు, నివేదికలు, నోటు లతో గల శ్వేతపత్రాన్ని ప్రధాని నెహ్రూ నేడు లోక్ సభకు సమర్పించారు.

చైనీయులు పెద్దఎత్తున దాడిజరిపిన నాల్గురోజులతరువాత చైనా ప్రధాని చౌఎన్-లై నుండి వచ్చిన లేఖతో ఆ శ్వేతపత్రం ప్రారంభమయింది "సాక్షాత్తూ ఆధీనరేఖ" నుండి 20 కిలోమీటర్లు ఉపసంహరించుకోవలసిందిగా ఆ లేఖలో ఉంది. భారతదేశం ఆ సూచనను తిరస్కరించింది. సంభాషణలకు ప్రాతిపదికగా సెప్టెంబరు 8 పరిస్థితిని నెలకొల్పాలని భారతప్రభుత్వం కోరింది

వ్యవసాయరంగం

తిండి కలిగితే కండ గలదోయ్!

"తిండికలిగితే
కండగలదోయ్!
కండగలవాడేను
మనిషోయ్!"

అని అన్నారు మహాకవి గురజాడ! సరియైన తిండి అంటే పుష్టిగల తిండి తింటేనే ప్రజలు పుష్టిగా వుంటారు బలం కలిగివుంటారు. పుష్టిగా వున్న ప్రజలే ఏ ఉపద్రవాన్నైనా ఎదుర్కొని నిలబడగలుగుతారు. అందుకే.

"ఈసురోమని
మనుషులుంటే"
దేశమేగతి
బాగుపడునోయ్?"

అని ఆ మహాకవి మరోసారి హెచ్చరిస్తున్నారు. మహాకవి గురజాడ చెప్పిన మాటలు మనకేగాదు, ఏ దేశవాసులకైనా అనువర్తిస్తాయి.

ప్రజలకు తరిపడా, అందులోనూ పుష్టికరమైన తిండి (ఆహారాన్ని) లభింపజేసినపుడే ఆ దేశం బాగుపడుతుంది. అయితే ప్రజలకు కావలసిన ఆహార పదార్థాలన్నీ కూడా - అంటే వడ్లు, జొన్నలు, రాగులు, కొర్రలు, సజ్జలు మొదలగు ధాన్యాదులు, వంగ, బెండ, కాకర, సొర, రామములగ, దోస, గుమ్మడి, పొట్ల, బీర, క్యాబేజీ, కాలిఫ్లవర్, ముల్లంగి ఆదిగాగల రకరకాల కూరగాయలు, తోటకూర, చుక్కకూర, మెంతికూర, గోంగూర, బచ్చలికూర మొదలయిన ఆకుకూరలు - ముఖ్యంగా పల్లెపట్టులందు రైతుల పొలాల్లో పండించబడుతున్నాయి. నీటి చుక్కల్తో చేయడానికి కూడా ఫ్యాక్టరీలు లేవు రైతు పండిస్తేనే అవి ప్రజలందరకూ అందుతున్నాయి.

అందుకనే "రైతు, దేశానికి వెన్నెముక" అని అంటారు. దేశావసరాలకు సరిపడిన ఆహార పదార్థాలను గనుక రైతులు పండించకపోతే "దేశమేగతి బాగుపడుతుంది?" ఏటా మన జనాభా పెరుగుతూనే వుంది అందుకనే ఆహార పదార్థాల కొరత ఏర్పడడమూ ఇతర దేశాలనుండి వాటిని దిగుమతి చేసుకోవడమూ జరుగుతోంది. అయితే ఆహార పదార్థాల కొరతను తీర్చడానికిగాను, రైతు అధికంగా పండించేటట్లుగా అనేక పథకాలను ప్రభుత్వం రూపొందించింది. ఆ పథకాలమేర రైతులెల్లరూ కృషి చేస్తున్నారు ఆ యేటికాయేడు మనం దిగుమతి చేసుకొనే ఆహార పదార్థాలు తగ్గించ బడుతున్నాయి.

ఇలాంటి పరిస్థితులలో అనుకోని ఉపద్రవం నెత్తిమీదకొచ్చి పడింది చైనా ప్రభుత్వ పుణ్యమా అంటూ మనకున్న యావచ్ఛక్తినీ యుద్ధరంగానికి అర్పితం చేయవలసి వచ్చింది ఇలాంటి విపత్కర పరిస్థితులలో ఆహార ధాన్యాదులను, కూరగాయ పైరులను పండించే రైతుల బాధ్యత మరింతగా వుందని వేరే చెప్ప నవసరం లేదు.

"కూరలేని తిండి - చావలేనితుమ్మ"

ధాన్యాదులను మాత్రమేఎక్కువగా పండిస్తే చాలదు ఆహారంలోఅన్నంతో పాటు కూరలుకూడా వుండాలి కూరలు లేకుండా ఒక్క అన్నంమాత్రమే తిండికి సరిపోదు ఆహారంలో కూరలు చాలా ముఖ్యమైనవని వేరే చెప్పనవసరం లేదు మన దేశంలో ఎక్కువమంది శాకాహారాన్నే తీసుకుంటారు. అందుకని ధాన్యాదులతోపాటు కూరగాయలనుకూడా పండించినపుడే మన ప్రజలకు పుష్టికరమైన ఆహారం లభ్యమవుతుంది. "కూరలేని తిండి చావలేని తుమ్మ ఒకటే" అని వూరకనే అనలేదు మన పెద్దలు.

"గుత్తి వంకాయ కూరోయ్ బావా!"

మనంవాడే కూరగాయలలో వంకాయ మొదటిదని చెప్పొచ్చు! "గుత్తి వంకాయ కూరోయ్ బావా, కోరివండినానోయ్ బావా" అని మరదలుపిల్ల తన ప్రియమైన బావను ప్రేమతో పిలుస్తుంటే ఆ పదాలు విన్న మనకూ నోరూరుతుంది అలాగే "ఎక్కడైనా బావకాని, వంకతోటదగ్గర మాత్రం కాదు" అనే మన సామెతనుబట్టే కూరగాయలలో వంగ కెట్టి స్థానమున్నదో గ్రహించవచ్చు! అందుకని వంగను పండించే విధానం - పండించడమంటే ఎకరాకు ఎక్కువ దిగుబడిని సాధించే విధానం గురించి రైతులు తెలుసుకుంటే మంచిదికదా! ప్రతి రైతూ తన వంగతోట ఎక్కువగా కాయాలనీ, ఆ విధంగా తన కెక్కువ ఆదాయం గావాలనే వుబలాటపడతాడు. అయితే ఏ యే పద్ధతుల కవలంబిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి, తద్వారా లాభం పొందవచ్చునో తెలుసుకుందాం.

ఎలాంటి నేలలోనైనా వంగను పైరు చేయవచ్చు ఆఖరుకు ఇసుక నేలలో కూడా. పండిస్తున్నారు బాపట్ల ప్రాంతాలలో వంగను కొన్ని రకాల కూరగాయలు ఒక ప్రత్యేక ఋతువులోనే పండించడానికి వీలుంటుంది. కాని వంగ విషయంలో అలా కాదు సంవత్సరంలో ఏ ఋతువులోనైనా

శ్రీ టి. ఆర్. రావ్

వంగను పండించవచ్చు! ముఖ్యంగా వేసవి కాలంలోనూ, వర్షాకాలంలోనూ, శీతకట్టు సందునూ, వంగను పైరు చేయవచ్చు! ఏ కాలంలో పైరు చేసినా - ఈ క్రింద వివరించిన ఆరు ముఖ్య సూత్రాలను గనుక రైతులు అనుసరించిన వంగ దిగుబడి ఎక్కువగా లభిస్తుంది

ఎంచిన వంగరకాలనే పెంచాలి

వంగలో అనేక రకాలున్నాయి. ఆకారాన్నిబట్టి, పరిమాణాన్నిబట్టి, రంగునుబట్టి రకరకాలతో పిలుస్తున్నారు అన్ని రకాలకంటే కొత్తఢిల్లీలో గల భారత వ్యవసాయ పరిశోధనా సంస్థలో సృష్టించిన 'పూసా పర్పుల్ లాంగ్' అను పొడుగురకం, "పూసా పర్పుల్ రౌండ్" అను గుండ్రనిరకం, దిగుబడి విషయంలోనూ, రుచి విషయంలోనూ మేలి రకాలని చెప్పబడుతున్నాయి ఈ రకాలు ఎకరాకు 500 నుండి 600 మణుగులు (మణుగు 8⅓ పౌనులు) వరకు కాపు నిస్తాయి.

'పూసాపర్పుల్ లాంగ్' వేసవిలో పండించడానికనువుగా ఉంటుంది. తోటవేసిన 100 రోజులలోనే ఈ రకం కాపుకు వస్తుంది ఆ తర్వాత 75 రోజుల వరకూ విపరీతంగా కాపు పట్టి ఎకరాకు 500 మణుగుల వరకూ దిగుబడినిస్తుంది. ఈ రకపు వంకాయలు ఎనిమిదినుండి పది అంగుళాల పొడవున వుంటాయి. చిక్కటి ఊదా రంగున వుంటాయి వంగ పైరు నెక్కువగా నాశనం చేసే 'కాండం తొలుచు పురుగు' ఈ రకాన్నేమీ చేయజాలదు. ఈ రకంలో గల మరో సుగుణమేమంటే - ఈ రకం రెండోకారు కాపు నిస్తుంది. జనవరిమాసంలో గనుక ఆకులను దూసి రెమ్మలను గనుక కత్తిరించిన, వేసవి ప్రారంభంలో ఆమొక్కలు రెండోకారు కాపు పడతాయి వేసవిలో కూరగాయలకు మంచి గిరాకీ. అందు చేత నాటి పెంచకుండానే అదే పైరును నిలబెట్టి, తక్కువ ఖర్చుతో రెండోకాపునుపొంది ఎక్కువ లాభం పొందటానికి వీలుపడుతుంది

'పూసా పర్పుల్ రౌండు' (గుండ్ర రకం.)

ఈ కాయ పండ్లు ఒక్కొక్కటీ ఒక పౌను వరకూ తూగుతుంది. సరాసరిని ఒక్కొక్క వంగ మొక్క అయిదు లేక ఆరు కాయలనిస్తుంది వంగ మొక్కలకు 'వైరస్'ద్వారా వచ్చే (ఆకులు ముడుతరిగి పోయే) 'కొక్కిర' రోగానికి, ఈ వంగ రకం చక్కగా తట్టుకొంటుంది అయితే యిలాంటి పెద్ద పెద్ద గుండ్రని కాయలను కాసే వంగరకాలను మన ఆంధ్ర దేశంలో చాల తక్కువగా పండిస్తారు.

చక్కగా పెంచిన వంగ మొక్కలనే నాటాలి

వంగతోటవేసే రైతులు వంగ నారును తాము పెంచకుండా, ఎవరో పెంచిన నారుని కొని నాటు వేసే అలవాటున్నది. అలాగకుండా ఎవరికివసరమైన నారును వారే పెంచుకుంటే ఎంతో మేలు. వంగ నారును పెంచడానికిగాను, అంత ఎక్కువ శ్రమపడనవసరంలేదు నారు పెంచే స్థలాన్ని బాగా కలియదున్ని గడ్డలేమాత్రం లేకుండా చేయాలి. తరువాత మూడడుగుల వెడల్పు, పది అంగుళాల పొడవున ఎత్తయిన (దిబ్బ) నారుమడి తయారు చేయాలి. ఒక్కొక్క మడికి బాగా చివికిన పశువుల ఎరువుగానీ, కంపోస్టు ఎరువుగానీ అయిదేసి తట్టల చొప్పున వేసి నేలలో బాగా కలిపి వేయాలి. నారుమడిలో నాలుగంగుళాల ఎడంగా వరుసలలో వంగ విత్తనాలను చల్లి, పైన మెత్తటి మట్టిని పరచి విత్తనాలను కప్పాలి ఒక ఎకరా పొలానికి కావలసిన వంగనారుకుగాను 250 గ్రాముల విత్తనాలు చల్లిన సరిపోతుంది తరువాత నారుమడిపై నీరు చల్లి, దానికిపైన గడ్డిని కప్పి ఒక వారంరోజుల పాటుంచాలి. వాతావరణం బెట్టగానుంటే ప్రతిరోజూ సాయంత్రంపూట, ఉదయంపూట నారుమడిపై నీరు చల్లాలి. మొలకెత్తుట ప్రారంభించగానే పైన కప్పిన గడ్డిని మెల్లగా తీసివేయాలి. ఆ తర్వాత ప్రతి నాలుగు లేక అయిదు రోజులకు ఒకసారి నీరుచల్లిన సరిపోతుంది పొడి వాతావరణంలో నాలుగు నుండి అయిదు వారాలపాటు పెరిగిన మొక్కలను నారుమడి నుండి పీకి నాటువేయవచ్చును ఇతర ఋతువులలో అయితే ఆరువారాల వయస్సుగల మొక్కలను నాటాలి.

తోట భూమిని ముందుగానే తయారు చెయ్యాలి

వంగ మొక్కలను నాటుటకు చాల ముందుగానే, ఆ తోటభూమిని బాగా అంటే అయిదారుసార్లు దున్ని బాగా పదును వచ్చేటట్లు చూడాలి. ఎకరాకు కనీసం 20 నుండి 25 బండ్ల పశువుల ఎరువును విధిగా వేయాలి నాటటానికి ఒక నెలముందే ఆ ఎరువునంతటినీ చల్లి, బాగా కలియదున్నాలి ఆ తర్వాత 2½ అడుగుల ఎడంగా బోదెలను, గట్లనూ ఏర్పాటు చేయాలి.

సరియైన పద్ధతిలోనే మొక్కలను నాటాలి

నారుమడినుండి లేత మొక్కలను చేతులతో పీకరాదు కంటకం (పండ్ల త్రవ్వగోల)తో వేళ్ళకెట్టి దెబ్బ తగలకుండా తీయవలెను. నారుమడిలోంచి ఈ విధంగా తీయబడిన వంగ నారు మొక్కలను జాగ్రత్తగా పరిశీలించి, వాటిలో కనీసం మూడాకులు కలిగి 12 నుండి 15 సెంటీమీటర్ల (5 లేక 6 అంగుళాల) పొడవుగానున్న మొక్కలనే నాటుటకు తీసుకోవాలి. పూసా పర్పుల్ లాంగ్ (పొడవు) రకమయిన వరుసలలో 1½ అడుగులకొక మొక్క చొప్పున నాటాలి ఇక పూసా పర్పుల్ రౌండు (గుండ్ర) రకమయిన రెండు నుండి మూడడుగులకొక మొక్కచొప్పున నాటాలి.

నీరు పారించడానికి పెద్దగా అవకాశంలేనిచోట్ల బోదెలు, గట్లు ఏర్పాటు చేయుటకు బదులు ఎత్తయిన మడులు చేసి వాటిమీద నాటుట మంచిది కాలువనీరు పారించేచోట్ల మామూలుగా మళ్లు చేసి నాటువేయవచ్చును. నాటిన వెనువెంటనే వత్తుతోటకు నీరుపెట్టుట మరువరాదు.

పైరును జాగ్రత్తగా పెంచాలి

వంగ మొక్కలను నాటిన నెలరోజుల తర్వాత 120 కిలోగ్రాముల అమ్మోనియం సల్ఫేటు లేదా 60 కిలోగ్రాముల యూరియాని 300 కిలోగ్రాముల సూపర్ ఫాస్ఫేటు వీటిని కలిపి, ఆ మిశ్రమాన్ని మొక్కల వరుసలకు రెండు ప్రక్కలా వేయాలి.

వంగతోటకు నీరెంతో అవసరం. తోట నెప్పుడూ ఎండబెట్టరాదు ముఖ్యంగా వేసవికాలంలో కనీసం వారానికొకసారి అయినా నీరు పెట్టాల్సి వుంటుంది శీతకట్టున పెంచే పైరుకు ప్రతి 10 లేక 12 రోజులకొకసారి నీరు పెట్టిన సరిపోతుంది.

కనీసం 15 రోజులకొకసారి వంగతోటలో కలుపు విధిగా తీయాలి. ఇందుకు 'త్రిఫాన్' అనే మూడు పళ్ళు గల త్రవ్వగోలను ఉపయోగించుట మంచిది.

చీడ పురుగుల తెగుళ్ళనుండి పైరును కాపాడాలి

అక్షింతల పురుగు, కాండంతొలిచే పురుగు, పచ్చనల్లి, పేను వంగపైరు నెక్కువగా పట్టి నాశనం చేసే వాటిలో ముఖ్యమైన చీడపురుగులు ఈ చీడపురుగులనుండి వంగపైరును రక్షించడానికి ఈ క్రింది సూచించిన పద్ధతుల నవలంబించాలి:

1. అక్షింతల పురుగు నివారణకుగాను - అవి క్రిమిదశలో నున్నప్పుడు, పెద్దదైనప్పుడు కూడా 5 శాతం డి డి టి మందుపొడిని చల్లాలి

2 కాండం తొలిచే పురుగు. ఈ పురుగు 'పూసాపర్పుల్-రౌండు' వంగ రకాన్నేమీ చేయజాలదు ఇతర రకాలకీ పురుగు పట్టి వాటి తలలను తొలుస్తుంది అక్కడ కారిము లేక కాండంవిరిగి పోయి వాడిపోతుంది ఇలాంటివాడిపోయిన

(మిగతా 8 వ కాలంలో)

అధికాహారోత్పత్తికి మీ ప్రాంతంలో జరగవలసిన కృషి ఏమిటి?

రైతాంగానికి, రైతుసంఘ కార్యకర్తలకు విజ్ఞప్తి

అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం అధికాహారోత్పత్తికి, మైనర్ ఇరిగేషన్ పథకాలకు అదనంగా డబ్బు కేటాయించుతూంది మీమీ ప్రాంతాలలో అధికాహారోత్పత్తికి జరుగవలసిన కృషి ఏమిటి? ఏయే మైనర్ఇరిగేషన్స్కీములు మీప్రాంతంలో తలపెట్టబడినాయి? ఏవి మంజూరుచేయబడినాయి? ఏవి ఇంకా చేపట్టవలసినవి ఉన్నాయి? అసందర్భంగా నిర్మాణాత్మక సూచనలతో విశాలాంధ్ర 'వ్యవసాయ రంగానికి' తెలియజేయవలసిందిగా కోరుతున్నాము — సం॥

గంపనిండా వంకాయలు

★ రైతుల జాబులు ★

వ్యవసాయదారులకు అందని వ్యవసాయశాఖ పత్రిక

ఆర్యా,

క్రిందటి సంవత్సరం నెల్లూరుజిల్లాలో రసాయనిక ఎరువులు, ఎండ్రిను, తదితర పైర్లకు కావలసిన మందులు వ్యవసాయ శాఖవారి ద్వారా చాలావరకు పంపకం జరిగింది ఆ సందర్భములో జిల్లా వ్యవసాయశాఖ అధికారి తాలూకా వ్యవసాయశాఖ అధికార్ల ద్వారా పాడి పంటల పత్రికలకు చందాలు నిర్బంధంగా కొన్ని చందల పత్రికలు కట్టించారు. రైతులు "మాకు పత్రికలు అందలేదు, మేము చందాలు కట్టటం వృథాఅనిఎంత చెప్పినప్పటికిన్నీ, మాకు పెత్తి కార్లుఅలా చేయుచున్నారు. అని వసూలుచేశారు ఎవ్వరికిగూడా పత్రిక అంపలేదు పైగా ఎప్పుడైనా వచ్చిన 6 నెలలకి ముందువి వచ్చుచున్నవి. అవి అయినా నూటికి ఒక్కరికి ఇచ్చుచున్నారు మిగతా బజారులో మాత్రం బహిరంగముగా అమ్ముచున్నారు.

నేను 6-7-62, 20-7-62 17-9-62 తేదీలలో మూడు చందాలు కట్టినాను. నాకుగూడ ఇంతవరకు ఒక్కటీ పంపలేదు.

కనుక ప్రభుత్వం వెంటనే జిల్లా వ్యవసాయ శాఖవారిమీద విచారణ జరిపించి తగినచర్యలు తీసుకొని, చందాదార్లకు పత్రికలు చక్కగా చేరేలాగున చేయుంచవలసినదిగా కోరుచున్నాను.

ఇట్లు,
వీలూరు దశరథరామయ్య,
అధ్యక్షుడు, కోవూరు
తాలూకా రైతు సంఘం.

ఎరువుల సప్లయిలో అవకతవకలు

ఆర్యా!

ప్రభుత్వమువారు అమ్మోనియా సల్ఫేట్ వగైరా ఎరువులు కంట్రోలు ధరలకు అందించుటకు జిల్లా పరిషత్తుల ద్వారా జిల్లా మార్కెటింగ్ బోర్డులకు కేటాయింపారు ఆ బోర్డులనుండి స్థానిక కోఆపరేటివ్ సొసైటీలకు పంపి వ్యవసాయశాఖ నిర్ణయంప్రకారము రైతులకు సప్లయి చేయుటకు నిర్ణయించియున్నారు. కాని ఈ శాఖ సకాలములో పర్మిటులు యివకపోవడంచేత సహకార సంఘములో మార్కెటింగ్ బోర్డునుండి తెచ్చుటకు, రైతులకుయిచ్చుటకు వీలులేకపోతూంది రైతులు ఇబ్బందులపాలు అవుచున్నారు. ఇది యిట్లుండగా బ్లాక్ మార్కెట్టుయందు విపరీతముగా అమ్మోనియా సల్ఫేట్ వచ్చుచున్నది అది బస్తా 1కి కంట్రోలురేటు రు 38 లు ఉండగా బ్లాక్ మార్కెట్టులో రు. 75 వుంటూంది.

అదేగాదు కృష్ణాజిల్లా మార్కెటింగ్ బోర్డువారు స్థానిక సంఘములకు సకాలములో ఎరువుల కోటానుయివ్వడంలేదు. పైర్లు అయిపోయిన తరువాత రైతులకు అవసరములేని కాలములో రైతులకు వాడుక అలవాటులేని నైట్రోటు పోటీ పెట్టి యిస్తున్నారు అది రైతులు తీసుకొని వెళ్ళక సొసైటీలకు నష్టము కలుగుచున్నది విచారించి తగుచర్య తీసుకొని రైతులకు సకాలములో ఎరువులుఅందించి అధికోత్పత్తికి తోడ్పడవలసినదిగా ప్రభుత్వమువారిని కోరుచున్నాను.

ఇట్లు,
మాదల లక్ష్మీనారాయణ.

వ్యవసాయమంత్రి పక్షపాతం

ఆర్యా,

నిజామాబాద్ జిల్లా బోధన్‌లో వ్యవసాయ మార్కెటింగ్ కేంద్రం నిర్మించాలని రైతుసంఘం గత రెండు సంవత్సరాల నుండి ఆందోళన చేస్తూంది ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని కదిలిస్తూ, ఉత్తర ప్రత్యుత్తరాల ఫలితం మార్కెట్ కమిటీని మంజూరు చేయటం అధికారులకు, ప్రజలకు తెలిసిన విషయమే ఇందుకు సంబంధించిన రికార్డు కూడా రైతుసంఘం వద్దవున్నది మార్కెట్ కమిటీకి సభ్యులను నామినేట్ చేయమని జిల్లాకలెక్టరు ఆదేశం పంపారు. మంత్రి ఆదేశం ప్రకారం కలెక్టరు ఒకనెల విచారణచేసి ప్రజలతో సంబంధంవున్న వ్యక్తులను 12 మందిని కమిటీకి నామినేట్ చేసి 13-11-62 వ తేదీన సెక్రటేరియట్‌కు పంపారు. ఈపట్టీలో యిద్దర్ని తగ్గించి మిగతావారిని ఆమోదిస్తూ పంపవలసిన బాధ్యత మంత్రిది కాని జరిగిందేమంటే కలెక్టరుగారు పంపిన లిస్టులో అయిదుగురిని తగ్గించి పట్టీలో లేనివారిని ముగ్గురిని మంత్రి నామినేట్ చేశారు.

ఇలాఅయితే నామినేట్ చేయమని క్రింది అధికారులకు వుత్తర్వులుపంపి ఒకనెల శ్రమ అధికారులచే ఎందుకు చేయించాలి? హైద్రాబాదులోనే పేర్లు వ్రాసుకోవచ్చు గదా? ప్రతిచిన్న విషయాలలోను జోక్యం కలుగజేసుకునే పక్షపాతం గల వ్యక్తులు మంత్రులుగా తగరు. మార్కెటింగ్ కమిటీ విషయంలో వ్యవసాయమంత్రికి పక్షపాతం దేనికో విచారించి ముఖ్యమంత్రి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

ఇట్లు,
వేమూరి బాలయ్య, కార్యదర్శి
బోధన్ తాలూకా రైతుసంఘం.

ఆంధ్రలో పడవల రవాణా దుస్థితి

ఆర్యా,

ఆంధ్ర దేశంలో స్టీమర్లు, ఓడలు, కాల్వ తొట్టెపడవలు, నావలు మొదలగు వాటిద్వారా అనేక విధములుగా రవాణా వ్యాపారం జరుగుచున్నది గోదావరి, బకింగ్‌హామ్ కాలువలద్వారా సుమారు 15 వేల కాల్వతొట్టె పడవలు నడుపబడుతున్నాయి. పడవల రవాణా వ్యాపారమునకు విజయవాడ పట్టణము ముఖ్యకేంద్రంగావుండి, కాకినాడ, బందరు, మదరాసు రేవు పట్టణములకు రవాణా జరుగుచున్నది యీ కాల్వ తొట్టె పడవల నుండి సాలుకు పడవ టన్ను ఒకటికి రు [illegible]లు చొప్పున లైసెన్సు రూపంలో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వస్తున్నది.

కాలువలందు లాకులు దాటించు అవకాశం లేనందున, అధికారులు తవదు కలిగించే యిబ్బందులవల్ల కాలువలలోతరచు ఏర్పడే మెరకలవల్ల పడవలవారికి చాలా నష్టము జరుగుచున్నది.

ఏలూరుకులాకువద్ద తరచు కలిగే నీటి ఎద్దడివలన పదులకొలది పడవలు నిలిపి వేయబడుట గత కొద్ది సంవత్సరాలుగా పరిపాటయినది దెందులూరు-తమ్మిలేరుల మధ్య, పెరికీడు, తేళ్ళపల్లి సిమెంటు ఫ్యాక్టరీ, విజయవాడ లాకులమధ్య చింతపల్లి, తోపుపూడి, మేడపాడులవద్ద మెరకలు త్రవ్వించవలసి యున్నది కాలువగట్టు పెరుగుతున్న ముండ్ల తుప్పలు, పుట్టలు మొదలగు వానివలన తెరచాపలు చినిగి కొయ్యసామానులవిరిగి నష్టపడటమే గాక, ప్రాణాలకుకూడా అపాయం వున్నది. కాలువలపై వంగివున్న చెట్ల కొమ్మలను నరికించాలి

వేసవిలో కాలువలలో ముట్టి రాకపోకలు జరుగనందున; కాకినాడ కాల్వ తొట్టిపడవలు, బంగాళాఖాతంమీదుగా ప్రక్కనేవున్న కాలువలద్వారా ప్రయాణించి, అమలాపురం తాలూకా యానాం గ్రామాలనుండి ధాన్యం, కొబ్బరి, ఇటికలు మొదలయిన సరుకులను, సున్నం తయారీకి ఇసుకను తీసుకుని రావడం జరుగుతుంది. ఇసుకనుతీసుకొని వచ్చుటకు ముందుగా తాలూకాలో ఛలానా మొత్తంను చెల్లించి, ఎగ్జిక్యూటివ్ యింజనీరు ధవళేశ్వరంవారి నుండి పర్మిట్‌ను పొందవలెను ఈ పద్ధతి మూలంగా అనేక ఇబ్బందులున్నాయి. కాబట్టి రిజిష్టరు కాబడిన ఆయాస్థానిక నావికాసంఘాలకు వాటిని లీజుకు యిప్పించవలసినదిగా కోరుతున్నాను

విజయవాడ నుండి కాకినాడ, బందరు రేవులకు ఎగుమతిఅయ్యే కాకిరాయి, మరియూ ధవళేశ్వరం, కడియం, బలభద్రపురం మొదలగు స్థలములనుండి ఆయా గ్రామాలకు పంపబడే మెటల్సును కంట్రాక్టర్లు పడవలద్వారా రవాణా జరిపించుకుని యీ రవాణా వ్యాపారాన్ని రిజిష్టరుకాబడిన ఆయా నావికా సంఘముల ద్వారానే జరిపించే అవకాశమును కల్పించవలసినదిగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వార్ఫులలో ఎగుమతి దిగుమతులకుగాను ఒకవారం దినము, గడువుకు పడవ టన్ను ఒకటికి 0-07 న పై వసూలు చేస్తున్నారు. కాకినాడలో మాత్రం ఎగుమతి, దిగుమతులు త్వరగా లేకపోయినను, కాలువలో యెంటనే జరిగినను, ఎట్టిగడువు లేకుండా ప్రతి పడవ నుండి, రు 2-25 న. పై పోటువాసు వసూలు చేస్తున్నారు. కాబట్టి ఇతర వార్ఫులలోవలె కాకినాడలో కూడా అమలు జరిపించవలసినదిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఇట్లు,
మల్లాది స్వామి,
మున్సిపల్ కౌన్సిలర్
కాకినాడ.

బంజరు భూములపై కొత్త దరఖాస్తులు

అదివరకే సాగుజేస్తున్న వారిపట్ల ఉదారం అవసరమని వెంకటగిరిలో రాయబారం

వెంకటగిరి, జనవరి 22

నెల్లూరు జిల్లా వెంకటగిరిలో మకాం చేసిన జిల్లా జాయింటు కలెక్టరు శ్రీ కంకరన్ గారి యొద్దకు తాలూకా కమ్యూనిస్టు నాయకుడు శ్రీ రామనాథంగారు బంజరుభూముల పంపకం సమస్యపై రాయబారం వెళ్ళారు. బంజరు అర్జీలు పట్టాలు తనిఖీచేసి వివిధ పోరంబోకులను అనాధీనంగా మారాలనిసరే, సరిగా జరుగుటలేదని కొత్త దరఖాస్తులు తీసుకోవడంలో అదివరకే సాగుచేస్తున్న వారిపట్ల ఉదారంగా వుండాలని కోరారు.

పెండింగు విషయములు, లోగడపట్టాలలో జరిగిన అవకతవకలు సరిచేస్తామని జాయింటు కలెక్టరు హామీనిచ్చారు వెలికల్లు, కదిమలగుంట, అమ్మపాళెం, జేవులపల్లి, వడ్డిపల్లి, కలవలపూడి, పెద గొట్లగుంట, సోమసానిగుంట తదితర గ్రామములనుండి పేదరైతులు, వ్యవసాయ కార్మికులు వొచ్చి, శివాళ్లు బంజరు అర్జీలుయిచ్చి చెప్పుకొన్నారు

(కొత్తఅర్జీలు మాత్రం తీసుకోవమని, మిగతా విషయములను నిదానంగా అమలుపరుస్తామని కలెక్టర్ సమాధానమిచ్చారు. ఆయన అనేక గ్రామాలకు పోయి పెండింగు సమస్యలను విచారించి వచ్చారు అమ్మపాలెం హరిజనుల బంజరుపొలాన్ని చూచివచ్చారు. కానీ పోగురువారిపల్లి సాపమాంబాపురం గ్రామస్థులు కల్గించే అడంకులను పేచీలను ఆలోచించి నిర్ణయం చేస్తానన్నట్లు తెలుస్తున్నది ఈ 3 గ్రామాల అస్తులు ప్రధానంగా అసంతృప్తులో గ్రామ హరిజనులకు పొగాలున్నది గుర్తించి పేదలకు పొలాలివ్వాలని అమ్మవాళెం పేదరైతాంగం కోరినట్లు తెలుస్తున్నది. పంచాయితీ ప్రెసిడెంటు శ్రీ ఎ వెంకటేశ్వరరావుగారు కూడా అడ్డుపడుతున్నారు. (వి. వి.)

వ్యవసాయ విశ్వవిద్యాలయ నిర్మాణానికి పూర్ణానుస్వారం: ఆంధ్రపట్ల కేంద్రం చిన్నచూపు

తృతీయ ప్రణాళిక కాలంలో ఆంధ్ర ప్రదేశ్‌లో నిర్మించదలచిన వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఆర్థికాభావంవల్ల నిర్మించ సాధ్యంకాదని కేంద్రప్రభుత్వం సున్నా చుట్టింది. ఇంతకుముందు భారీ విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీని కూడా యిలాగే చేశారు

ఇంతకుముందు నాలుగున్నరకోట్ల రూపాయల ఖర్చుతో తలపెట్టిన ఈ పథకం ఆ తర్వాత రెండుకోట్ల పదహారు లక్షల రూపాయలకు కుదించబడింది. ఆ మేరకు తృతీయ ప్రణాళికలో నిర్మాణం కావలసియున్న ఈ పథకం—ఇప్పటికే సన్నాహాలు అన్నీ పూర్తి అయిన ఈ పథకం—యిప్పుడిలా ఎగగొట్టబడింది. రు 216 లక్షల రూపాయల్లో కేంద్రం వాటా రు 171 లక్షలు కాబట్టి అంత పెద్ద మొత్తం రాకపోవడం ఇది ఆంధ్రకు పెద్ద దెబ్బే.

అయినప్పటికీ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించే నిమిత్తం ప్రవేశపెట్టిన బిల్లును విరమించరని ఆంధ్ర వ్యవసాయ మంత్రి చేసిన ప్రకటన ఆశాజనకంగా వుంది

ప్రతిదానికి కేంద్రం అత్యవసర పరిస్థితిని ఒక కారణంగాచూపి 'పెదుకుపూ, బియ్యానికి ఒకే మంత్రం' చదువుతున్నది. ఈ కారణాలన్నీ ఆంధ్రప్రదేశ్‌లోని అభివృద్ధి పథకాలపట్లే ఎక్కువ ప్రయోగింపబడటమే అనుమానం కల్గిస్తున్నది.

అడ్రసు:
'వ్యవసాయరంగం'
విశాలాంధ్ర
విజయవాడ-4

బైటముంజులూరుసభ

బైటముంజులూరు, జనవరి 22

ఒంగోలు తాలూకా బైటముంజులూరు గ్రామ కమ్యూనిస్టుశాఖవారు జనవరి 18న వూరేగింపు జరిపారు.

శ్రీ సరికొండ శ్రీనివాసరాజుగారి అధ్యక్షతను రాత్రి బహిరంగ సభను కూడా జరిపారు శాఖ కార్యదర్శి, తుకవరం సుబ్రహ్మణ్యం రాజా జాతీయ సమితి తీర్మానాన్ని వివరించారు. శ్రీ కుందుర్తి వెంకయ్యాగారు మాట్లాడినతర్వాత, శ్రీ సరికొండ అంజనేయులుగారు 'బొబ్బిలి యుద్ధం' బుర్రకథను చెప్పారు.

వ్యవసాయదారులకు విజ్ఞప్తి

వ్యవసాయ సోదరులారా!

కొంతకాలంనుండి 'విశాలాంధ్ర' పత్రిక 'వ్యవసాయ రంగాన్ని' ప్రచురిస్తున్నది. ఆయా కాలాల్లో రైతులకు ఉపయోగించే సమాచారంగామాత్రమే యిదివుంటున్నది. వాటిపై మీఅభిప్రాయాలనూ, పంటలకు వచ్చే తెగుళ్ళు, చీడలు, ఇతర వ్యవసాయ సంబంధమయిన మీమీ అనుభవాలను క్లుప్తంగా వ్రాస్తే వాటిని ప్రచురించటానికిప్రయత్నిస్తాం.

—సం.

తిండిగలిగితే……

(8 వ కాలం తరువాయి)

కొమ్మల నెప్పటికప్పుడు కత్తిరించి, ఆ ముక్కలను తగలబెట్టాలి. పైరు మీద 0-25 శాతం డిడిటి లేక 0-02 శాతం ఎండ్రిన్ లేక 0-04 శాతం పారాథియాను మందులలో ఏదో ఒక దానిని పిచికారిచేయాలి. అయితే, యీ మందు చల్లిన మూడు వారాలదాకా కాయలను కోసి వాడరాదు.

3 పచ్చనల్లి ఆకుల అడుగునదాగి, ఆకులలోని రసాన్ని పచ్చనల్లి పురుగులు పీల్చివేస్తాయి. వీటిని నాశనం చేయటానికి 20 శాతం డి.డి టి. మందుపొడిని ఎకరాకు 25 పౌనులవరకు చల్లాలి

4 పేను. ఎక్కువసార్లు డి. డి. టి. మందును చల్లుటమూలంగా యీ పేను పురుగు లెక్కువగా పుట్టుకొస్తాయి. వీటిని నాశనం చేయడానికి మెత్తటి గంధకపు పొడిని పైరుపై చల్లాలి. తెగుళ్లెక్కువగా వంగపైరును పట్టకపోయినా, 'కొక్కిరి' తెగులొకటెక్కువగా వంగపైరును పట్టుచున్నది. 'వైరస్' మూలంగా ఈ తెగులు వ్యాపిస్తుంది ఈ తెగులు నరికట్టుటకుగాను మందేమియూ చల్లనక్కరలేదు గాని, ఈ తెగులుపడి ఆకులు ముడుచుకొని మెలి తిరిగిపోయిన మొక్కలను పీకి, వాటిని పూర్తిగా తగులబెట్టాలి 'పూసాపర్పుల్ - రౌండు' వంగరకం ఈ తెగులును తట్టుకుంటుంది కాబట్టి ఆరకాన్నే పైరు చేయుట మంచిది.

పైన సూచించిన ఆరు ముఖ్య సూత్రాలను పాటించి వంగను పైరు చేసిన రైతులకెక్కువ ఆదాయం లభిస్తోంది. రైతులేగాదు తమతమ పెరళ్ళలో వంగను తమ అవసరాలకుగాను పెంచేవారు కూడా యీ పద్ధతులనే అవలంబించవచ్చు.

పొలాలలో రైతులుమాత్రమేకాదు, ఎవరిమట్టుకు వారు తమకున్న కొద్ది స్థలంలోనైనా కొద్ది మేర కూరగాయలను పండించుటకు కృషి చేయాలి. రకరకాల కూరగాయలను మీ పెరటిలోనే పెంచుకొనే విధానాలనుగురించి ముందు వ్యాసంలో చర్చిద్దాం.

అధికంగా
పండించండి
ఒక అంగుళం
భూమిని కూడా
వృథా చేయకండి

రేడియో

శనివారం, జనవరి 26
శక 1884, మాఘ 6

విజయవాడ

887.1 మీ (840 కిలో సై.)

ఉదయం: 6-30 శుభోదయం; 6-35 ప్రసార విశేషాలు, 6-45 భక్తిరంజని భక్తిగీతాలు, 6-55 సూక్తి ముక్తావళి, 7-00 తె. వా, 7-15 కేటి విశేషం, 7-20 సంగీత శిక్షణ; 7-30 వాద్యబృందం, 8-0 ఆం వా; 8-15 హిం వా, 8-30 ఎమ్ డి. రామనాధన్; 9-0 వార్తా సమీక్ష, 9-5 భక్తి గేయాలు; 9-15 రిపబ్లిక్ దినోత్సవ పెరేడ్ (ఢి రి.); 11-30 సమాప్తి.

మధ్యాహ్నం: 12-15 వీరగాధలను చిత్రించు రూపకం; 12-45 హై. రిలే, 1-0 స్త్రీల కార్యక్రమం; 1-30 ప్రకటింపబడును; 1-50 తె. వా, 2-0 వాతావరణ సూచన, పిల్లలకార్యక్రమం, 3-0 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 6-0 స్థానిక ప్రకటనలు, 6-5 ప్రాం వా, 6-20 గ్రామస్థులకు పంచాయతీ వ్యవస్థ, 7-0 తె వా, 7-15 గ్రామస్థులకు జాతీయగీతం; 7-30 ప్రకటింపబడును; 7-45 హై. రిలే; 8-0 హైదరాబాద్ రిలే, 8-30 రేడియో న్యూస్ రీల్ (ఢి రి.); 8-55 ప్రస్తుతాంశము; 9-0 ఆం; వా, 9-15 ఇండియా అండ్ ది వరల్డ్; 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమం - భక్తి గీతాలు (ఢి రి.); 11-5 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలో సై.)

ఉదయం 6-30 వందే మాతరం; 6-35 కార్యక్రమ వివరణ; 6-45 వి.వి; 6-55 సూక్తి ముక్తావళి, 7-0 తె.వా., 7-15 కేటివిశేషం, 7-20 సంగీతశిక్షణ; 7-30 జాతీయగీతాలు; 7-45 భక్తి గీత్, 8-0 ఆం వా; 8-15 వి రిలే, 9-0 మార్చ్ ట్యూన్స్; 9-15 రిపబ్లిక్ దినోత్సవ పరేడు వర్ణన; 11-30 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12-15 వీరగాథలు: వీరుల గాథలను చిత్రించు రూపకం - తెలుగు; 12-45 కార్మికులకు: రిపబ్లిక్ దినోత్సవం - రూపకం, 1-0 వి రిలే, 1-30 లలిత్ సంగీత్, 1-40 హిం వా, 1-50 తె వా; 2-0 హై. వి. రిలే, 2-10 ఉ. వా, 2-20 హై వి రిలే, 3-30 పిల్లల ప్రత్యేక కార్యక్రమము - జై హింద్; 4-0 ప్రసార సమాప్తి.

సాయంత్రం 6-0 స్థానిక ప్రకటనలు, 6-5 ప్రాం. వా, 6-15 ఉర్దూలో కార్యక్రమము; 7-0 తె వా, 7-15 భారత్ కే ప్రాచీన్ విద్యా కేంద్ర నవద్వీప్-ప్రసంగం (హిందీ), 7-30 శ్రోతల ఉత్తరాలకు జవాబులు (ఉర్దూ), 7-30 ఉ. వా; 7-45 రిపబ్లిక్ దినోత్సవ సందేశము: జనరల్ ఎస్. ఎమ్ శ్రీ నగేశ్ (ఆంధ్రప్రదేశ్ గవర్నర్), 8-0 ప్రజాస్వామ్యంలో పౌర బాధ్యతలు - చర్చ, 8-30 రేడియో న్యూస్ రీల్ (ఢి రిలే), 8-45 నగరంలో రిపబ్లిక్ దినోత్సవములపై రేడియో సమీక్ష, 8-55 ప్రస్తుతాంశం, 9-0 ఆం వా, 9-15 ఇండియా అండ్ ది వరల్డ్, 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమం (ఢి రిలే); 11-5 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి.

హైదరాబాద్-బి

89 42 మీ (3355 కిలో సై.)

ఉదయం: 6-30 హై. ఎ. రిలే, 7-45 ప్రసార సమాప్తి

49.02 మీ (6120 కిలో సై)

9-0 హై ఎ రిలే, 11.30 సమాప్తి.

42.02 మీ (7140 కిలో సై)

మధ్యాహ్నం: 12-15 హై. ఎ రిలే, 12-45 హై ఎ రిలే, 2-0 వాతావరణ సూచన, వీణ; 2-20 క్షీరసాగర మథనం- సంగీత రూపకం, 3-30 హై ఎ. రిలే, 4-0 ప్రసార సమాప్తి.

60 12 మీ (4990 కిలో సై.)

సాయంత్రం: 6-0 హై. ఎ రిలే; 6-20 గ్రామస్థులకు, 7-0 తె. వా, 7-15 గ్రామస్థులకు, 7-30 వి రిలే, 7-45 హై.ఎ.రిలే, 11-5 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

మద్రాస్-బి

311.8 మీ (1420 కిలో సై.)
60 98 మీ (4920 కిలో సై.)

ఉదయం: 6-45 మంగళ గానం; 7-0 తె వా; 7-15 సంస్కృత కార్యక్రమము; 7-30 రేడియో కరస్పాండెంట్, 8-0 ఆం. వా. 8-15 ప్రసార సమాప్తి

49.30 మీ (6085 కిలో సై)

మధ్యాహ్నం: 10-45 వీరపూజ - తెలుగు, 11-30 మలయాళ రూపకం, 12-15 వీరగాధల రూపకం (తమిళం), 12-45 వాద్యసంగీతం; 1-0 కదంబము; 1-30 ఆం వా; 1-40 గీతమంజరి, 1-50 తె వా; 2-0 ప్రసార సమాప్తి

2-30 మీనాక్షి రాధాకృష్ణన్, 3-0 చిన్న పిల్లలకు, 3-40 పిల్లలకు (తమిళం), 4-30 ప్రసార సమాప్తి

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం, 6-0 ఆం. వా; 6-5 ప్రాం. వా, 6-20 వాతావరణ సూచన; వాణిజ్య వార్తలు (ఆంగ్లం), 6-30 కార్యక్రమ వివరణ (తమిళం), 6-55 వేణువు, 7-0 తె వా, 7-15 సంగీతము; 7-30 రిపబ్లిక్ దినోత్సవ సందేశం, 8-30 వీణ, 8-55 ప్రస్తుతాంశం, 9-0 ఆం వా, 9-15 ఆంగ్ల రూపకం, 9-45 పాశ్చాత్య సంగీతం, 11-5 ప్రసార సమాప్తి.

జాతీయ రక్షణ నిధి విరాళాలు

కర్నూలు, జనవరి 22

కర్నూలు మున్సిపల్ కార్మికుల వద్ద నుంచి డిసెంబరు నెల జీతాల్లో తలకు ఒక రూపాయి ప్రకారం వసూలుచేసిన రు 200 లను ఎ పి టి యు సి కార్యకర్తలు శ్రీ బి యస్ రామారావు, శ్రీ యస్. మంకన్న, శ్రీ పెదమల్లయ్యన్న, శ్రీ చెన్నయ్య, శ్రీ పెంచలయ్య గార్లు కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ద్వారా రక్షణనిధికి పంపారు

ఉయ్యూరు

ఉయ్యూరు జయా ట్యుటోరియల్ కాలేజి ఉపాధ్యాయులు, విద్యార్థులు, కలిసి రక్షణనిధికి రు 70 పంపడమైనది

కాజ

మంగళగిరి తాలూకా కాజ గ్రామములో రక్షణ నిధికి నాల్గు వేల రూపాయలకు పైగా వసూలుచేసి ఆరోగ్యశాఖామంత్రి శ్రీ శివరాజు ప్రసాద్ గారికి యిటీవల యిచ్చారు. ఇంకా స్త్రీలు చెవిపోగులు, బంగారపు గాజులు, ఉంగరాలుకూడ యిచ్చారు.

మంత్రికి వేసిన పూలదండను వేలం వేయగా 116 రూపాయలకు కాకా కాళేశ్వరరావుగారు పాడారు ఈ మొత్తము అంతయు రక్షణ నిధికి కాజ గ్రామం తరఫున సమర్పించారు.

కోనలోవ

తూర్పుగోదావరిజిల్లా, రాజవొమ్మంగి సమితికిచెందిన కోనలోవలో ఈనెల 18 వ తేదీన బి డి. ఓ శ్రీ జె వి కామేశ్వరరావుగారి అధ్యక్షతను జరిగినసభలో రక్షణనిధికి రు. 203 లు వసూలయింది

అభివృద్ధి పనులకై అదనపు పన్నులు తప్పవట!

ఆక్ట్రాయ్ పన్నును సమర్థిస్తూ మంత్రి శ్రీ ఆలపాటి ప్రసంగం

తెనాలి, జనవరి 22

తెనాలి బట్టలవర్తకుల అసోసియేషన్ వారి 1వ వార్షికోత్సవములో శ్రీ ఆలపాటి వెంకట్రామయ్యగారు మాట్లాడుతూ ఆక్ట్రాయ్ పన్ను వలన వ్యాపారస్తునికి ఎటువంటి నష్టం లేదని చెపుతూ "మనం అభివృద్ధి కార్యక్రమాలు జరపాలి. అంటే పన్నుల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలి. మునిసిపాలిటీలలో ఇప్పటికే ఇంటిపన్నులు చాలా ఎక్కువగా పెంచబడియున్నవి. ఇంకా పెంచే అవకాశములేనందున ఆక్ట్రాయ్ పన్ను విధింపవలసివచ్చిం"దన్నారు.

గరల్స్ హైస్కూలు ఆవరణయందు మునిసిపల్ ఛైర్మన్ శ్రీ తవ్వా శ్రీరాములుగారి అధ్యక్షతన జరిగినది సభకు ముందు శ్రీ కన్నెగంటి రెడ్డెమ్మచౌదరి (జిల్లా సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంకి అధ్యక్షులు) జాతీయ జెండా ప్రతిష్ఠించారు.

మునిసిపల్ పరిపాలనాశాఖామాత్యులు శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య సభను ప్రారంభించారు. శ్రీ మామిడి కోటేశ్వరరావుగారు అసోసియేషన్ తరఫున మెమోరాండం సమర్పించారు.

అందులో వ్యాపారస్తులపై వృత్తిపన్ను సంవత్సరానికి రెండుసార్లుగా ఒక స్కీకి రెండవ స్కీకి సంబంధము లేకుండా వసూలు చేస్తున్నారనీ, దానిని మార్చి వ్యాపార పుస్తకాలను ఆధారంచేసుకొని సంవత్సరానికి ఒకేసారి వసూలు చేసే పద్ధతి ప్రవేశ పెట్టవలసినదిగాను కోరారు ఆక్ట్రాయ్ పన్ను ఆంధ్రప్రాంతములో ప్రవేశ పెట్టవద్దని కోరారు.

బంగారంకంట్రోలుపై మాట్లాడుతూ "ఈ ఆర్డినెన్సు ప్రవేశ పెట్టుటవలన దేశంలోకి దొంగబంగారం రావటం ఆగిపోయినది. ఆర్డినెన్సు ప్రకటించిన 2 వ రోజునుండే హాంకాంగ్ లో బంగారం ధర పడిపోయినది" అన్నారు.

వ్యాపారస్తులు జాతీయ రక్షణనిధికి తమ శక్తికి తగినట్లుగా విరాళాలు ఇవ్వలేదని, నిధికి ఇంకా ఉదారంగా విరాళాలివ్వవలెనని వారిని విజ్ఞప్తి చేశారు.

వెంకటగిరిలో మాస్టర్ వీవర్లసంఘం

వెంకటగిరి, జనవరి 22

నెల్లూరుజిల్లా వెంకటగిరి మాస్టర్ వీవర్ల సమావేశం జనవరి 16న శ్రీ ఎం నర్సింహులు శెట్టిగారి అధ్యక్షతను జరిగింది పనివారికి తగిన కూలి, మంచి డిజైనులు యిచ్చి వృత్తిని వృద్ధిచేయాలని తీర్మానించారు. 11 మందితో ఒక కమిటీని ఎన్నుకున్నారు. (వి ని.)

వెంకటగిరి స్వర్ణ కార్మికుల నిరుద్యోగం

వెంకటగిరి జనవరి 22

నెల్లూరుజిల్లా వెంకటగిరిలో ప్రభుత్వంవారు ప్రకటించిన బంగారు కంట్రోలు ఉత్తర్వు వల్ల తాలూకా వ్యాప్తంగా 100 కుటుంబాలవారికి స్వర్ణ కార్మికులు పనులుదొరకక కటకటలాడుతున్నారు.

లోగడ వుంచుకొన్న కొద్దిపాటి నగల వారు త్వరలో తీసుకుపొమ్మని ఒక వైపు ఒత్తిడి చేయుచున్నారు. మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలలో ప్రభుత్వం పట్ల అసంతృప్తి చెందుచున్నారు. (వి ని)

కనీసం, కల్లుపైనైనా నిషేధం తొలగించండి

పశ్చిమ గోదావరి జిల్లా కల్లుగీత కార్మిక మహాసభ తీర్మానం

నర్సాపురం, జనవరి 22

అనేకమైన అక్రమాలకు, అవినీతికి ఆకరమై, కేవలం కాగితం మీదమాత్రం నిలిచిన మద్యనిషేధాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలనీ, లేదా కనీసం కల్లుమీదగల నిషేధాన్నైనా రద్దుచేయాలనీ కోరుతూ పశ్చిమగోదావరిజిల్లా కల్లుగీత కార్మిక మహాసభలో తీర్మానించారు.

జిల్లాలోవివిధప్రాంతములనుండి షుమారు 600 మంది ప్రతినిధులు పాల్గొన్న ఈ మహాసభ ప్రారంభానికిముందు ప్రతినిధులకు ఆహ్వానసంఘాధ్యక్షులు శ్రీ తుక్కాల సాంబశివరావుగారు ఆహ్వానించారు. గీత కార్మికులను సంఘటితపరచి వారి సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన పథకాన్ని రూపొందించేందుకు యీ మహాసభ ఉద్దేశింపబడినదని ఆయన తెలిపారు.

శ్రీ జక్కంశెట్టి వెంకటేశ్వరరావు మహాసభకు అధ్యక్షత వహించారు

గీతకార్మిక సంఘాభివృద్ధికి సంఘీయులందరును సంఘటితమై, గ్రామీణ ప్రమేయం లేకుండా నిర్మాణాత్మకమైన కృషి సలిపేందుకు యీనాడు దీక్ష పూనాలని, అందుకు తలయూ సూచనలు చేయవలసినదని ఆయన అధ్యక్షస్థానం స్వీకరిస్తూ ప్రతినిధులను కోరారు.

శ్రీ ముదిపూడి సూర్యనారాయణ ఎం ఎల్. ఏ, గారు సమావేశాన్ని ప్రారంభిస్తూ "గీత కార్మికులు అన్ని విధాలా వెనుకబడియున్నారనీ, వారి సర్వతోముఖవికాసానికి సంఘ కార్యకర్తలు, వివిధరాజకీయపక్షాలు విడ్చికమైన, నిస్వార్థమైన సహకారసానుభూతులతో కృషి చేయాలని అన్నారు.

తర్వాత శ్రీ యుతులు గూడూరి రంగారావు, పంపన ఇంద్రశేఖరరావు గార్లు ప్రసంగిస్తూ ప్రభుత్వం గీత కార్మికుల బిడ్డలకు సంపూర్ణమైన ఉచిత విద్యాసౌకర్యములు కల్పించాలని, మద్యనిషేధశాఖవారి అక్రమమైన అత్యాచారాలను అరికట్టాలనీ, కనీసం కల్లుపైనైనా యీనాటి భారతదేశ ఆర్థిక పరిస్థితులను దృష్టియందుంచుకొని నిషేధాన్ని తొలగించాలనీ కోరారు.

అనంతరం "శెట్టి బలిజ" పత్రికా సంపాదకులు శ్రీ పాలా వెంకన్న గారు మాట్లాడుతూ, మంచి ఆశయములతో ప్రవేశపెట్టిన మద్యనిషేధం విఫలమైనదని తెలిసికూడా ప్రభుత్వం యింకా తన నిర్ణయాన్ని మార్చుకొనక పోవటం న్యాయం కాదని అన్నారు.

తర్వాత శ్రీ ఎస్.ఆర్. దాట్ల ఎం ఎల్. ఏ గారు, మాట్లాడుతూ నిరుద్యోగులైన గీత కార్మికులకు ప్రత్యామ్నాయ వృత్తి చూపించుటలోను, జీవనోపాధిని కల్పించుటలోను ప్రభుత్వం తన ధర్మాన్ని సక్రమంగా నిర్వహించలేకపోయినదన్నారు. మద్యనిషేధ చట్టాన్ని వెంటనే రద్దు పర్చాలని విజ్ఞప్తి చేశారు.

తరువాత, శ్రీయుతులు పీతపల్లి భీమన్న, కొను సూరన్న, తుక్కాల నరసింహామూర్తి, కడిమి నాగేశ్వరరావు, తుక్కాల వెంకన్న ప్రభృతుల ప్రసంగానంతరం కార్యదర్శి శ్రీ జక్కంశెట్టి వెంకటరావుగారు గత సంవత్సరం కృషిని, భవిష్యత్కార్యక్రమాన్ని వివరించారు.

పిమ్మట యీ క్రింది కార్యవర్గాన్ని నూతన సంవత్సరానికి యేకగ్రీవంగా యెన్నుకొన్నారు:

అధ్యక్షులు: శ్రీ జుత్తిగ మారియ్య; ఉపాధ్యక్షులు: శ్రీ జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, శ్రీ తుక్కాల సాంబశివరావు, శ్రీ కడిమి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు: శ్రీ జక్కంశెట్టి వెంకటరావు, శ్రీ పంపన ఇంద్రశేఖరరావు; సహాయ కార్యదర్శులు: శ్రీ తుక్కాల నరసింహామూర్తి, శ్రీ ఎరపల్లి భీమన్న, శ్రీ కాకా నరసింహామూర్తిగార్లు

కార్యవర్గ సభ్యులు: శ్రీయుతులు కాను సూరన్న, ములుల మారియ్య, బొర్రా మంగారావు, పీతాని శ్రీరాములు, బొక్కా సూర్యనారాయణ, తుక్కాల వెంకన్న, గూడూరి శాకన్న, కొమన హనుమంతరావు, గూడూరి రంగారావు, గురు రెడ్డి, మామిడిశెట్టి అప్పారావు, జోగి బలరామమూర్తి, కోడి శ్రీరాములు, ఇళ్ల ముసలయ్య, జేంద్ర అప్పారావు, పీతపల్లి సత్యం, కడలి నరసింహామూర్తి, కాకా వెంకన్న, కముజు రామారావు, పిల్లి పులంశెట్టి, జేంద్ర వీరంశెట్టి, కట్టా పామయ్య, ఎస్ ఆర్ దాట్ల ఎం ఎల్. ఏ, పెచెట్టి సోమన్న గార్లు

చింతలపూడి కొవ్వూరు, ఏలూరు, తాడేపల్లిగూడెం తాలూకాలనుండి ఒక్కొక్క ప్రతినిధిని కోఆప్ట్ చేసుకొనేందుకు అధికార మిచ్చారు.

శ్రీ పాలా వెంకన్న గారు, శాసన సభ్యులు శ్రీయుతులు ముదిపూడి సూర్యనారాయణ, ఎస్ ఆర్ దాట్ల, ఈవూరి సుబ్బారావుగార్లకు సన్మానం జరిపారు.

ఆ రాత్రి శ్రీ జక్కంశెట్టి వెంకటరావు గారి అధ్యక్షతను జరిగిన బహిరంగ సభలో శ్రీయుతులు ముదిపూడి సూర్యనారాయణ, ఈవూరి సుబ్బారావు, ఎస్ ఆర్. దాట్ల, వంకా సత్యనారాయణ, పరకాల శేషావతారంగార్లు పాల్గొన్నారు.

సభానంతరం కోటిలింగాల వారిచే 'పెండ్లి పెద్దలు,' యిలమంచిలివారిచే "కన్నకొడుకు" నాటకములు ప్రదర్శింపబడినవి.

భారతావనిపై చైనా దురాక్రమణను నిరసింపుచూ, గీత కార్మికులకు బంజరు పంచవలెననీ, గీతకార్మికుల బిడ్డలకు ఉచిత విద్యాసౌకర్యములు కావాలనీ, తైపన్నులు సకాలంలో యివ్వవలెననీ మహాసభలో తీర్మానాలు చేశారు.

హైవేస్ పనివారికి అమలు జరగని 'జనవరి 17 శెలవు'

విజయవాడ, జనవరి 22

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వామి వివేకానంద శతజయంత్యుత్సవ సందర్భంగా జనవరి 17 వ తేదీని శెలవుదినంగా ప్రకటించింది. ఆ జీ వో హైవేస్ శాఖ అన్ని డివిజన్లకు రావటం ఆఫీసులను మూసివేయటం జరిగింది. అయితే హైవేస్ డివిజనల్ యింజనీయర్లు ఏ ఒక్క డివిజనులోను హైవేస్ కార్మికులయిన మజ్దూర్లు, మేస్త్రీలు, డ్రయివర్లు, క్లీనర్లు, వర్కుషాపు కార్మికులు మొదలైనవారికి శెలవుయివ్వలేదని తెలుస్తున్నది. జీతమైనాకూడా పత్తిస్తుందని వర్కుషాపు కార్మికులు తెలియచేసినా నిరాకరించారట.

ఆరోజున కార్మికులంతా పనిచేశారు, గనుక ఆదినం ఓవర్ టైం దినంగా భావించి కూలినివ్వాలని పనివారు కోరుతున్నారు.

'యజమాని చెప్పిందే నిజం: అనుమానముంటే కోర్టుకుపో'

తొలగించబడిన కార్మికులకు కార్మికశాఖాధికారులిచ్చే సలహా!

చీపురుపల్లి, జనవరి 22

శ్రీకాకుళంజిల్లా చీపురుపల్లి సత్యనారాయణ గ్రాంక్ (ప్రైవేటు) లిమిటెడ్ లో శ్రీ విష్ణుమూర్తాచారి ఫిట్టరుగా 1961 ఆగష్టు 19 నుండి 1962 అక్టోబరు 2 వరకూ పనిచేశాడు నెలకి రు. 200 జీతం ఏ కారణం చూపకుండానే పై తేదీన యజమానులు అతనిని పనినుండి తొలగించారు. తొలగించేటప్పుడు నెలనోటీసు జీతం గాని, తొలగింపు పరిహారం గాని, సెలవు దినాల పనిజీతం గాని ఏవీ యివ్వలేదు న్యాయంగా చూస్తే అంతాకలిసి కనీసం రు. 686/- వరకూ రావలసి యున్నది.

కార్మికుడు తనకు జరిగిన అన్యాయాన్ని గూర్చి విశాఖపట్నం సెంట్రల్ లేబరు ఇన్ స్పెక్టరుకు పిటీషను పెట్టుకున్నాడు ఆపైన, ముఖస్థంగా పరిస్థితిని విన్నవించుకున్నాడు అదే రోజున మేనేజిమెంటువారుగూడా ఇన్ స్పెక్టరును కలుసుకున్నారు

కాని, ఫలితం ఏం జరిగిందంటే యజమానులు చెప్పిందంతా నమ్మాడు ఇన్ స్పెక్టర్. "నీవు తృప్తి పడనపుడు కోర్టుకు పో" అని కార్మికునికి సమాధానమిచ్చాడు నెలనోటీసు, జీతం యివ్వకూడని కారణం కూడా మేనేజిమెంటన్నదట! ఇన్ స్పెక్టరు నమ్మేరట!! ఇక తో గాని, ఫిట్టరుతో గాని సంబంధం లేదట!! పరిహారం కూడా వారు యివ్వనపుడే పుమ్ములో దానికి నిర్ణయించాలట కనీసం విచారణ కూడా జరపకుండా ఇన్ స్పెక్టరు యిలా సమాధానమిచ్చాడు.

పోనీ, లేబర్ కమీషనర్ కైనా న్యాయం చెప్పించగలరేమోనని తిరిగి అప్పీలు చేస్తే అతి - గతీ ఏమీలేదు

ఈ కంపెనీలో ఆదివారం సెలవు అంటూ గేటువద్ద బోర్డు మాత్రం యుంటుంది. (వి ని)

పర్కాల తాలూకా కమ్యూనిస్టు సమావేశం

పర్కాల, జనవరి 20

వరంగల్ జిల్లా పర్కాల తాలూకా భాగిర్తిపేట గ్రామంలో తాలూకా కమ్యూనిస్టుపార్టీ జనరల్ బాడీ సమావేశం శ్రీ యస్. భీమారావు, (కోటంచ గ్రామ సర్పంచ్) అధ్యక్షతను జరిగింది సమావేశమునకు 80 మంది సభ్యులు హాజరయ్యారు.

ములుగు తాలూకా వెంకటాపురం గ్రామ శాఖా కార్యదర్శి శ్రీ సాంబయ్యగారిని హత్యచేసినవారిపై ప్రభుత్వం గట్టిచర్య తీసుకోవాలని తీర్మానించారు వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

జిల్లాసమితి కార్యదర్శి, శ్రీ టి. సత్యనారాయణరావుగారు జాతీయ సమితి తీర్మానాన్ని వివరించారు. పర్కాల కమ్యూనిస్టు నాయకుడు శ్రీ రాందాసు కూడా మాట్లాడిన తర్వాత సమావేశం ముగిసింది.

విజయవాడలో త్యాగరాజారాధన

విజయవాడ, జనవరి 24

భారతీయ కళాసమితి, సంగీత శాఖ వారి ఆధ్వర్యమున దుర్గాపురము శ్రీ త్యాగరాజస్వామివారి ఆలయములో 14వ త్యాగరాజస్వామివారి ఆరాధనోత్సవము ప్రారంభం అయ్యాయి ఉదయం 8 గంటలకు ఆరాధన, తదుపరి నాదస్వర విద్వాన్ శ్రీ అలుగోలు అంజనేయులు బృందంవారిచే నాదస్వరకచేరి జరుపబడినది.

స్థానిక సంగీత విద్వాంసులు గాయకరత్న శ్రీ చిలకలపూడి వెంకటేశ్వరశర్మ గారి ఆధ్వర్యమున గానము చేశారు శ్రీయుతులు పోలవరపు రామచంద్రరావు, శ్రీ చావలి కృష్ణమూర్తి, శ్రీ వుండవల్లి కృష్ణమూర్తి, శ్రీ యస్. శాంతశీలం, శ్రీ యం వి రమణమూర్తి, శ్రీ యం. మల్లికార్జున అయ్యావారు, చిన్నకుల శ్రీరామమూర్తి, కుమారి మద్దాలి విమలకుమారి, శ్రీ గుడిపాటి కృష్ణమూర్తి, శ్రీ మహాదేవ సుబ్రహ్మణ్యం, శ్రీ కె. సుబ్బరాయశర్మ గార్లు పాల్గొన్నారు

సాయంత్రం 6 గంటలకు కుమారి ఎం. కె ఎస్ విజయలక్ష్మి వీణ కచేరి, తదనంతరం గాయకరత్న శ్రీ చిలకలపూడి వెంకటేశ్వరశర్మ గారి గాత్ర కచేరి జరిగినది

తదుపరి రెండు రోజుల కార్యక్రమము జనవరి 26, 27 తేదీల యందు జరుగును. ఆ రెండు రోజులలోను కర్ణాటక గాత్ర సంగీత పోటీలు, సంగీత కచేరీలుజరుగును

శ్రీకాకుళంజిల్లా సోంపేట తాలూకా బారువలో, పొందర్ల వ్యవసాయ కార్మిక సంఘ ప్రథమ వార్షికోత్సవం సంక్రాంతి నాడు జరిగింది. సంఘాధ్యక్షులు శ్రీ దామోదరం బాడత్య ఉపన్యసించారు. కడపటి సంఘంవారు కొని పెట్టిన నూతన వస్త్రాలను చుడాయిప్యాతో, సుబ్బమ్మ గార్లు సంఘంలోయున్న కడు పేదవారికి పంచిపెట్టారు.

శ్రీ వివేకానంద శత జయంత్యుత్సవాలు

రాజమండ్రి, జనవరి 21

ప్రపంచ విఖ్యాత భారతీయ తత్వవేత్త స్వామి వివేకానంద శతజయంతి ఉత్సవాలు రాజమండ్రిలో 11 న జరుపబడ్డాయి

ఈ సందర్భంలో స్థానిక రామకృష్ణ మఠంలోను, రామకృష్ణ సేవాసమితిలోను స్వామి నిర్వికల్పానంద ఆధ్వర్యాన ప్రార్థనలు జరిగాయి.

ఆ సాయంత్రం రాజమండ్రి రామకృష్ణ సేవాసమితిలో శ్రీ అవసరాల రామారావుగారి అధ్యక్షతయందు జరిగిన సభలో శ్రీ మాకస్తి నాగేశ్వరరావు, వేదాల చిన్నయ బ్రహ్మం గారలు ప్రసంగించారు

శ్రీ పింగళ దీక్షితులు సభికులకు అభివందనలు తెలిపారు

జయంతి నైవేద్య కమిటీవారి ఆధ్వర్యాన పూరేగింపు జరిగిన తర్వాత ఆ రోజున టౌను హాలులో బహిరంగ సభ జరిగింది నీలకంఠం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ టాచి మంచి కామేశ్వరరావుగారు సభకు అధ్యక్షత వహించారు.

స్వామి కారుణ్యానంద, డా. ఎ బి నాగేశ్వరరావు, జమదగ్ని శర్మ, శ్రీమతి సాధుశనాబాయిగార్లు ఉపన్యసించారు.

శ్రీ బి యల్. యస్ వెంకట్రామయ్య అభినందనలు తెలిపారు.

(వి ని)

వెల్లటూరులో

గుంటూరుజిల్లా వెల్లటూరు హైస్కూలులో 17 వ తేదీన హెడ్మాస్టరు శ్రీ పి. వి రామబ్రహ్మంగారి అధ్యక్షతను సభ జరిగింది. శ్రీ చెరుకుపల్లి అంజనేయశాస్త్రి, శ్రీ నాగెళ్ళ విరబసవయ్యగార్లు వివేకానందుని జీవితం, వారి సేవ గూర్చి ఉపన్యసించారు సారస్వత సంఘ కార్యదర్శి శ్రీ టి గురుమూర్తిగారి వందన సమర్పణతో సభ ముగిసింది.

వెంకటాయపాలెంలో

వెంకటాయపాలెం సమితి ఎలిమెంటరీ స్కూలులో స్వామి వివేకానంద శతజయంతి ఉత్సవాలు జరిగాయి.

తానికొండ వెంకటరత్నం(హెడ్మాస్టరు) గారి అధ్యక్షతను సభ జరిగినది.

విశాఖపట్నంజిల్లా చోడవరం పేరెంట్సు అసోసియేషనువారి ఆధ్వర్యమున చోడవరం పంచాయితీ సమితి హయ్యరు ఎలిమెంటరీ స్కూలులో బీద విద్యార్థుల మధ్యాహ్న భోజన కేంద్రమును శ్రీమతి ఇందర్ప చిట్టి కామేశ్వరమ్మగారు 17వ తేదీన ప్రారంభించారు. డాక్టరు శ్రీ ఇందర్ప కృష్ణమూర్తిగారు సభకు అధ్యక్షత వహించారు.

అనేక ప్రాంతాల్లో సంక్రాంత్యుత్సవాలు

దింటెనపాడు, జనవరి 20

నర్సరావుపేట తాలూకా దింటెనపాడు గ్రామంలో సంక్రాంతి నాడు గ్రామ యువజన అభ్యుదయసంస్థ వారిచే 'రక్తబంధాలు' నాటక ప్రదర్శనం జరిగింది అంతకుముందు చిన్నపిల్లల బాలాజీ నాట్యమండలివారిచే "చివరకు మిగిలేది" నాటిక ప్రదర్శింపబడింది శ్రీ నందిగం పెద్దన్న పాటకచేరి కూడా జరిగింది.

వేట్లపాలెం

అమలాపురం తాలూకా కాట్రేనికోన సీవారు వేట్లపాలెంలో 13, 14 తేదీలలో యువజన సంఘం ఆధ్వర్యాన ఆటల పోటీలు జరిగినవి రాత్రి 10 గంటలకు బహిరంగసభ కూడా జరిగింది. దీనికి సంఘాధ్యక్షులు శ్రీ అంగాని వెంకట్రావు అధ్యక్షత వహించారు. 1000 మంది పాల్గొన్న ఈ సభలో స్థానిక పంచాయితీ అధ్యక్షులు శ్రీ కాకాని విష్ణుప్రసాదరావు, తాలూకా కమ్యూనిస్టు పార్టీ సభ్యులు శ్రీ వనపర్ల సుబ్బారావు, శ్రీ అంగాని వెంకటస్వామి తదితరులు మాట్లాడారు

తరువాత పోటీలలో గెలిచిన టీములకు శ్రీవనపర్ల నాగేశ్వరరావుగారు బహుమతులిచ్చారు

తర్వాత "బడిపంతులు", "నాస్తికుడు" నాటిక, నాటకములను ప్రదర్శించారు.

పోడూరులో

పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు నేతాజీ బాలసంఘం 11, 12, 13, 14 తేదీలలో సంక్రాంతి ఆటల పోటీలు జరిపింది కబాడీ, రింగు టెన్నిస్, క్యాట్ మెంటన్, క్యారమ్స్, పిక్ బోర్డు పందెములు జరిగినవి, ఈ ఆటలలో 18మంది బాలబాలికలు పాల్గొన్నారు.

ప్రదేశ్ బ్యాంకిఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం

విజయవాడ, జనవరి 22

ఇటీవల యిక్కడ జరిగిన ఆంధ్రప్రదేశ్ బ్యాంకి ఉద్యోగుల సంఘ 6వ మహాసభలో యీక్రింది నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అధ్యక్షులు: శ్రీ రాజబహదూర్ గౌడ్ ఉపాధ్యక్షులు: శ్రీ యస్. జె పాటర్ సన్, శ్రీ డి బ్రహ్మానందం; ప్రధాన కార్యదర్శి: శ్రీ ఎ సుందరరావు, సహాయకార్యదర్శులు: శ్రీ జి. జె మూర్తి, శ్రీ జె వి పి. కుటుంబరావు, శ్రీ వి అంబరీషుడు, కోశాధికారి: శ్రీ యస్. యస్. మూర్తి. (వి. ని.)

సింగరేణి బొగ్గుగనుల యువజన గ్రంథాలయం

గోదావరిఖని, జనవరి 15

సింగరేణి కాలరీస్ వర్కర్సు యూనియన్ ఆఫీసులో మాజీ చలనచిత్ర సహాయ దర్శకులు శ్రీ సూర్యశేరి కోటేశ్వరరావుగారు 10వ తేదీన యువజన గ్రంథాలయానికి ప్రారంభోత్సవం చేశారు.

వారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో, శ్రీయుతులు మాదిరెడ్డి భాస్కరరావు, పి హెచ్ వి శ్రీశాస్త్రి మాట్లాడిన పిమ్మట క్రింది కమిటీ ఎన్నికయింది

గౌరవ కార్యదర్శి: శ్రీ ఎ బసవయ్య సహాయ కార్యదర్శి: శ్రీ రాజయ్య, కోశాధికారి: శ్రీ వి రాజగోపాలరావు మరి నలుగురు సభ్యులు.

విజయనగరంలో

విజయనగరం ఆర్యవైశ్య సంఘం లోను, కొత్తపేట గొల్లవీధి స్వామి వివేకానంద యువజనసంఘం లోను వివేకానంద శతజయంతి ఉత్సవములు జరిగాయి. పలువురు ఉపన్యసించారు. (వి ని.)

కొల్లూరులో

కొల్లూరు జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో 17 వ తేదీ సాయంత్రం శ్రీ వివేకానంద శతజయంత్యుత్సవం కావలి కాలేజి ప్రిన్సిపాల్ శ్రీ శ్రీరాం వెంకటసుబ్బరాయశర్మ గారిఅధ్యక్షతను జరిగింది.

అధ్యక్షులవారు తొలుత ప్రాచ్య, పాశ్చాత్య నాగరకతలకుగల భేదములను వివరించి, శ్రీ స్వామివారిని సమన్వయ గురువనీ, పాశ్చాత్య దేశములలో భారతీయ సంప్రదాయములను వివేకానందుడు ఎలుగెత్తి చాటుటవలననే నాటిదేశములలో భారతదేశం మేటి యగుటకు కారణమైనదని ఉగ్గడించారు

పిదప శ్రీయుతులు మైనేని చినరామబ్రహ్మయ్య, గుత్తికొండ సీతారామయ్య, ఓలేటి చిరంజీవి, మూడల వెంకటరత్నయ్యగారలు శ్రీ వివేకానందుని ప్రతిభావిశేషాలనుగూర్చి ప్రసంగించారు

ఒంగోలులో

ఒంగోలు సి వి ఆర్ హైస్కూలు భవనంలో శ్రీ వివేకానంద శతజయంతి ఉత్సవము జనవరి 17 గురువారం మొదలు 20 ఆదివారం వరకు జరిగాయి శ్రీ స్వామి శివశంకరులు అధ్యక్షత వహించగా శ్రీవావిలాలసోమయాజులు, శ్రీ అసంగానంద స్వాములవారు, శ్రీ మాతాజీ, అమ్మలమడక మాధవశర్మ గారు శ్రీ స్వామివారి జీవితానుభవములు, ఉద్బోధనలనుగూర్చి ఉపన్యసించారు.

పశ్చిమ గోదావరిజిల్లా అత్తిలి సమితి స్వతంత్రపార్టీ కార్యదర్శి శ్రీ కోనూరి జానకిరామరాజు గారు స్వతంత్రపార్టీకి రాజీనామా యిచ్చారు.



లేఖలు

స్థానిక సంస్థలలో శాసనసభ్యుల ప్రవేశం

ఆర్యా,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు కొత్తగా సవరించబోవు మున్సిపల్ చట్టంలో కొన్ని సవరణలు తలపెట్టినట్లు పత్రికలవలన తెలియుచున్నది ప్రస్తుతం ఉన్న దానికంటె పురపాలకసంఘ, అధ్యక్షుల విశేష అధికారములు యివ్వడంలో పాటు, శాసన సభ్యులను పురపాలక సంఘములలో ఓటింగ్ హక్కులేని సభ్యులుగా చేయుట మొదలైనవి ఉన్నట్లు ముఖ్యమంత్రి, ప్రణాళికాశాఖ మంత్రుల ప్రకటనను బట్టి విశదమగుచున్నది

దీనివల్ల పురపాలక సంఘములకు చాలా అపకారము జరుగగలదు మునిసిపాలిటీలు ప్రస్తుతము కొద్దోగొప్పో తమ పనులను సాఫీగా, చక్కగా నడుపుకొనుచున్నవి. ప్రశాంతముగా యున్న స్థానిక సంస్థల పరిపాలనలో ఓటింగ్ హక్కులేని శాసనసభ్యులు ప్రవేశించి ప్రత్యక్షముగా స్థానిక సంస్థలను తమ ఆధీనంలో ఉంచుకొని కలతలు, తదితర కక్షలు సాధించుకొనుటకు పూనుకొనగలరు. ఈ పద్ధతివలన జరుగబోవు అనర్థములను మునిసిపాలిటీలను కేంద్రములుగా చేయు ఈ విధానము వెంటనే విరమించుకోవాలి

శాసనసభ్యులు యిప్పుడు అనేక సంఘములలో సభ్యులైయున్నారు. మరియు జిల్లాపరిషత్ లోనూడా సభ్యులైయున్నారు. ఇంకా వారిని పురపాలక సంఘములలోకూడా ప్రవేశపెట్టి వారి అదుపు ఆజ్ఞలకు లోబడి కౌన్సిలర్లు నడచుకొనేటట్లుచేయు యీ నూతన చట్టము ప్రవేశపెట్టుటకు పూర్వము ప్రభుత్వము కౌన్సిళ్ళ అభిప్రాయము కోరిన బాగుండెడిది

కొత్తచట్టము ప్రవేశపెట్టిన ప్రభుత్వమువారు అధ్యక్షులకు విశేషాధికారములు దగ్గరచేయవచ్చును కానీ కౌన్సిళ్ళపట్ల యిటువంటి అపకారము చేయు యీచట్టము అమలు జరుపుటకు ముందు ప్రజాభిప్రాయము సేకరించవలయునని, ఈకొత్తవిధానమును విరమించవలయునని ముఖ్యమంత్రులకు, స్థానిక పాలనాశాఖామాత్యులకు విన్నవించుకొనుచున్నాను

ఇట్లు,
కొల్లెపు భిక్షాలు, వైస్ ఛైర్మన్
చీరాల మున్సిపల్ కౌన్సిల్

మృతిజెందిన మత్స్య పారిశ్రామికులకు సహాయం

ఆర్యా,

అమలాపురంతాలూకా 'బలుసుతిప్ప' మత్స్యపారిశ్రామికులు దాసు తాతియ్య, దాసు అప్పారావు, దాసు వీర్రాజు, దాసు అప్పారావు, సంగాని ధనరాజులు, సంగాని నాగయ్య, ఓలేటి గంగరాజు యీ ఏడుగురు 15-9-1962 వ తేదీ రాత్రి, కాకినాడ రేవుకు సమీపంలో పున్నె, బలుసుతిప్ప నుండి, సముద్రంమీదుగా చేపలవేటకు వెళ్ళి, తుఫాను వల్ల కలిగిన ప్రమాదంలో, సముద్రం పాలైపోయినారనే అభిప్రాయం దృఢపడిపోయింది.

సముద్రంపాలైన కుటుంబాలు మూడువేల రూపాయలు ఆస్తినష్టముకు, మరణించిన యీ ఏడుగురు మత్స్యపారిశ్రామికుల బీద కుటుంబములకు తగు సహాయం కలిగించవలసినదిగా ప్రభుత్వము వారికి తెలుపుకోబడింది మంత్రి శ్రీ మర్రి చెన్నారెడ్డిగారు 20-11-62 వ తేదీన 'బలుసుతిప్ప' విచ్చేసిన సందర్భమున యీ విషయమై విన్నవించబడింది. కాని యింతవరకు ప్రభుత్వము నుండి ఏ విధమైన సహాయం లభించి యుండలేదు ఈ బీద కుటుంబీకులు ఎట్టి బాధలకు గురికాకుండుటకు గాను, ప్రభుత్వమువారు వెంటనే తగు సహాయం చేయుమని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇట్లు,
మల్లాడి స్వామి,
(మునిసిపల్ కౌన్సిలర్, కాకినాడ)

భీమా ప్రీమియములు

ఆర్యా,

ప్రస్తుతం, భీమా పట్టాదారులు కట్టవలసిన "ప్రీమియములకు" భీమా కార్యాలయమునుండి ప్రీమియం నోటీసులు డిసెంబరు నోటీసులు, రశీదులు మొదలైనవి బుక్ పోస్టుద్వారా 8 న. పై. లు ఖర్చుతో వచ్చుచున్నవి. పైనోటీసులు, రశీదులను 5 న పై కార్డులమీద అచ్చువేసి, పట్టాదారుకు పంపిన 3 న. పై. లకే పనిజరుగుగుండి దీనివల్ల ప్రతి సంవత్సరము కావలసినంత డబ్బు, కాగితముల పొదుపు, భీమా సంస్థకు కలిసిరాగలదు ఈ విషయమై భీమాసంస్థ అధికారులు ఇప్పటికైనను పరిశీలించగలరని ఆశించుచున్నాను.

ఇట్లు,
బి. కొండయ్య, పాలసదారు,

మున్సిపల్ ఛైర్మన్ లకు నెలవారీ అలవెన్సు

ఆర్యా

మునిసిపల్ ఛైర్మన్లకు మాసమునకు రు 100/- లు ఎలవెన్సు, సమావేశమునాడు రు 8/- లు బత్తా ఇచ్చుటకు ఆంధ్రప్రభుత్వము ఆమోదించినట్లు పత్రికలలో ప్రకటింపబడింది. ఇది కేవలం అన్యాయము యీ చర్య వెంటనే విరమించుకోవడం తెలివైనపని.

ఇట్లు
పల్లపోలు సాంబయ్య, ప్రధాన కార్యదర్శి,
ఆంధ్రప్రదేశ్ సోషలిస్టుపార్టీ, వేటపాలెం

సభలు-సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ మైకా వర్కర్సు యూనియన్ కార్యవర్గం సమావేశం నెల్లూరుజిల్లా సైదాపురం గ్రామంలో 27-1-63 తేదీన ఉదయం 10 గంటలకు జరుగుతుంది.

◆ ◆ ◆

బందరు పట్టణ, గూడూరు తాలూకా కమ్యూనిస్టుపార్టీ సభ్యుల, సానుభూతిపరుల జనరల్ బాడీ సమావేశం బందరు టవున్ హాలులో 27—1—63 న మధ్యాహ్నం 3 గంటలనుండి జరుగుతుంది

◆ ◆ ◆

ఈ నెల 27 వ తేదీ సాయంకాలం 3 గంటలకు "విజయవాడ పబ్లిక్ ఇంగ్లీషు స్కూలు" ప్రారంభోత్సవం జరుగుతుంది.

వ్యవసాయ వస్తు ధరలు

విజయవాడ, జనవరి 24

విజయవాడ రీజినల్ అసిస్టెంట్ మార్కెటింగ్ ఆఫీసర్ వారు అందజేసిన ఉత్పత్తిదారుల నుండి కొనుగోలుచేయు టోకు ధరలు. (ఒక క్వింటాల్) 100 కిలోగ్రాములు, లేక 220½ పౌనులు:

ధాన్యం			
సంబన్లు	విజయవాడ	రు. 43-75	36.00
„	కాకినాడ	42-76	35-19
అక్కుళ్ళు:	విజయవాడ	37-00	32-25
„	తాడేపల్లిగూడెం	34-37	31-25
„	కాకినాడ	33-15	31-57
„	ఆముదాలవలస		31-00
సన్నకృష్ణ కాటుకలు.			
	తాడేపల్లిగూడెం	36-34	32-57
సన్నాలు:	ఆముదాలవలస		32-83
మొలకొలుకులు:	నెల్లూరు		44-12
మిల్లు బియ్యం			
సంబన్లు	విజయవాడ	రు. 75-50	
సన్నాలు	ఆముదాలవలస	58-41	
అక్కుళ్ళు	విజయవాడ	59-00	48 50
„	తాడేపల్లిగూడెం	56-76	51-35
„	కాకినాడ	56-98	48-26
„	ఆముదాలవలస		50-57
సన్నకృష్ణ కాటుకలు:			
„	తాడేపల్లిగూడెం		62-16
సంబన్లు	కాకినాడ	69-66	
„	చిత్తూరు		77-78
మొలకొలుకులు	నెల్లూరు		68-75
వేరుశనగ			
కాయలు	విజయవాడ		రు. 63-25
„	నంద్యాల		—
„	ఆదోని		55-37
„	విజయనగరం		51-19
పప్పు	విజయవాడ		82-50
„	నంద్యాల		—
„	ఆదోని		75.00
„	విజయనగరం		76 00
నూనె	విజయవాడ		155-00
„	నంద్యాల		—
„	ఆదోని		153-00
„	విజయనగరం		—
అపరాలు			
కందులు:	విజయవాడ		రు. 41-00
„	గుంటూరు		42.00
„	ఆముదాలవలస		46-28
మినుములు	విజయవాడ		70-00
„	గుంటూరు		68.00
„	ఆముదాలవలస		59-17
పెసలు	విజయవాడ		42-00
„	గుంటూరు నల్లవి		—
„	„ పచ్చవి		44.00
„	ఆముదాలవలస		45-16
శనగలు:	విజయవాడ		50-00
జొన్నలు			
అనంతపురం		తెల్లవి	33.00
బెల్లం			
మొదటిరకం,	అనకాపల్లి		రు. 51-40
మూడవరకం	అనకాపల్లి		45-10
మొదటిరకం,	చిత్తూరు		68-32
మూడవరకం	„		58-35
జీడిపప్పు			
వేటపాలెంలో:			
	మొదటిరకం		రు. 477-37
„	జేకాలి		418-13
„	బద్దలు		390-10
„	ముక్కలు		395-45
మిర్చి			
దేశవాళి	గుంటూరులో:		రు. 300-00
జి. రెండవరకం	గుంటూరు		210-00
నెయ్యి			
		పల్నాడు	దేశవాళి
గుంటూరులో		520-00	580-00
కొబ్బరికాయలు			
వెయ్యింటికి ధరలు			
		కొత్తవి	పాతవి
విజయవాడ:		రు 195-00	220-00
పాలకొల్లు		165-00	215-00
రాజమండ్రి:		150-00	200-00
పసుపు			
దుగ్గిరాలలో:	కొమ్ములు		రు 144-45
	కాయలు		రు 146-37
కడపలో:	కొమ్ములు		—
	దుంపలు		119-00
జనపనార			
విజయనగరం	మొదటిరకం		—
	రెండవరకం		—
	మూడవరకం		—
ఆముదాలవలసలో	మొదటిరకం		60-00
	రెండవరకం		[illegible]
	మూడవరకం		[illegible]

"భారత-చైనాలమధ్య చర్చలకు సహేతుకమైన ప్రాతిపదిక"

కొలంబో ప్రతిపాదనలపై లోక్ సభలో శ్రీ ఎ. కె. గోపాలన్ ఉద్ఘాటన

ప్రతిపాదనలను అంగీకరించాలని కాంగ్రెసు సభ్యుల ప్రసంగాలు

న్యూఢిల్లీ, జనవరి 23

వాటి వివరణలతోసహా కొలంబో ప్రతిపాదనలు మన గౌరవానికి, మన ప్రధాన ప్రయోజనాలకు అనుగుణ్యంగానే వున్నాయనీ, భారత-చైనాలమధ్య సంప్రతింపులకు అవి సహేతుకమైన ప్రాతిపదికగావున్నాయని నేడు లోక్ సభలో కమ్యూనిస్టుపక్ష నాయకుడు శ్రీ ఎ కె గోపాలన్ అన్నారు.

కొలంబో ప్రతిపాదనలను, వాటి వివరణలతోసహా సభవారు పరిశీలనలోకి తీసుకోవాలంటూ ప్రధాని నెహ్రూ ప్రతిపాదించిన తీర్మానంపై నేడు లోక్ సభలో చర్చ ప్రారంభమైంది.

చర్చ సందర్భంలో కాంగ్రెసు కమ్యూనిస్టుపార్టీల సభ్యులు, కొంతమంది ఇండిపెండెంటు సభ్యులూ కొలంబో ప్రతిపాదనలను అంగీకరించాలన్న ప్రతిపాదనను బలపరచుతూ మాట్లాడారు. భారత-చైనాలమధ్య సంప్రతింపులకు ఆ ప్రతిపాదనలను ప్రాతిపదికగా చేసుకోవాలన్నారు.

ప్రజాసోషలిస్టు, స్వతంత్ర, సోషలిస్టు, జనసంఘ సభ్యులు ఆ ప్రతిపాదనలను నిరాకరించాలని కోరారు.

చర్చ రేపుకూడా కొనసాగుతుంది.

శ్రీ గోపాలన్ చర్చను ప్రారంభిస్తూ, ఈప్రతిపాదనలుచేసింది తటస్థరాజ్యాలనీ, అందువలన "సహజంగా అవి మన మిత్రదేశాలని" చెప్పాలి కాబట్టి అవిచేసిన ప్రతిపాదనలను సుహృద్భావంతో గట్టిగా అవగాహన చేసుకోవలసిన అవసరం కలదన్నారు. రెండో విషయం: భారత-చైనాల మధ్య ఘర్షణ ప్రపంచ శాంతికి భంగం కలిగించే సంక్షోభ సమయంలో ఈ ప్రతిపాదనలు చేయబడినాయి. అందువలన కొలంబో రాజ్యాలకు మనం కృతజ్ఞులమై వుండాలి, వాటి చిత్తశుద్ధిని మనం శ్లాఘించాలి అని శ్రీ గోపాలన్ అన్నారు.

శ్రీ గోపాలన్ యింకా యిలా అన్నారు:

"వివరణలతోసహా ఈ ప్రతిపాదనలను చైనా ప్రభుత్వం ఆమోదించి, ముఖాముఖి చర్చలకు సిద్ధంకాగలదని ఆశిందాం. అలా వారు చేయకపోతే ప్రపంచమే వారిని నిందించుతుంది దాని ఫలితాలను వారే అనుభవిస్తారు."

రంగా ప్రసంగం

స్వతంత్రపార్టీ నాయకుడు శ్రీ యన్ జీ. రంగా మాట్లాడుతూ, కొలంబో ప్రతిపాదనలపై ప్రధానమంత్రి తీసుకొన్న వైఖరితో తమకు సంబంధం లేదన్నారు. "ఈ ప్రతిపాదనలు గౌరవప్రదమైనవనీ, న్యాయమైనవనీ నేననుకోవడంలేదు" అని ఆయనన్నారు.

చైనావారు ఉపసంహరించుకొన్న ప్రాంతాలపై జాయింటు కంట్రోలు వుండాలన్న అంశాన్ని గురించి శ్రీరంగా ప్రస్తావించి యిలా అడిగారు: వారు ఆక్రమించిన మన భూభాగంపై పరిపాలనలో చైనా భాగస్వామ్యం వుండాలని కోరడం న్యాయమా?

కొలంబో ప్రతిపాదనలను ఆమోదించితే ఆక్రమిత ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకొనే అవకాశాన్ని భారతదేశం వదులుకోవడమే కాగలదని శ్రీ రంగా అన్నారు.

శ్రీ యు.యన్. ఢేబర్ (కాంగ్రెసు-గుజరాత్) ప్రసంగిస్తూ, కొలంబో ప్రతిపాదనలు సంప్రతింపులకు ఒక ప్రాతిపదికను మాత్రమే ఏర్పరచనాయిగాని, తుది పరిష్కారానికి మరలు కాదన్నారు. ఈ ప్రతిపాదనలను నిరాకరించాలంటేవారు సరిహద్దు సమస్యకు సైనిక పరిష్కారాన్నే ఆచరణలో కోరుతున్నారనిఅన్నారు. మనం అలాంటి వైఖరిని తీసుకొంటే చైనావారికి బాగా ఉపయోగపడిన వారమవుతామని శ్రీ ఢేబర్ హెచ్చరిక చేశారు.

సైనికరీత్యా యిప్పుడే పరిష్కారం చేసుకోవాలని చైనా కోరుతున్నదనీ, కాలంగడిస్తే భారతదేశం బలపడి తీరగలదని వారికి తెలుసుననీ శ్రీ ఢేబర్ అన్నారు.

శ్రీమతి రేణు కా రే (కాంగ్రెసు-బెంగాల్) చైనావారిని మనం ఏమాత్రం నమ్మరాదనీ, మన రక్షణ కృషిని సడలించుకోరాదనీ అన్నారు కొలంబో ప్రతిపాదనలను చైనా ఆమోదించితే మనమూ ఆమోదించాలన్నారు.

శ్రీ ఎ పి జెయిన్ (కాంగ్రెసు-మైసూరు) కొలంబో ప్రతిపాదనలను మనం ఆమోదించితే భారతదేశం శాంతిని కోరడంలేదనే చైనావారి ప్రచారం శుద్ధఅబద్ధమని రుజువుచేసిన వారమవుతామన్నారు.

శ్రీ హెచ్. సి దాసప్ప (కాంగ్రెసు-మైసూరు) మాట్లాడుతూ ఉభయదేశాల మధ్య సంబంధాలు జరగాలంటే చైనా సెప్టెంబరు 8 స్థానాలకు వెళ్ళిపోవాలన్న భారతదేశం కోర్కెను కొలంబో ప్రతిపాదనలు నెరవేర్చినట్లేనని అన్నారు.

కొలంబో రాజ్యాలకు కృతజ్ఞత

శ్రీ ఇందులాల్ యాజ్ఞిక్ (ఇండి-గుజరాత్) భారత-చైనాలమధ్య సమాధానం కుదర్చడానికి కొలంబోరాజ్యాలు చేసినకృషిని మెచ్చుకొన్నారు కొలంబో ప్రతిపాదనలను విమర్శించడం ఏమాత్రం న్యాయం కాదన్నారు. కొలంబోరాజ్యాలు అందిచ్చిన స్నేహ హస్తాన్ని చైనా స్వీకరించకపోతే సంభాషణలకుఅవకాశం యివ్వని తప్పు దానిదే కాగలదన్నారు.

శ్రీ బ్రజేశ్వర ప్రసాద్ (కాంగ్రెసు-బీహార్) ప్రసంగిస్తూ కాశ్మీరులోని కొంత భాగాన్ని వదులుకొనే ప్రాతిపదికపై చైనాతో గాని, మరియేయితరరాజ్యంతో గాని మనం ఒప్పందం చేసుకొనరాదన్నారు.

శ్రీ చెరియన్, జె కప్పన్ (కాంగ్రెసు కేరళ) కొలంబో ప్రతిపాదనలను అంగీకరించడంవలన మనం నష్టపడిపోయేది ఏమీ వుండదన్నారు

శ్రీ యస్. యమ్ బెనర్జీ (ఇండి-యం పి) మాట్లాడుతూ భారతదేశం కొలంబో ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. అంతేగాక తటస్థవిదేశాంగ విధానాన్ని భారతదేశం యికముందు కూడా కొనసాగించాలన్నారు.

శ్రీ డి. సి. శర్మ (కాంగ్రెసు-పంజాబు) కొలంబో ప్రతిపాదనలను సమర్థించుతూ మాట్లాడారు. ఉభయ దేశాల మధ్య ముఖాముఖి చర్చలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలను రూపొందించేందుకు ఆరు తటస్థ రాజ్యాలు చేసిన కృషిని చాలా మెచ్చుకొన్నారు. నవంబరులో పార్లమెంటు ఆమోదించిన తీర్మానానికి, ఇప్పుడు సంభాషణలకు అంగీకరించడానికిఎలాంటి వైరుధ్యం లేదన్నారు.

శ్రీ ఆర్ కె ఖాడిల్కర్, (కాంగ్రెసు-మహారాష్ట్ర) మాట్లాడుతూ ఈ ప్రతిపాదనలను మొత్తంగా చైనా అంగీకరించ లేదంటేనే ఇవి భారతదేశానికి సుముఖంగా వున్నట్లు అర్థం అవుతున్నదన్నారు.

శ్రీ ఆర్ యస్. పాండే (కాంగ్రెసు-మధ్యప్రదేశ్) మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యులు నిర్మాణాత్మకమైన విమర్శన చేయాలే గాని, ప్రజలను గందరగోళ పరిచే విధంగా వ్యవహరించరాదన్నారు.

శ్రీ భగత్ ఝా ఆజాద్ (కాంగ్రెసు-బీహార్) మాట్లాడుతూ చైనాతో సంప్రతింపులకు ప్రాతిపదికగా కొలంబో ప్రతిపాదనలను అంగీకరించడమంటే భారత దేశం ఫలవంతమైన వ్యూహాన్ని చేబట్టడమే కాగలదని అన్నారు.

శ్రీ కృష్ణ పట్నాయక్ (సోషలిస్టు-ఒరిస్సా) కొలంబో ప్రతిపాదనలు భారత దేశ గౌరవానికి, సర్వ స్వాతంత్ర్యానికి, దేశప్రాదేశిక సమగ్రతకు అనుగుణ్యంగా లేవన్నారు.

చర్చ రేపు కూడా కొనసాగుతుంది.

రాజ్యసభలో చర్చ

న్యూఢిల్లీ, జనవరి 23

కొలంబో మహాసభ ప్రతిపాదనలు, వాటిపై వివరణలు భారత ప్రభుత్వ వైఖరికి పూర్తిగా అనుగుణంగా ఉన్నాయని కేంద్ర న్యాయశాఖామంత్రి శ్రీ ఎ కె సేన్ నేడు రాజ్యసభలో ప్రకటించారు

కొలంబో మహాసభ ప్రతిపాదనలపై రాజ్యసభలో రెండురోజుల చర్చను ప్రారంభిస్తూ శ్రీ సేన్, కొలంబో ప్రతిపాదనలు, వాటిపై వివరణలు భారతదేశ వైఖరికి విజయ సూచకమని, దురాక్రమణకు పూర్వం తామున్న స్థావరాలకు చైనా సైన్యాలు వైదొలగాలన్న సూత్రానికి ఈ ప్రతిపాదనలు ఊతమిస్తాయని పేర్కొన్నారు.

దేశ సమైక్యతను పరిరక్షించడానికి, ఇకముందుకూడా దురాక్రమణను ఎదుర్కొనడానికి ప్రభుత్వం సర్వదా సంసిద్ధమై ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. కొలంబో ప్రతిపాదనలవంటి ప్రధాన సమస్యలపై సభవారు సమైక్య వైఖరిని ప్రదర్శించటం అవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేటి చర్చలో కమ్యూనిస్టు సభ్యులు మినహా మిగతా ప్రతిపక్షాల సభ్యులు కొలంబో సభ ప్రతిపాదనలను పూర్తిగా వ్యతిరేకిస్తూ ప్రసంగించారు. అయితే వ్యతిరేక ప్రతిపాదన మాత్రం ఏమీ తీసుకురాలేదు.

కొలంబో ప్రతిపాదనలను అంగీకరించినందువల్ల చైనాకు భారతదేశంలో స్థానం కల్పించడమేననీ, '62 సెప్టెంబర్ 8 పూర్వం చైనా చేసిన దురాక్రమణను మరచిపోవటమే కాగలదని వారు వాదించారు.

అందుకు శ్రీ సేన్ జవాబు చెబుతూ ఈ ప్రతిపాదనలను అంగీకరించడమంటే వివాదాన్ని పూర్తిగా పరిష్కారం చేసుకొన్నట్టు కాదనీ, సరిహద్దువివాదాన్ని పూర్తిగా పరిష్కారం చేసే లోపుగా తాత్కాలిక ఏర్పాట్లు జరుపుకొనేందుకుగాను చర్చలకు మాత్రమే అంగీకరిస్తున్నామనీ చెప్పారు.

పి. యస్ పి. నాయకుడు శ్రీ గంగాశరణ్ సిన్హా మాట్లాడుతూ, పార్లమెంటు చర్చించకముందే శ్రీ నెహ్రూ ఈ ప్రతిపాదనలకు సూత్రప్రాయంగా ఆమోదం తెల్పినందుకు అభ్యంతరం చెప్పారు. చైనా దురాక్రమణను ఖండించనందుకు ఆయన కొలంబో సభ రాజ్యాలను విమర్శించారు.

కాంగ్రెస్ సభ్యులు డా॥ బి. రామకృష్ణారావు, శ్రీ జె ఎస్. పరక్ ప్రతిపాదనలను బలపరుస్తూ, వీటికి ఆమోదం తెల్పినందువల్ల దేశ గౌరవానికి భంగం కలిగినట్టు కాదని పేర్కొన్నారు.

కమ్యూనిస్టుసభ్యుడు శ్రీ యం. యస్. గోవిందన్ నాయర్ మాట్లాడుతూ, చైనాతో సంప్రతింపులు జరపడానికి ఈ ప్రతిపాదనలలో హేతుబద్ధమైన ప్రాతిపదిక కలదని చెప్పారు. అయితే అంతమాత్రాన భారతదేశం తన సైనిక శక్తిని బలపరచుకొనే కృషిని సడలించవలసిన పనిలేదని ఆయన అన్నారు

స్వతంత్రపార్టీ సభ్యుడు శ్రీదయాభాయి పటేల్ మాట్లాడుతూ ఈ ప్రతిపాదనలు చైనాకే అనుకూలంగా ఉన్నాయన్నారు.

శ్రీ ఎ డి. మణి (ఇండి) ప్రసంగిస్తూ కొలంబో సభ రాజ్యాల ఉద్దేశాలను శంకించవలసిన పనిలేదనీ, అయితే ఇండియా ప్రతిపాదనలను అంగీకరించడమంటే 'రెండవ మ్యూనిక్'కు మార్గం యేర్పరచినట్లేనని చెప్పారు.

కొలంబో ప్రతిపాదనలపై చైనా ప్రభుత్వ వైఖరి

మొత్తం ఆమోదిస్తేనే చర్చలు సాధ్యమని నెహ్రూ ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 23

కొలంబో ప్రతిపాదనలను, వాటికి సింహళం, బర్మా, ఐక్య అరబ్బు రిపబ్లిక్ లు యిచ్చిన వివరణలను మొత్తంగా చైనా ఆమోదించలేదనీ, ఆ ప్రతిపాదనలను సూత్రప్రాయంగా మాత్రమే చైనా అంగీకరించిందనీ ప్రధాని నెహ్రూ నేడు లోక్ సభలో తెలియజేశారు.

ఈ విషయాన్ని తెలుపుతూ నేటి ఉదయం తనకు సింహళ ప్రధానినుండి టెలిగ్రామ్ వచ్చిందని శ్రీ నెహ్రూ చెప్పారు.

కొలంబో ప్రతిపాదనలను, వాటిపై యివ్వబడిన వివరణలను చైనా మొత్తంగా ఆమోదించితేనే గాని వాటిని ప్రాతిపదిక చేసుకొని భారత-చైనా అధికారుల మధ్య సంభాషణలు జరిగే అవకాశం లేదని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు.

కొలంబో ప్రతిపాదనలను, వాటిపై వచ్చిన వివరణలను సభవారు పరిశీలనలోకి తీసుకోవాలని ప్రధాని నెహ్రూ కోరుతూ, ఇవి చైనా, సెప్టెంబరు 8 నాటి స్థానాలకు ఉపసంహరించుకోవాలన్న భారతప్రభుత్వం డిమాండ్ను తృప్తిపరచినాయని శ్రీ నెహ్రూచెప్పారు.

శివసాగర్ చమురు ప్రాజెక్టు

రష్యన్ నిపుణుల సాయంతో తిరిగి పనిప్రారంభం

న్యూఢిల్లీ, జనవరి 23

చైనాతో సంఘర్షణ ఫలితంగా తాత్కాలికంగా ఆపివేయబడిన అస్సాంలోని శివసాగర్ చమురు ప్రాజెక్టుపని తిరిగి ప్రారంభించబడిందనీ, రష్యన్ సాంకేతిక నిపుణులు తిరిగి పనిలోకి వచ్చారని నేడు లోక్ సభలో గనుల, ఇంధనశాఖామంత్రి శ్రీ కె. డి. మాళవియా తెలియజేశారు.

శ్రీ మహేశ్వర్ నాయక్, తదితరులు అడిగిన ప్రశ్నకు శ్రీ మాళవియా సమాధానమిస్తూ నవంబరులో సైనిక పరిస్థితిదృష్ట్యా శివసాగర్ లో పనిచేస్తున్న రష్యన్ నిపుణులను గుజరాత్ లోని కొన్ని ప్రాజెక్టులలో ఉపయోగించడానికి చమురు-సహజ వాయువు కమిషన్ పంపించిందని చెప్పారు.

సంఘర్షణ సమయంలో అస్సాంలోని ఏ చమురు పరిశ్రమకు సంబంధించిన ప్రాజెక్టు విధ్వంసం చేయబడిందన్న వార్తలో ఏ మాత్రం నిజం లేదన్నారు.

బంగారు కంట్రోలు వల్ల స్వర్ణకారులకు నిరుద్యోగం

వారికి వేరే వృత్తులు చూపాలని విజయవాడలో ఆందోళన

విజయవాడ, జనవరి 23

బంగారు కంట్రోలుచట్టంవలన నిరుద్యోగులైన స్వర్ణకారులకు తగు వృత్తులు కల్పించాలనీ, తాత్కాలిక సహాయం చేయాలని కోరుతూ, పట్టణంలోని స్వర్ణకారులు సుమారు రెండువేలమంది నిన్న సాయంత్రం పట్టణంలోని ముఖ్యవీధుల్లో ఊరేగింపు జరిపారు ఊరేగింపుగా స్థానిక సబ్ కలెక్టరు దగ్గరకు వెళ్ళి తమ యిబ్బందులను, కోర్కెలను తెలియజేస్తూ తక్షణం సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం సాయంకాలం చౌకులో శ్రీ బొన్నలగడ్డ రామలింగయ్య అధ్యక్షతన బహిరంగసభ జరిపారు

సభలో బంగారు కంట్రోలుచట్టం వలన స్వర్ణకారులు పడుచున్న యిబ్బందులను గురించి సంఘ నాయకులు శ్రీ యన్ వీరాచార్యులు, సంఘాధ్యక్షులు శ్రీ దేవు విశ్వనాథాచార్యులు, కార్యదర్శి శ్రీ కంభాన సన్నీశ్వరరావు గార్లు ప్రసంగించారు.

సభలోవచ్చిన పూలదండను వేలం వేయగా మొదట చేబ్రోలు బాపయ్య 10 రూపాయలకు పాడారు ఆ దండను రెండవసారి పాట పెట్టగా శ్రీ గుడిపాటి లక్ష్మణరావు 10 రూపాయలకుపాడారు

తర్వాత బంగారు ఆభరణాలపై, బంగారంపై ప్రభుత్వం విధించిన నియమాలలోని మూలసూత్రాన్ని గుర్తిస్తూ ఈఆర్డర్లవల్ల నిరుద్యోగులైన లక్షలాది స్వర్ణకారులు పస్తులుంటున్నారనీ, అందువలన వీరికి తగువృత్తులు కల్పించాలనీ, తాత్కాలిక సహాయం ప్రభుత్వం చేయాలని కోరుతూ సభలో తీర్మానించారు

సబ్ కలెక్టర్ వీరి విజ్ఞప్తిని సావధానంగావిని, వీరి కోర్కెలను ప్రభుత్వానికి తెలియజేస్తానని వాగ్దానం చేసినందుకు సబ్ కలెక్టరును అభినందిస్తూ కూడా తీర్మానించారు. (వి. వి.)

ముఖ్యమంత్రి నిర్వహించే శాఖల పునర్విభజన

హైదరాబాద్, జనవరి 23

ఇప్పటిదాకా ముఖ్యమంత్రి నిర్వహించిన మంత్రిత్వశాఖలను పునర్విభజన చేస్తూ నేడుప్రభుత్వం ఒక ప్రకటన చేసింది.

దీని ప్రకారం సాంఘిక సంక్షేమశాఖ శ్రీ యం. ఆర్. అప్పారావు గారికి, అడవులు, పశు సంపద, మత్స్యశాఖలు వ్యవసాయ శాఖామంత్రి శ్రీ ఎ బలరామిరెడ్డిగారికి అప్పగించబడ్డాయి.

కొలంబో ప్రతిపాదనలపై చైనా అభిప్రాయం

సింహళ ప్రధానికి అందజేత

కొలంబో, జనవరి 23

కొలంబో ప్రతిపాదనలపై చైనా పంపిన అభిప్రాయాన్ని నిన్న సాయంత్రం సింహళ ప్రధానికి చైనా రాయబార కార్యాలయపు ప్రతినిధి అందజేశారు.

దాన్ని నేటి ఉదయం ప్రధాని శ్రీ నెహ్రూకు తెలియజేశారు

ఇది నేపాల్ విదేశాంగమంత్రి డా॥ తులసీగిరి గౌరవార్థం పెకింగ్ లో జరిగిన విందు సందర్భంగా చైనా విదేశాంగ మంత్రి మార్షల్ చెన్-యీ చేసిన ప్రసంగ ధోరణిలో ఉందని తెలుస్తోంది

రిపబ్లిక్ దినోత్సవానికి కొందరుకమ్యూనిస్టుల విడుదల?

రాష్ట్ర ప్రభుత్వం యోచన

హైదరాబాద్, జనవరి 23

రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని కొందరు కమ్యూనిస్టు డిటెన్యూలను విడుదలచేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు నేడిక్కడ విశ్వసనీయంగా తెలియవచ్చింది.

పాకిస్తాన్ విదేశాంగ మంత్రి మరణం

హృద్రోగంతో ఢాకాలో

ఢాకా, జనవరి 23

పాకిస్తాన్ విదేశాంగ వ్యవహారాల మంత్రి శ్రీ మహమ్మదాలీ నేటిరాత్రి 9-30 గంటలకు మరణించారు

ఆయన వయస్సు 52 సంవత్సరాలు.

ఆయన చనిపోయినప్పుడు ఆయన ప్రక్కన ఆయన రెండో భార్యవున్నారు. ఆమె కెనడా దేశస్థురాలు

మహమ్మదాలీకి ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు వున్నారు.

మహమ్మదాలీ రెండు రోజుల క్రితమే ఢాకా వచ్చారు. గుండె జబ్బువలన ఆయన చనిపోయారు.

కొలంబో ప్రతిపాదనలు ఆమోదించక పోయినా చర్చలు జరగాలి

అట్టా ప్రకటన

హాంకాంగ్, జనవరి 23

చైనా-భారతదేశాలు తమ సరిహద్దు సమస్య పరిష్కరించుకోవటంకోసం సమావేశం కావటానికి కొలంబో ప్రతిపాదనలను పూర్తిగా అంగీకరించవలసిన అవసరం లేదని ఘనా న్యాయశాఖామంత్రి అట్టా నేటిరాత్రి ఇక్కడ అన్నారు.

అట్టా నాయకత్వాన కొలంబో ప్రతిపాదనలను చైనా-భారతదేశాలకు వివరించటానికి వెళ్ళిన ప్రతినిధివర్గం నేడు ఇక్కడకు వచ్చింది.

చైనా-భారతదేశాలు కొలంబో ప్రతిపాదనలపట్ల విభిన్న వైఖరులు కలిగి ఉన్నాయి. కాని అదే సందర్భంలో ముఖ్యమైన రెండు విషయాలలో ఏకాభిప్రాయం ఉన్నది. అది ఒకటి: యుద్ధ విరమణ రెండు 20 కిలోమీటర్ల ప్రాంతంలో నిస్సైనిక మండలం ఏర్పాటు చేయటం.

చైనా-భారతదేశాలు సంప్రతింపులకు తేదీని అవే నిర్ణయించుకోవాలి అని అన్నారు.

ఒక ప్రశ్నకు సమాధానం చెపుతూ రెండో బాండుంగు సభ జరగటానికి తాము సుముఖులమేనన్నారు.

కొలంబో మహాసభ ప్రతిపాదనలు భారత-చైనా దేశాలమధ్య ముఖాముఖి చర్చలకు ప్రాథమికమైన ప్రాతిపదికను ఏర్పాటు చేశాయని చైనా ఉప ప్రధాని చెన్-యీ అన్నారని నవచైనా వార్త సంస్థ ప్రకటించింది.

సాధ్యమయినంత త్వరలో పటుశాంతి సంభాషణలు ప్రారంభం అవుతాయని తాను ఆశిస్తున్నానని చెన్-యీ అన్నారు.

నేపాల్ విదేశాంగమంత్రి తులసీగిరి గౌరవార్థం ఏర్పాటు చేయబడ్డ ఒక సన్మాన సభలో మాట్లాడుతూ చైనా-నేపాల్ దేశాల స్నేహం నిరంతరం కొనసాగుతుంది అన్నారు.

తులసీగిరి సమాధానం చెపుతూ, చైనా-నేపాల్ సరిహద్దు వివాద పరిష్కారం బాండుంగ్ మహాసభ నిర్ణయాలకు, పంచశీల సూత్రాలకు ఒక విజయం అని అభివర్ణించారు.

దేశం నలుమూలల నేతాజీ జన్మదినోత్సవం

కలకత్తా, జనవరి 23

నేతాజీ 67వ జన్మదినోత్సవం నేడిక్కడ ఉత్సాహపూరితంగా జరుపబడింది.

ఆజాద్ హింద్ ఫౌజ్ పాటలు పాడుతూ యూనిఫారమ్ ధరించి ప్రదర్శించిన కవాతు కార్యక్రమం చాలా ఉత్సాహకరంగా ఉన్నది.

రాష్ట్రప్రభుత్వం నేడు సెలవుదినంగా ప్రకటించింది స్టాక్ ఎక్ఛేంజితోసహా అన్ని మార్కెట్లు మూసివేయబడ్డవి.

నేతాజీ భవనానికి అంతులేని ప్రజాసందోహం వచ్చివెళ్ళింది. 1941 సంవత్సరములో దేశాన్ని విడిచిపోకముందు నేతాజీ గృహ నిర్బంధంలో ఉన్న గదిని ప్రజలు చూడిపోయారు. తప్పించుకొని పోయినప్పుడు ఉపయోగించిన కారు కూడా ప్రదర్శించబడింది.

'చైనా దుస్సాహసం మూలంగా దేశ సమగ్రతకు ఏర్పడిన ప్రమాదాన్ని నివారించడానికి ఎన్ని కష్టాలకైనా ప్రజలు సిద్ధం కావాలి' అని వక్తలు పలుసభల్లో స్పష్టంచేశారు.

యూనిఫారమ్ దుస్తులు ధరించివున్న నేతాజీ చిత్రపటాన్ని పూలతో అలంకరించి నగరంలోని వివిధ ప్రాంతాలలో ఊరేగించారు.

బొంబాయిలో

వివిధ సంస్థలు ఇక్కడ నేతాజీ 67వ జన్మదినోత్సవాన్ని జరిపాయి

బొంబాయి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నేటి ఉదయం జెండా వందన కార్యక్రమం ఏర్పాటు చేసింది.

జాతీయ యువజనశాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేయబడ్డ ఒక బహిరంగ సభలో లెఫ్టినెంట్ జనరల్ యస్. పి పి థొరాట్ మాట్లాడుతూ "మన జాతి స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ స్వార్థరహిత, త్యాగపూరిత సైనికుడ"ని అభివర్ణించారు.

కటక్ లో

ప్రభాత ఫేరీ ప్రొసెషనలతో, జెండా వందనంతో ఇక్కడ నేతాజీ 67వ జన్మదినోత్సవం ప్రారంభం అయ్యింది.

నేతాజీ ఉద్బోధల ననుసరించి దేశాన్ని మిలిటరీ రీత్యా బలపర్చవలసిన అవసరంవున్నదని శ్రీ ప్రాథక్ నేడిక్కడ అన్నారు.

మొరార్జీ ప్రకటన

(1వ పేజీ తరువాయి)

నిజం కాదన్నారు. 9 క్యారట్లలో కూడ నగలు చేయటం తమ ఆఫీసర్లు చూసారన్నారు.

ఎ. కె. గోపాలన్, వి. యస్. త్రివేది మొదలయినవారు మాట్లాడుతూ, తమకు తెలిసినదానినిబట్టి నిరుద్యోగం తీవ్రమౌతున్నదన్నారు.

అంతకుముందు ఆర్థికశాఖ ఉపమంత్రి బి ఆర్. భగత్ మాట్లాడుతూ, కంట్రోలు విధించిన తర్వాత బంగారం ధర తగ్గిపోతున్నదన్నారు. బంగారం బాండ్లకు పెట్టుబడి ఎక్కువగా వస్తున్నది అప్పటికి అందిన సమాచారాన్నిబట్టి జనవరి 18వ తేదీనాటికి 109 లక్షల రూపాయల విలువగల బంగారం పెట్టుబడిగా వచ్చింది అన్నారు.

బందరులో 600 మంది స్వర్ణకారులు నిరుద్యోగానికి బలి

బందరు, జనవరి 22

బందరు పట్టణంలో 600 మంది స్వర్ణకారులు బంగారు కంట్రోలు ఉత్తర్వు వల్ల నిరుద్యోగులయ్యారు. వీరిలో చాలామందికి యే ఇతర ఆస్తిగాని, ఇతర జీవనోపాధిగాని లేక పస్తులపాలవుతున్నారు. ఈ మధ్య వరు శ్రీ చెరుకూరి కాశీనాథశాస్త్రిగారి అధ్యక్షతను సమావేశమయ్యారు.

నిరుద్యోగులైన వారందరికీ ప్రభుత్వం పనులు కల్పించాలని కోరుతూ తీర్మానించారు. తమకు ప్రభుత్వ పనులు చూపుటగాని, లేక కొంతకాలంవరకూ ఏదైనా నిరుద్యోగ భృతి అప్పులు వగైరా యిచ్చి ఆదుకొనుటకు గాని జరగాలని, స్వర్ణకారులు కోరుతున్నారు పట్టణంలో వారిసమస్య చాలా తీవ్ర ఆందోళనగా వున్నది (వి. వి.)

424 గ్రాముల బంగారం అధికార్ల స్వాధీనం

రాజమండ్రి, జనవరి 22

19వ తేదీ రాత్రి రాజమండ్రిలో స్థానిక ఎక్సైజు డివిజనల్ యల్. ఆర్. అధికార్లు శ్రీయుతులు సి. హెచ్. సత్యనారాయణ, ఆర్. సుబ్బారావు గార్లు స్థానిక బంగారు, వెండి వర్తకులు శ్రీ వంకాయల సత్యనారావు గారి షాపులో 424 గ్రాముల బంగారాన్ని స్వాధీనపరచుకున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా 14 క్యారెట్ల విలువకు మించి నగలు చేస్తూండగా పై గారాన్ని స్వాధీనపరచుకున్నారు. (వి. వి.)

కొత్తగూడెంలో కెమికల్స్ ఫ్యాక్టరీ

1963 మే లో ప్రారంభం

న్యూఢిల్లీ, జనవరి 23

1963వ సంవత్సరం మే నెలనుంచి కొత్తగూడెంలో కేంద్రీయ కెమికల్స్ ఫ్యాక్టరీ పని ప్రారంభించగలదని పరిశ్రమల మంత్రి శ్రీ నిత్యానందకనుంగో నేడు రాజ్యసభలో తెలిపారు.

టర్కీలో రాకెట్లకు బదులు పోలారిస్ రాకెట్ల ఏర్పాటు

—టర్కీ విదేశాంగమంత్రి వెల్లడి

అంకారా, జనవరి 23

టర్కీలో త్వరలో మిస్సైలీ (రాకెట్) లను పూర్తిగా తొలగించి వాటికి బదులు నౌకలపై పోలారిస్ రాకెట్లను యేర్పాటుచేయనున్నట్లు టర్కీ విదేశాంగ మంత్రి ఫెరిదం కెమాల్ ఎర్కిన్ నేడిక్కడ వెల్లడించారు.

అదనంగా టర్కీ భూభాగంలో రాకెట్లు లేకుండా పోతాయని, ఈ సమస్యపై సంప్రతింపులు ఇంకా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు

టర్కీ సైనిక శాఖలన్నీ నవీన ఆయుధాలతో సమీకృతం చేయబడతాయని, మారణాయుధాల సంఖ్య పెంచబడుతుందని ఇక్కడ విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

టర్కీ రక్షణమంత్రి ఇల్హామి సాన్సర్ నేడుజాతీయశాసనసభలోమాట్లాడుతూ, ప్రస్తుతం టర్కీలోవున్న జూపిటర్ రాకెట్లను తొలగించి,వాటిస్థానే నౌకలపై పోలారిస్ రాకెట్లను ఏర్పాటు చేసే సమస్యపై అమెరికాతో తమ దేశం జరుపుతున్న చర్చలు ప్రోత్సాహకరంగా ఉన్నాయని, ఈ సమస్యపై తుది ప్రతిపాదన జాతీయ సమితిముందు ప్రవేశపెట్టబడుతుందని తెలియజేశారు.

ప్రభుత్వ పాక్షిక విధానాలు

పెదదేవులపల్లి సభలో శ్రీ కృష్ణారావు ప్రసంగం

హైదరాబాద్, జనవరి 24

గ్రామ అత్యయిక కమిటీలలోనూ, స్వచ్ఛంద సేవాదళ నిర్మాణంలోనూ, కార్మిక రక్షణ బ్యాంకులలోనూ కమ్యూనిస్టులను మినహాయించడం గ్రామ ఐక్యతకుగాని, జాతీయ ఐక్యతకుగాని ఏ మాత్రమూ తోడ్పడదనీ, ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మానుకోవాలని గతరాత్రి పెద దేవులపల్లిలో జరిగిన బహిరంగసభలో శ్రీ కృష్ణారావుగారు కోరారు.

సభకు గ్రామపంచాయతీ అధ్యక్షులు శ్రీ వి సీతారామ్ అధ్యక్షతవహించారు సభకు ముందు 400 మంది రైతు కూలీలతో పెద్ద ఊరేగింపు జరిగింది

ప్రారంభంలో జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ వల్లా సీతారామరెడ్డి ప్రసంగిస్తూ, భారతదేశంపై చైనా జరిపిన దాడిని ఖండించారు. రక్షణ కృషిలో కమ్యూనిస్టులు పాల్గొంటున్నా, వారిని అత్యయిక కమిటీల నుంచి మినహాయించటం విచారకరం అన్నారు.

తర్వాత కమ్యూనిస్టు నాయకులు శ్రీ వై. వి. కృష్ణారావుగారు ప్రసంగించారు. వారిలా అన్నారు:

"చైనా జరిపిన దాడి మన దేశంలోనూ, ప్రపంచమంతటనూ గల ప్రజాస్వామిక వాదులకు విస్మయాన్నీ బాధనూ కలిగించింది నెహ్రూ ప్రభుత్వాన్ని గురించీ, మనదేశం అనుసరిస్తున్న శాంతి కాముక తటస్థ విదేశాంగ విధానం గురించీ, భారతదేశ అంతరంగిక పరిస్థితులను గురించీ చైనావారికున్న అవగాహన చాలా లోపభూయిష్టంగా వుంది."

తర్వాత ఆయన కమ్యూనిస్టుపార్టీ జాతీయసమితి తీర్మానాన్ని వివరించారు.

రక్షణకమిటీల నుంచీ, అత్యయిక కమిటీల నుంచీ కమ్యూనిస్టులను మినహాయించడాన్ని విమర్శిస్తూ వారిలా అన్నారు.

"జిల్లా రక్షణకమిటీలో నియమింపబడిన వారిలో ఏ ఒకరిద్దరో తప్ప రక్షణనిధి వసూళ్ళలో పాల్గొనడంలేదని తెలిసింది. అయినా ఈ సమితి ప్రాంతంలో 58 వేల రూపాయలు రక్షణ నిధికి వసూలయినాయి. వానిలో 47 వేల రూపాయలు కమ్యూనిస్టులు వసూలు చేసిందే." ఈ అనుభవాన్ని చూసి అయినా ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోవడం సరైనది.

"కాని అదల్లా చేయడంలేదు. అత్యవసరపరిస్థితులను తన పార్టీ ప్రయోజనాలకు వుపయోగించుకొంటూంది. కేంద్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితులలో కార్యక్రమాల నిర్వహణ కోసం పథకం చేసింది. దాని నుంచి కమ్యూనిస్టులను మినహాయించడం కేంద్ర ప్రభుత్వం వుద్దేశంకాదు. ఆ మాట ఆ పథకంలో లేదు. కాని రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకాన్ని అమలు జరపడానికి నియమించిన కమిటీలలో "అనర్హులయిన పంచాయతీ అధ్యక్షులను మినహాయించాలని సూచించింది. దీనిఫలితం ప్రజలుఎన్నుకొన్న కమ్యూనిస్టులను పై కమిటీలనుండి, స్వచ్ఛందసేవాదళాలనుంచీ, కార్మిక రక్షణ బ్యాంకుల నుండి మినహాయించారు నల్లగొండ జిల్లాలోని 600 పంచాయతీలలో 300 పంచాయతులు కమ్యూనిస్టుల అధ్వర్యాన నున్నాయి ప్రజా విశ్వాసం చూరగొన్న అధ్యక్షులను వదలి మిగిలినవారితో ఏర్పరచిన ఈ కమిటీలు ప్రభుత్వం ఆశించిన కార్యక్రమాన్ని నిర్వహించలేవు"

తర్వాత చైనా దాడి ఫలితంగా ఏర్పడిన అత్యవసర పరిస్థితిని అభివృద్ధి నిరోధక పార్టీలు స్వప్రయోజనాల కేవిధంగా వినియోగించుకొంటున్నారో శ్రీ కృష్ణారావుగారు వివరించారు.

తర్వాత జిల్లా కమ్యూనిస్టు నాయకులూ, శాసనసభ్యులూ అయిన శ్రీ ధర్మభిక్షం ప్రసంగిస్తూ, రక్షణనిధి వసూళ్ళలో కమ్యూనిస్టుల కృషిని వివరించారు. సామాన్య ప్రజానీకం నిధి వసూళ్ళకు చేస్తున్న త్యాగాన్నీ భూస్వాములూ, జమీందారులూ మిల్లు యజమానులు అత్యయిక పరిస్థితులను స్వప్రయోజనాల కేవిధంగా వినియోగించుకొంటున్నారో వివరించారు

శాసనసభ్యులు శ్రీ పల్లా పర్వతరెడ్డి గారు ప్రసంగిస్తూ గ్రామ అత్యయిక కమిటీలనుండి కమ్యూనిస్టు పంచాయితీ అధ్యక్షులను మినహాయించి గ్రామాలలో ఏవిధంగా ప్రభుత్వం కక్షలు తీవ్రంకా శక్తులకు తోడ్పడుతూందో వర్ణించారు.

సుబాండ్రియో భారతదేశ పర్యటన

వారంరోజులలో జరగగలదని విదేశాంగశాఖ ప్రకటన

జకార్తా, జనవరి 23

ప్రధాని నెహ్రూ ఆహ్వానంపై ఇండొనీషియా విదేశాంగ మంత్రి డాక్టర్ సుబాండ్రియో ఒక వారం రోజులలో భారతదేశంలో పర్యటించగలరని అధికారరీత్యా నేడిక్కడ వెల్లడయ్యింది.

ఇండొనీషియా విదేశాంగ వ్యవహారాల అధికారి ఒకరు మాట్లాడుతూ సుబాండ్రియో-నెహ్రూలు ఆసియాలో సమస్యలపై ఒకరి అభిప్రాయాలను మరొకరికి తెలియజేసుకోగలరని అన్నారు.

అంటారా వార్తాసంస్థ ప్రకటించిన యీ వార్తలో ఇంకా ఇలా వుంది!

కొలంబో ప్రతిపాదనలను తయారుచేయటంలో ఇండొనీషియా నిర్వహించిన ముఖ్యమైనపాత్రదృష్ట్యా నెహ్రూ, సుబాండ్రియోను ఆహ్వానించారు

సుబాండ్రియో ఈ మధ్యనే చైనా-భారత సరిహద్దు పరిష్కారం సాధించటానికి పెకింగ్ వెళ్ళివచ్చారు.

విశ్వరహస్యం:

శుక్రగ్రహంమీద జీవకోటి ఉండడానికి అవకాశముందా?

మ్యూనిచ్ (జాడ్):- "మనభూమికి ప్రక్కనే సుమారు నాలుగుకోట్లు కిలోమీటర్ల దూరంలోవున్న శుక్రగ్రహం మీద ప్రాణికోటి ఉండవచ్చును" అని డాక్టరు రుడాల్ఫ్ క్యూహెన్ అన్నారు.

ఈయన ప్రసిద్ధఖగోళ విజ్ఞాని. ఆధునిక విజ్ఞానం సాధించిన పరికరసంపత్తి సాధారంగా మానవుడు భూమిమీద కీలక స్థానం కేంద్రంగా చేసుకుని ఖగోళాన్ని అన్వేషిస్తున్నాడు ఇప్పటికి సాధించిన భారీ పరావర్తక దూరదర్శిని సహాయంతో కూడా శుక్రగ్రహంమీద ఏం ఉందో తెలుసుకోవడం అసాధ్యమైంది కవులు శుక్రగ్రహాన్ని పొద్దుపొడుపు చుక్క, వేగుచుక్క అని వర్ణించారు. అయితే దీనిచుట్టూ ఏదో మేఘావృతమై అలుముకునిఉందమాత్రం చెప్ప గలిగారు.

అయితే వర్ణమాల విశ్లేషణ పద్ధతిని ప్రయోగించి శుక్రగ్రహ వాతావరణంలో కార్బన్ యౌగిక వాయువులు మిళితమై యున్నట్లు నిర్ధారించారు. అందుచేత శుక్ర వాతావరణమంతా ఆక్సిజన్ కలసిన కార్బన్ యౌగికలచేత ఆవరింపబడియున్నది. హైడ్రోజన్, నీటి ఆక్సిజన్ శుక్ర వాతావరణంలో ఉన్నాయా అంటే నిస్సందేహంగా చెప్పడం కష్టం. సునిశిత విద్యుత్పరికరాలు ప్రయోగించి ఉష్ణోగ్రత పరిస్థితులు తెలుసుకోగలిగారు

ఈ సమాచారాన్ని బట్టి శుక్రుని బాహ్యావరణ% సెంటిగ్రేడ్ కంటె తక్కువే నని ఊహ. అయితే శుక్రుని ఉపరితలం మాత్రం మూడువందలపది సెంటిగ్రేడ్ దాటి ఉంటుందని అంచనా. ఇదివరకు స్వీడిష్ భౌతిక విజ్ఞాని, నోబెల్ బహుమాన ప్రతిగ్రహీత సర్వాంటె అర్హీనియస్ వేసిన లెక్కలు తప్పు అని ఇటీవలి ఫలితాలు రుజువుచేశాయి. అర్హీనియస్ లెక్క ప్రకారం శుక్రుని ఉష్ణోగ్రత ముప్పై డిగ్రీల సెంటిగ్రేడ్. అంటే భూమి ఉష్ణోగ్రత శుక్రుని ఉష్ణోగ్రత దాదాపు సమానమేనని అతని ఊహ.

భూమిమీద జీవకోటి ఎలా ఆరంభమైందో అలాగే శుక్రునిమీద కూడ ప్రారంభించడానికి పరిస్థితులు అనుకూలిస్తున్నాయనీ, క్షుద్రజాతి వృక్షకోటి పుష్కలంగా పెరుగుతున్నదనీ భావిస్తున్నారు. ఇటువంటి వృక్షకోటి భూమిమీద బహుస్వల్పం. చరిత్ర పూర్వయుగంలో నే భూమిమీద అరణ్యాలు భారీగా పెరిగాయి. దీనిని బట్టి భూమికంటె శుక్రగ్రహం ఇరవై ఐదు-ముప్పైఐదు కోట్ల సంవత్సరాలు వెనకబడి వుంది. భూమిలాగే శుక్రగ్రహం కూడ డెనోసియన్స్, కార్బన్ యుగాలవంటి దశలు అనుభవించాలి. ఉష్ణోగ్రత పరిస్థితులనుబట్టి జంతుకోటి ప్రారంభ సూచనలేమైనా ఉన్నవా అన్నది వివాదగ్రస్తమైన విషయం. ఏకకణజీవివర్గం ఉండవచ్చునని జీవ విజ్ఞానులుఅభిప్రాయపడుతున్నారు. ట్రైలో లైట్‌వంటి గుల్లచేపలు, శుక్రగ్రహం మీద ఉండడానికి అవకాశం ఉందనిఅంటున్నారు.

సంప్రతింపులు తగవనటం అవివేకం - హోంమంత్రి స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 28

"చైనా-భారత సరిహద్దు తగాదా పరిష్కారానికి సంప్రతింపులు తగవని అనటం అవివేకం బాధ్యతా రహితంగా ప్రభుత్వాన్ని విమర్శించటం తేలికే గట్టునుండి ఎన్ని కబురయినా చెప్పవచ్చు దిగితేగాని లోతుపాతులు తెలియవ"ని హోం మంత్రి లాల్‌బహదూర్‌శాస్త్రి నేడిక్కడ అన్నారు

దురాక్రమణద్వారా లభ్యమైన ఫలితాన్ని చైనా అనుభవించనున్నంత కాలం భారత ప్రభుత్వం చైనాతో సంప్రదింపులు ప్రారంభించదని హోం మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి నేటి రాత్రి ఇక్కడ అన్నారు.

హోం మంత్రి చారిత్రాత్మక ఎర్రకోటలో కవిసమ్మేళనాన్ని ప్రారంభిస్తూ పై విషయాన్ని స్పష్టం చేశారు

25 మంది ప్రసిద్ధ కవులు దేశం నలుమూలలనుండి ఈ సమ్మేళనకు అరుదెంచారు

'రెండు పెద్దదేశాలమధ్య ఘర్షణ జరుగుతుండగా ప్రజలు అటు వేపు చూడటంలో ఆశ్చర్యంలేదు'అని హోంమంత్రి అన్నారు ఆయన ఇంకా ఇలాఅన్నారు.

"తగాదా పరిష్కారానికి సంప్రదింపులకు దిగరాదనటం అవివేకం. అయితే ఆ సందర్భంలో భారతదేశం చైనా దురాక్రమణకు తలవొగ్గటం జరగదు బలప్రయోగంద్వారా చైనా ఆక్రమించిన కొన్ని భూభాగాలను ఖాళీచేస్తే సంప్రదింపులకు సిద్ధమే!

"కొలంబో ప్రతిపాదనలు ప్రభుత్వం ఆమోదించినందుకు కొంతమంది విమర్శించుచున్నారు. అలా బాధ్యతా రహితంగా విమర్శించటం చాలా సులువేకాని ప్రభుత్వం తటస్థదేశాల సానుభూతిని పోగొట్టుకోలేదు. గట్టునవుండి ఎన్ని కబుర్లయినా చెప్పవచ్చు దిగితేగాని లోతుపాతులు అవగతం కావు.

"కొలంబో ప్రతిపాదనలయెడ చైనా కొంచెం అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్నది దేశ గౌరవాన్ని, సమగ్రతని కాపాడేటందుకు రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో ప్రజలంతా దీక్షాకంకణాలు కట్టాలి!"

కేంద్ర ఉద్యోగుల ఉద్యోగకాలం పొడిగింపు

చాల రాష్ట్రాల సుముఖత

న్యూఢిల్లీ, జనవరి 28

కేంద్ర ప్రభుత్వోద్యోగులు, అఖిల భారత సర్వీసులలోగల ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయఃపరిమితిని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది ఆ నిర్ణయాన్ని ఎక్కువ రాష్ట్రాలు బలపరిచాయని దేశవ్యవహారాలమంత్రి శ్రీలాల్ బహదూర్ శాస్త్రి నేడు లోక్‌సభలో చెప్పారు.

వయః పరిమితిని పెంచడం వలన, సిబ్బంది కొరతా, సాధారణ పరిపాలనా శాఖల్లో శిక్షణపొందిన సిబ్బంది కొరతా కొంతవరకు పూడుతుందని శ్రీ శాస్త్రి లోక్ సభలో వచ్చిన ప్రశ్నలకు జవాబు చెప్పారు

వయః పరిమితి 58 సంవత్సరాలకు పెంచబడింది కాని ఆ నిబంధన దానంతట అదే అమల్లోకి రాదు ఆ ప్రత్యేక ఉద్యోగి సామర్థ్యమూ, నిజాయితీ వగైరా లక్షణాలను పరిశీలించి, ఆ నిబంధన వర్తింపచేయబడుతుందని మంత్రి చెప్పారు

ఈ ప్రతిపాదనను ఒక రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకించిందని, వయఃపరిమితిని పెంచేబదులు, తిరిగి ఉద్యోగం ఇవ్వాలని సూచించిందని శ్రీ శాస్త్రి చెప్పారు. ఇటీవలనే తాను ముఖ్యమంత్రులతో మాట్లాడాననీ, ఈ విషయాన్ని పరిశీలిస్తామని వారంతా చెప్పారనీ ఆయన అన్నారు.

కోరింత దగ్గు అనే
కక్కాయ దగ్గుకు

స్టాకువారి కొంగ మార్కు మందు ప్రాణదానమిచ్చును పిల్లలకు వంటి విందు కోరింత దగ్గుకు నిరపాయకరమైన మందు 8 అమావాస్యలు పోవలయునని యేమారవసు 4 రోజులలో తప్పక గుణమిచ్చును అంధ్రలో అన్ని మందులషాపులలో దొరకును

జి. ఎస్ సియర్స్ & కో.,
మద్రాసు - 1.

డిటెన్యూలను విడుదల చేయాలి

శ్రీ పి. శ్రీ రామమూర్తిగారి ప్రకటన

విజయవాడ, జనవరి 23

భారత - చైనా యుద్ధ సందర్భంగా అరెస్టు చేయబడిన కొందరు డిటెన్యూలను విడుదల చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వ చర్యను హర్షిస్తూ మిగిలిన వారినికూడా త్వరలో విడుదల చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తూ శాసనమండలిలో ఇండిపెండెంటు సభ్యుడు శ్రీ పి రామమూర్తిగారు నేడొక ప్రకటన చేశారు.

వారి ప్రకటనలో ఇంకా యిలా వుంది

"స్వాతంత్ర్య సముపార్జనకు, విశాలాంధ్ర స్థాపనకు, అపార త్యాగాలు చేసి, ఆంధ్ర ప్రజల సేవకు తమ జీవితాల సంకితం చేసినవారు యీ డిటెన్యూలు ప్రజా విశ్వాసాన్ని చూరగొన్న వీరు ప్రజలమధ్య ఉండి దేశ రక్షణకు అవిరళ కృషి చేయనుండగా ప్రభుత్వం వీరిని జైలులో వుంచడం న్యాయం కాదు వీరిలో కొందరిని ప్రభుత్వం విడుదల చేసినందుకు హర్షాన్ని ప్రకటిస్తున్నాను

"రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రప్రజల పక్షాన తీసుకొన్న దీక్ష మూడున్నర కోట్ల నిధి సేకరణ, ఇతర రక్షణ కార్యక్రమాల జయప్రదం కావాలంటే ప్రజానీకమంతా ఏకోన్ముఖంగా కృషి చేయాల్సి ఉంది అందువల మిగిలిన డిటెన్యూలను కూడా వెంటనే విడుదల చేయాలని కోరుచున్నాను

"ఆంధ్ర కమ్యూనిస్టుపార్టీ తరపున వెళ్ళిన రాయబార వర్గాలకు డిటెన్యూలను విడుదలచేసే విషయాన్ని, డిటెన్యూ కుటుంబాలకు అలవెన్సు యిచ్చే విషయాన్ని సానుభూతితో పరిశీలించుచున్నామని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రిని అభినందిస్తున్నాను మంత్రి మండలి సత్వర నిర్ణయాన్ని తీసుకొని డిటెన్యూ లందరిని వెంటనే విడుదల చేస్తారని ఆశిస్తున్నాను."

నేఫా పరిపాలనా విధానంలో మామూలుస్థితి

పాఠశాలల పునః ప్రారంభం

న్యూఢిల్లీ, జనవరి 21

ఈశాన్య సరిహద్దు ప్రాంతాన్ని చైనా వారు వదిలి వెళ్ళిన తరువాత, చైనా ఆక్రమణకు పూర్వంవున్న పరిపాలనా విధానమే తిరిగి ప్రారంభించబడిందని అధికార వర్గాలవారు ఇక్కడన్నారు.

సుబన్‌సిరి, సియాంగ్ సరిహద్దు డివిజనులలో పౌరపరిపాలన తిరిగి నెలకొన్నది లోహిత్ సరిహద్దు డివిజన్‌లో ఉత్తరాన వున్న వాలాంగ్, కామెంగ్ సరిహద్దు డివిజన్‌లోని సీలాలోను పరిపాలన నెలకొల్పబడింది

సుబన్సిరి, సియాంగ్, లోహిత్ సరిహద్దు డివిజన్‌లలో ఇళ్లు వదిలి వచ్చిన వారంతా తిరిగి తమ ఇండ్లకు చేరుకున్నారు కామెంగ్ డివిజనులో పౌరపరిపాలన ఏర్పడిన ప్రాంతాలకు ప్రజలు తిరిగి వస్తున్నారు.

పౌర పరిపాలన ఏర్పడిన చోట్ల మామూలు శాంతి - భద్రతలు సక్రమంగా వున్నాయి

అయినా పరిస్థితులను అధికారులు జాగ్రత్తగా గమనించుచున్నారు శత్రువు ఎక్కడైనా స్థానిక ప్రజలలో ఎవరినైనా వున్నారేమో చూస్తున్నారు. అటువంటి వారు స్థానికులలో అసంతృప్తి రేకెత్తించడానికి ప్రయత్నించవచ్చు

నేఫాలో మూసివేయబడ్డ పాఠశాలలన్నిటిని తిరిగి నడుపుతున్నారు విద్యార్థులు చాలమంది తిరిగి తమ తలిదండ్రులతోపాటు వచ్చారు

దీర్ఘ కాలం సెలవును మంజూరుచేసిన అధ్యాపకులనందరినీ తిరిగి పనిలో చేరమని ప్రభుత్వం కోరింది.

సోషలిస్టు పార్టీ జాతీయ సమితి న్యూఢిల్లీలో జనవరి 26 న కాక జనవరి 31 న సమావేశమౌతుంది.

రవాణామంత్రితో హైవేస్ యూనియన్ ప్రతినిధుల చర్చ

జీతాలపునర్నిర్ణయాన్ని దశలవారీ చేస్తామనిహామీ

హైదరాబాద్, జనవరి 25

ఆంధ్రప్రదేశ్ హైవేస్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధి వర్గ మొకటి నేటి సాయంత్రం రవాణాశాఖా మంత్రిని కలుసుకొని హైవేస్ ఎంప్లాయీస్ యూనియన్ తరపున కార్మికుల కోర్కెలను తెలియ చేస్తూ సమర్పించిన మెమోరాండాన్ని గురించి చర్చించారు ప్రతినిధి వర్గంలో శ్రీ వి విశ్వేశ్వరరావు (యం యల్ ఏ), శ్రీ వి హనుమంతరావు, శ్రీ కె గోపాలకృష్ణయ్యగారలు వున్నారు

ఏసు తమ మెమోరాండాన్ని ఈ నెల 11 వ తేదీన మంత్రికి సమర్పించారు.

హైవేస్ పనివారల కష్టాలను గురించి త్వరలోనే అవసరమయిన చర్యలు తీసుకుంటామని పి డబ్ల్యు డి ఉప కార్యదర్శి శ్రీ కపూర్ యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు.

1 జీతాల పునర్నిర్ణయం: హైవేస్ పనివారికి సంబంధించినంతవరకు ఎటువంటి కనీసవేతనాలసంఘాలను నియమించలేదు అందువలన వారి జీతాలు చాల తక్కువగా వున్నాయి ఈ విషయాన్ని దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. ఇతర డిపార్టుమెంటులలోని వారితోపాటు హైవేస్ లో జీతాలు వుండేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు

2. కార్మికుల తొలగింపు: ఐదారు సంవత్సరాలపాటు పని చేసిన వారిని పనిలోనే వుంచుకుంటామని ఆయన తెలియచేశారు దీనికి సంబంధించిన ఆదేశాలు అప్పుడే ఛీఫ్ ఇంజనీరుకు పంపించారు.

3 జిల్లాపరిషత్తు ఉద్యోగాలు: హైవేస్ డిపార్టుమెంటులోనివారిని జిల్లా పరిషత్తులలో తీసుకుంటామని ఆయన చెప్పారు. దీని విషయంలో స్థానిక పరిపాలనశాఖతో సంప్రతింపులు జరుగుతున్నాయి

4 యూనియన్ గుర్తింపు: ప్రభుత్వ డిపార్టుమెంటులలోని యూనియన్లను గుర్తించే సమస్యను గురించి ప్రభుత్వం నిర్ణయించేవరకు తాత్కాలికంగా యూనియన్‌ను గుర్తించుతామని ఆయన తెలియజేశారు. (వి. వి)

నైవేలీలో రెండవ విద్యుత్ యంత్రంచే పని ప్రారంభం

నైవేలీ జనవరి 28

నైవేలీ విద్యుచ్ఛక్తి కేంద్రంలో రెండవ 50-మెగావాట్ విద్యుదుత్పత్తి యంత్రం నేటినుండి పనిచేయడం ప్రారంభించింది ఈ యూనిట్ వలన ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుచ్ఛక్తి సుమారు రోజుకు 10 లక్షల యూనిట్లు.

ఈ విద్యుచ్ఛక్తి మద్రాసు గ్రిడ్ కు లభ్యమవుతుంది దీనివలన అత్యవసర పరిస్థితిలో రక్షణావసరాలను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలకు చాలా విద్యుచ్ఛక్తి సరఫరా అవుతుంది.

ఈ యూనిట్ జయప్రదంగా పని చేయడానికి సోవియట్ ఇంజనీర్లూ, భారత ఇంజనీర్లూ, మూడు అంచెల ప్రాతిపదికపై ఎంతో కష్టపడవలసి వచ్చింది అనుకున్న దానికన్నా ముందుగనే ఈ యూనిట్ పని ప్రారంభమైంది మొదటి యంత్రానికి రాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆగస్టు 15న లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు.

ఈ నెల 20వ తారీఖు వరకు నైవేలీ విద్యుత్కేంద్రం 16 కోట్ల 70 లక్షల యూనిట్లు (కిలోవాట్లు) విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసింది విద్యుత్కేంద్రానికి కావలసిన 6 కోట్ల 20 లక్షల యూనిట్లు పోగా, తక్కిన 10 కోట్ల 50 లక్షల యూనిట్లు మద్రాసు గ్రిడ్‌లోకి పంపబడ్డది

మొదటి యంత్రం పనినిబట్టి, ఎర్ర బొగ్గు బాయిలర్ ఇంధనంగా జయప్రదంగా ఉపయోగించవచ్చునని రుజువైంది రెండవ యంత్రానికికూడా ఎర్ర బొగ్గునే ఇంధనంగా ఉపయోగిస్తున్నారు.

నైవేలీ విద్యుత్కేంద్రం 250 మెగావాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి శక్తికలది. అందులో ఒక్కొక్కటి 50 మెగావాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసే శక్తిగల 5 యంత్రాలుంటాయి భారతదేశంలో ఎర్రబొగ్గును ఇంధనంగా ఉపయోగించే మొదటి విద్యుత్కేంద్రం ఇది

ఈ విద్యుత్కేంద్రానికి పరికరాలను సోవియట్ యూనియన్ పంపింది. సోవియట్ యూనియన్ ఇచ్చిన రుణంతో ఇది నిర్మింపబడింది

విలీనీకరణ సంప్రతింపుల్లో లోహియా పాల్గొనరట

రాయ్‌పూర్, జనవరి 23

అంత లాభదాయకంగా వుండనందువలన, పి యస్ పి, సోషలిస్టుపార్టీల విలీనం గురించి జరిగే సంభాషణల్లో శ్రీ మనోహర లోహియా పాల్గొనడం లేదని, ఉత్తరప్రదేశ్ సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు శ్రీ బాబుదేవసింగ్ నేడిక్కడ చెప్పారు. అయితే రెండు పార్టీలు విలీనమైన తర్వాత కొత్తపార్టీకి శ్రీ లోహియా మార్గదర్శిగా వుంటారన్నారు.

నాజర్ కు టిటో సందేశం

బెల్ గ్రేడ్, జనవరి 28

సోవియట్ ప్రధాని క్రుశ్చేవ్ తో జర్మనీ, బెర్లిన్, యుగోస్లేవియా-చైనా సంబంధాల, తదితర సమస్యలమీద సాగించిన చర్చలలో కూడిన ఒక సందేశాన్ని టిటో నాజర్ కు పంపారని అధికార పూర్వకంగా నేడిక్కడ తెలిసింది

ప్రధాని నెహ్రూతో సహా తటస్థ దేశాల నాయకులకు కూడా ఇదేవిధంగా సందేశాలు పంపినట్లు తెలుస్తోంది

ఎలిజబెత్ విల్లీకి ఇలియో రాక

ఎలిజబెత్[illegible] 28

ఎలిజబెత్ విల్లీలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి పదవిని స్వీకరించడానికి, మాజీ కాంగో ప్రధాని జోసెఫ్ ఇలియో నేడిక్కడకు వచ్చారు.

ఆయన వచ్చినప్పుడు కాటంగా మంత్రులెవరూ రాలేదు. ఐ రా స సివిల్ ఉద్యోగులూ, విదేశ కాన్సలేట్ ఉద్యోగులూ ఇలియోను అభినందించారు

కొత్త విశ్వవిద్యాలయాలు ప్రస్తుతం నెలకొల్పరాదు

ప్లానింగు కమిషను నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 28

అత్యవసర పరిస్థితి కాలంలో కొత్త విశ్వవిద్యాలయాలను నెలకొల్పరాదని ప్లానింగు కమిషను రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిపిందని నేడు లోక్ సభకు తెలియ చేయబడింది.

చైనా నాయకుల ధోరణి

టిటో విమర్శ

బెల్‌గ్రేడ్ జనవరి 28

లక్షలాది ప్రజలు చంపబడినప్పటికీ చైనా నాయకులు లక్ష్యపెట్టరని, చైనా నాయకులు చాల ప్రమాదకరమైన విధానాన్ని అవలంబిస్తున్నారని యుగోస్లేవియా మహాసభలో మాట్లాడుతూ అధ్యక్షుడు టిటో అన్నారు

ఆ విధానాన్ని చైనా నాయకులు విడనాడగలరనే ఆశను టిటో వ్యక్తం చేశారు.

చైనా నాయకుల అవగాహన ఒక తాత్కాలిక పొరపాటువలన వచ్చింది కాదని మార్క్సిజం - లెనినిజంమూల సూత్రాలను చైనా నాయకులు పూర్తిగా విస్మరించారనికూడ ఆయన అన్నారు.

అమెరికా, యూరప్, కమ్యూనిస్టు దేశాలలోని కార్మికులు, రైతులుకూడ ప్రపంచ యుద్ధంలో సర్వనాశనం అవటం చైనా నాయకులకు ఏ మాత్రం బాధ గా లేదని టిటో అన్నారు

అద్వితీయశాంతిశక్తులు రోజు రోజుకు బలపడుతున్నాయి సోవియట్ యూనియన్ తదితర కమ్యూనిస్టు దేశాలు, తటస్థ దేశాలు, వెనుకబడినదేశాలలోని అభివృద్ధి కాముక శక్తులు శాంతియుత సహజీవనానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి విశాల ప్రాతిపదికైన అంతర్జాతీయ సమస్యలను సంభాషణలద్వారా పరిష్కరించుకోవాలని ఈ శక్తులు కోరుతున్నాయి

ప్రభుత్వ శాఖలలో పొదుపు

న్యూఢిల్లీ, జనవరి 28

అత్యవసర పరిస్థితి దృష్ట్యా పరిపాలన వ్యవహారాలలో పొదుపు చేయడానికి ప్రభుత్వం తీవ్రకృషి చేస్తున్నదని, దాని ప్రభావం వచ్చే బడ్జెట్టు అంచనాలలో తెలియగలదని ఆర్థికశాఖ డిప్యూటీ మంత్రిణి శ్రీమతి తారకేశ్వరసిన్హా నేడు పార్లమెంటులో ప్రకటించారు.

లోక్ సభలో వచ్చిన ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ, పొదుపు చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తీసుకోవడానికి ఉన్నతస్థాయిలో ఒక కమిటీ ఏర్పాటు చేయబడిందని ఆమె వివరించారు. ఆ కమిటీ ఈ మధ్యనే ఏర్పాటు చేయబడిందని సిబ్బంది పరిమితి అందుకు సంబంధించిన యితర విషయాలపై పరిశీలన జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగలదని అన్నారు.

పొదుపు చేయడానికి తీసుకొనే చర్యలలో కాగితం వాడకం ఒకటి అని అన్నారు.

ఈ సంవత్సరం 1.16 కోట్ల రూపాయలు పొదుపు జరగగలదన్నారు. 1963-64 సంవత్సరంలో 1.06 కోట్లు పొదుపు సాధ్యం కాగలదన్నారు.

ప్రభుత్వరంగంలో మత్స్య పరిశ్రమ నిర్వహణకొక కార్పొరేషన్ ఏర్పరచే ఉద్దేశం ప్రభుత్వానికున్నట్లు ఆహార డిప్యూటీమంత్రి థామస్ లోక్ సభలో చెప్పారు.

దక్షిణ భారత్ లో 4 వ నూనెశుద్ధి కర్మాగారం

ఇంకా స్థల నిర్ణయం జరుగలేదని లోక్‌సభలో శ్రీ మాళవీయా ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 28

నాలవ నూనె శుద్ధి కర్మాగారాన్ని "దక్షిణ భారత ప్రాంతంలో" అనువైన ప్రదేశంలో నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని గనుల, ఇంధనాల మంత్రి శ్రీ కె డి మాళవీయా నేడు లోక్ సభలో చెప్పారు

ఆ కర్మాగారం నెలకొల్పే ప్రదేశాన్ని ఇంకా నిర్ణయించవలసి వుంది

శ్రీ ఎ. కె గోపాలన్ తదితరుల ప్రశ్నలకు శ్రీ మాళవీయా సమాధానం చెబుతూ ఒకటి, రెండు ప్రవీణుల సంఘాలు దక్షిణ భారత ప్రాంతాన్ని పరిశీలించాయనీ, అవి తమ నివేదికలను సమర్పించాయన్నారు. నూనెశుద్ధి కర్మాగారానికి దక్షిణ భారత్‌లో కొన్ని ప్రదేశాలు అవి సూచించాయి. ఆ సూచనల్లో కొచ్చిన్ ప్రాంతం ఒకటి ప్రవీణులు సిఫారసుచేసిన ప్రదేశాల్లో మంగుళూరు, మద్రాసు, ట్యూటికోరిన్ వున్నాయన్నారు.

కొచ్చిన్‌ను ఎన్నిక చేయాలని కేరళ ప్రభుత్వం గట్టిగా కోరుతూందని శ్రీ మాళవీయా చెప్పారు.

ఎంత తొందరలో ప్రదేశ నిర్ణయం తీసుకొంటారని శ్రీ శివనంజప్ప అడిగారు. "రాబోయే రెండు మూడు వారాల్లో"నిర్ణయం జరుగుతుందనిమంత్రి తెలియచేశారు.

శ్రీ మాళవీయా సమాధానం చెబుతూ, కేరళతో సహా కొన్ని రాష్ట్రాలనుండి నూనె త్రవ్వకం విషయంలో దఫా దఫాలుగా సూచనలు వచ్చాయన్నారు. నూనెపరిశోధనకు అనువైనచోట్ల క్రమేణా పరిశోధన ప్రారంభమవుతుందని అన్నారు

అహమ్మదాబాద్ వద్ద కలోల్ ప్రాంతంలో ఇంకా పరీక్షించని రాతిపొరలను పరీక్షించే కార్యక్రమం త్వరితంచేసి, 1968 జూలైకి ఉత్పత్తి లభించేట్లు చూడాలని నూనె కమిషను నిర్ణయించింది.

అంకాలేశ్వర్‌లో నూనె ఉత్పత్తి పెంపుదలకు నిర్ణయాలు

న్యూఢిల్లీ, జనవరి 28

అంకాలేశ్వర్‌లో ప్రస్తుతం రోజుకి 15 వందల టన్నుల నూనె ఉత్పత్తి అవుతోందని, 1963 మార్చి నాటికి 4 వేల టన్నుల పైచిలుకు ఉత్పత్తిఅయ్యే అవకాశం కలదని గనుల, ఇంధనాల మంత్రి శ్రీ కె డి మాళవియా నేడు లోక్ సభలో చెప్పారు.

నూనె, సహజవాయువు కమిషను, నూనెపరిశోధనా కార్యక్రమ వివరాలను ఆయన సభలో చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో త్రవ్వకం కార్యక్రమాలను ఉధృతంచేయాలని గత నెలలో ఈ కమిషను నిర్ణయించిందన్నారు

మద్రాసురాష్ట్రంలో పట్టుకోట్టాయి ప్రాంతంలో త్రవ్వకం పని ప్రారంభమవుతుందనీ, బీహారు రాష్ట్రంలో పూర్ణియా, రాక్సాల్ ప్రాంతాల్లో 7 వందలఅడుగుల లోతుకుపైగా త్రవ్వకం ప్రారంభమవుతుందనీ ఆయన చెప్పారు

అహమ్మదాబాద్ ప్రాంతంలో త్రవ్వకం కార్యక్రమాలను త్వరితం చేయడానికి కొన్ని చర్యలు తీసుకోబడతాయని అన్నారు.

కాంబే సింధుశాఖలో నూనెకై అన్వేషణ కార్యక్రమం 4, 5 రోజులక్రితం ప్రారంభమైందని శ్రీ నరేంద్రసింగ్‌కు శ్రీ మాళవియా సమాధానం చెప్పారు

శ్రీ ఎ కె గోపాలన్ ప్రశ్నకు

పశ్చిమ ఇరియన్ సమస్య

ఇప్పట్లో మార్పులేదని యూథాంట్

ఐ. రా. స, జనవరి 28

ఇండోనేషియా పరిపాలనక్రిందకు పశ్చిమ ఇరియన్‌ను మార్చే తేదీని చెప్పటకు ఐరాస ప్రధాన కార్యదర్శి యూథాంట్ నిరాకరించినట్టు నేడిక్కడ విశ్వసనీయవర్గాలద్వారా తెలిసింది.

యూథాంట్ ఆధ్వర్యంక్రింద ఇండోనేషియా నెదర్లాండ్సుకు మధ్య జరిగిన ఒప్పందానికే ఆయన కట్టుబడివుంటాడని ఈ వర్గాలవారు తెలియజేశారు ఈ ఒప్పందం ప్రకారం 1963 మే 1 దాకా ఐ రా స అధీనంక్రింద ఈ భూభాగం ఉంటుంది.

బంగారం బాండ్ల అమ్మకం పెరుగుదల

బొంబాయి, జనవరి 23

నేడు 10 లక్షల రూపాయలు విలువగల బంగారం బాండ్లు రిజర్వుబ్యాంకు నుంచి విడుదల అయ్యాయి. జనవరి 9 వ తేదీ తదనంతరం బంగారు కంట్రోలు నిబంధనలు వచిన తరువాత వచ్చిన ఏ ఒక్కరోజు మొత్తానికంటే ఇది 20 రెట్లు ఎక్కువ వున్నది

గత వారం రోజులనుండి బంగారం బాండ్లపట్ల ప్రజల ఉత్సాహం పెరుగుతున్నట్లు కనబడుతున్నది అంతకుముందు రోజుకు 8 లక్షలు పెట్టుబడి పెట్టగా గత వారం, రోజుకు సరాసరి 6 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు.

తన కుటుంబ సభ్యులయిన ఇద్దరు స్త్రీలతో సహావచ్చి, ఒక వ్యక్తి 100 బంగారు నాణెములు పెట్టుబడిగా పెట్టారు.

జనవరి 18 వ తేదీ వరకు బంగారం బాండ్లమీద వచ్చిన పెట్టుబడి 20 37 లక్షల గ్రాములని నేడు రాజ్యసభలో ప్రకటింపబడింది. ఆ పెట్టుబడి విలువ 103 లక్షల రూపాయలు ఉంటుంది. జనవరి 18 వ తేదీ తర్వాత ఒక్కబొంబాయిలోనే 130 లక్షల రూపాయలు పైగా పెట్టుబడి వచ్చింది,

నేఫాలో రోడ్ల కంట్రాక్టర్లపై దర్యాప్తు

న్యూఢిల్లీ, జనవరి 28

నేఫాలో, రోడ్ల నిర్మాణానికి కంట్రాక్టు తీసుకున్న టక్కర్ కంపెనీ పై వచ్చిన ఆరోపణల ప్రసక్తి తిరిగి నేడు లోక్ సభలో వచ్చింది లోపాలకు కారకులైన ఆ కంపెనీ ఉద్యోగులపై భారత రక్షణ చట్టం క్రింద గట్టిచర్య తీసుకోవాలని శ్రీ హేంబారువా కోరారు.

ఈ కంపెనీపై ప్రధానంగా నాలుగు ఆరోపణలు వచ్చాయనీ, వాటిపై దర్యాప్తు జరుగుతుందనీ, శ్రీ శాస్త్రి హామీ యిచ్చారు

చైనాచే బ్రిటన్ విమానాల కొనుగోలు

సరఫరా వాయిదాపడినట్లు రూఢి వార్త

లండన్, జనవరి 28

పీపుల్స్ చైనా త్వరలోనే ఆరు "బ్రిటానియా" రవాణా విమానాలను బ్రిటనునుంచి కొనవచ్చునని వచ్చిన వార్తలను బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి నేడు ధ్రువీకరించారు.

కామన్సుసభలో వచ్చిన ప్రశ్నలకు, వైమానిక మంత్రిత్వశాఖ ఉపమంత్రి హీల్ మాంక్ సమాధానం చెబుతూ, పైన తెల్పిన రకాల విమానాలను పరిశీలించడానికి ఇటీవలనే చైనా ప్రతినిధివర్గం బ్రిటను వచ్చిందన్నారు.

చైనా ప్రతినిధివర్గం ఇంతవరకూ ఎట్టి నిర్ణయమూ చేయలేదు.

ఆ వ్యవహారాన్ని నివారించడానికి అమెరికానుండి యింతవరకూ ఎట్టి వత్తిడీలేదని ఆయన చెప్పారు

కొన్ని నెలలక్రితం చైనా ఆరుటర్బో-ప్రాప్ విమానాలకు ఆర్డరిచ్చింది వాటిని ఇంతవరకూ చైనాకు అందచేయనట్లు విశ్వసనీయవర్గాలద్వారా తెలుస్తుంది.

భారత - చైనా వివాదం మొదటి దశలో బ్రిటిషు అధికారులు ఈ విమానాల సరఫరాను వాయిదా వేశారు. ఈ వివాదం సంప్రతింపులద్వారా పరిష్కారము అయ్యేవరకూ, చైనా వారికి అవి లభ్యం కావని సూచించబడింది.

అరెస్టయిన చైనీయుల సంఖ్య 2 వేల 130

న్యూఢిల్లీ, జనవరి 28

భారతదేశంలో 1962 అక్టోబరు 26 నుండి అరెస్టు చేసిన చైనీయుల సంఖ్య 2 వేల 130 అందులో 1313 మందిని అస్సాంలోనూ, పశ్చిమ బెంగాల్‌లో 817 మందిని అరెస్టు చేశారు.

లోక్ సభలో శ్రీ హేం బారువా అడిగిన ప్రశ్నకు సమాధానంగా, దేశ వ్యవహారాల మంత్రి శ్రీ దాతార్ నేడు లోక్ సభలో చెప్పారు.

అరెస్టు కాబడిన చైనీయులకు [illegible] నిర్వాసం, దేశభద్రతకు భంగకరంగా భావించడం వలన ఈ చర్య తీసుకోబడిందన్నారు.

విడుదలైన భారత యుద్ధ ఖైదీల సంఖ్య 715

జెనీవా, జనవరి 28

ఇంతవరకూ చైనీయులు విడిచిపెట్టిన భారత యుద్ధఖైదీల సంఖ్య 715 అని, నేడు విడుదలైన అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ పత్రిక తెల్పుతోంది.

ఇప్పటికింకా 2,వేల పైచిలుకు భారత యుద్ధ ఖైదీలు చైనావారివద్ద నున్నారనీ, భారత రెడ్ క్రాస్ సంస్థకు చెప్పిన ప్రకారం 1181 మంది ఉన్నారని ఆ పత్రిక ప్రకటించింది భారత-చైనా సరిహద్దునుండి వచ్చిన 15 వేల మంది కాందిశీకుల సంక్షేమాన్ని భారత రెడ్ క్రాస్ సంస్థ అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ సహాయంతో కొనసాగిస్తోంది.

రాజమండ్రి 13 వ వార్డు కమ్యూనిస్టు శాఖ, మంగళవారపుపేట కమ్యూనిస్టు పార్టీశాఖ శ్రీ పి. శివానందం, శ్రీ నక్కా సూర్యారావుగార్ల మృతికి విచారం తెలుపుతూ తీర్మానించారు.

లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఆఫ్ ఇండియావారి
సాటిలేని ఏకైక ప్రదర్శనను
చూడడం మరచిపోకండి!
స్థలం కృష్ణాజిల్లా రైస్ & ఆయిల్ మిల్లర్సు అసోసియేషన్‌హాల్
గాంధీనగరం ★ విజయవాడ - 3
ప్రతిరోజూ చలన చిత్రప్రదర్శనము * ఆహ్లాదకరమైన చిత్రరువుల ప్రదర్శనలు వుంటాయి.
— ప్రవేశం ఉచితం —
ప్రముఖ వ్యక్తులచేత ఉపన్యాసములు ప్రతిరోజూ సా॥ 6 నుండి 7 గంటలవరకు

కరంటును
అలింద్
కేబిల్స్ ద్వారా
ప్రవహించనీయండి!

మీ గృహములకుగాని లేక పరిశ్రమలకుగాని కావలసిన కేబిల్స్‌కొరకు నాణ్యతలో మీరు నిశ్చింతగా ఆధారపడతగినవి అలింద్ కేబిల్స్ మాత్రమే

అలింద్ విద్యుద్బంధన కేబిల్స్ ఇండియన్‌స్టాండర్డ్స్ వివరణముల ననుసరించి ఇండియాలో అల్యూమినియమ్ కేబిల్స్ తయారు చేయుటలో మార్గదర్శకులయిన ది అల్యూమినియమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, కుండ్రా, (కేరళ రాష్ట్రము) వారిచే తయారు చేయబడినవి ఎలక్ట్రిసిటీ బోర్డులు, పి డబ్ల్యు.డి లు, ప్రైవేటు ఎలక్ట్రిసిటీ సంస్థలు మరియు పరిశ్రమలకు, ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఫైర్ శెక్షనల్ కమిటీ) మరియు డి జి యస్. & డి వారిచే అనుమతించబడినవి

అలింద్ కేబిల్స్ ఉపయోగించండి.
అవి మీ వైరింగ్ సమస్యలన్నింటిని పరిష్కరించును.

దయచేసి మీకు కావలసిన వివరములకు అంధ్రప్రదేశ్ సోల్ అమ్మకపు ఏజంట్లయిన దిగువవారికి వ్రాయండి.

ఓరియంటల్ ఏజెన్సీస్,
153, రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్ (ఆం. ప్ర.)
ఫోను 72739

అన్నిజిల్లాల్లోను మరియు పట్టణములలోను సబ్ డీలర్సు కావలెను

Saba

మాంగల్యానికి - మాతృత్వానికి ఘర్షణ అపూర్వం!
నేడే చూడండి!
విజయవాడ - శ్రీ విజయాలో
మ్యాట్నీతో ప్రారంభం
రోజూ 3 ఆటలు 26 శని, 27 ఆదివారము 4 ఆటలు

ముకుల్ మూవీస్ వారి షేర్ ఖాన్.
* కుంకుం * కమల్‌జీత్ * ఉల్హాస్ * జయంత్
సంగీతం: త్రిపాఠి
5000 అడుగులకు పైగా కలర్ దృశ్యాలు, మనోహరమైన కాశ్మీర్, జైపూర్, హైదరాబాద్ మరియు [illegible] ఔట్‌డోర్ దృశ్యాలు, భయంకరమైన పోరాటాలతో నిండిన చిత్రం.
తదుపరి చిత్రం:
పూర్ణా - విశాఖపట్టణం ★ శ్రీ రాధాకృష్ణా - గుంటూరు
—పూర్ణా ప్రొడక్షన్ రిలీజ్
SUVARNA

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు(అధ్యక్షులు), ఏటుకూరు బలరామమూర్తి, తుమ్మల వెంకటరామయ్య, విశాలాంధ్ర విజ్ఞానసమితి తరపున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, ప్రజాశక్తి ఆర్టు ప్రింటర్సు, విజయవాడ - 4.